

‘ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి గొంతు వినడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండాలి’

సత్యమేవ జయతే

# సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 16+20 వెల : ₹ 5.00

సంపుటి: 12 సంచిక: 111

శుక్రవారం 12-7-2019

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

**ఆప్టికల్ ఫైబర్‌కు ‘5జీ’ జోష్!**

5జీ సేవల కోసం ఆప్టికల్ ఫైబర్ కేబుల్స్‌కు పెరుగుతున్న ప్రాధాన్యం

– బిజినెస్‌లో



**వింబుల్డన్ ఫైనల్లో సెరెనా**

సిమోనా హలెప్‌తో తుది పోరుకు సిద్ధం

– స్పోర్ట్స్‌లో


## విత్తన సమస్య పాపం బాబు సర్కారుదే

అధికారులు ఎన్ని లేఖలు రాసినా స్పందించ లేదు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మండిపాటు

4.41 లక్షల క్వింటాళ్ల వేరుశనగ విత్తనం అవసరం

గత ప్రభుత్వం అందుబాటులో ఉంచింది కేవలం 50 వేల క్వింటాళ్లే



సాధారణంగా ఈ సంవత్సరం జూన్‌లో పంట వేయాలంటే గత ఏడాది నవంబర్‌లోనే విత్తనాల సేకరణ ప్రారంభించి ఏప్రిల్ కల్లా పూర్తి చేయాలి. మే నెలలో వాటిని పంపిణీ చేయాలి. కానీ, గత ప్రభుత్వం అలా చేయకపోవడం వల్లే రైతులు ఇక్కట్లు పడుతున్నారు.

– సీఎం వైఎస్ జగన్

- వివరాలు 2లో

## కాళేశ్వరం కడుతున్నప్పుడు ఏం చేశారు?

- ఆల్మట్టి ఎత్తు పెంచుతుంటే మిన్నకున్నది మీరు కాదా?
- ప్రాజెక్టు పూర్తయ్యాక వెళితే రాద్ధాంతం చేస్తారా?
- అసెంబ్లీలో ప్రతిపక్ష నేత చంద్రబాబుపై సీఎం వైఎస్ జగన్ ధ్వజం
- రాష్ట్రాన్ని విడగొడుతున్నప్పుడు మీరు సంతకం పెట్టలేదా?
- ఆనాడు సోనియా గాంధీ అంటే భయపడ్డారా?
- రెండు రాష్ట్రాలు సఖ్యతగా ఉంటే మేలు జరుగుతుంది

4 లో

## మాది రైతు పక్షపాత ప్రభుత్వం

గోదావరి జలాలను శ్రీశైలం, నాగార్జున సాగర్‌కు తరలిస్తాం

రైతులు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది: సీఎం వైఎస్ జగన్

గత ఐదేళ్లలో రాష్ట్రంలో తీవ్రమైన కరువు కాటకాలు

కేంద్రమిచ్చిన పెట్టుబడి రాయితీ ఎన్నికల పథకాలకు మళ్లించారు

కానీ మేం అలా కాదు.. అన్నదాతల కోసం రూ.2 వేల కోట్లతో విపత్తు నిధి

ఏ సీజన్‌లో పంట నష్టం వాటిల్లినా మరుసటి సీజన్‌కే సాయం

వైఎస్సార్ జలయజ్ఞం ద్వారా సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తాం

60 శాతం వ్యవసాయ పంపుసెట్లకు పగటిపూట 9 గంటల విద్యుత్

మిగిలిన 40 శాతం పంపుసెట్లకు వచ్చే ఏడాది నుంచి అమలు

**తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రతి నియోజకవర్గానికి రూ.కోటి**

మంచినీటి సమస్యను తక్షణమే పరిష్కరించేందుకు ప్రతి ఎమ్మెల్యే చేతిలో రూ.కోటి పెడుతున్నాం. ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు కూడా ఆ రూ.కోటి ఇస్తాం. ఈ నిధులు నేరుగా సీఎం డెవలప్‌మెంట్ ఫండ్ నుంచే ఇస్తున్నాం. కులాలు, మతాలు, ప్రాంతాలు, వర్గాలు, రాజకీయాలు, పార్టీలు చూడం.

– సీఎం వైఎస్ జగన్

- వివరాలు 2లో



గురువారం అసెంబ్లీలో జరిగిన చర్చలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్



### త్వరలో ‘అద్దె’ చట్టం!

దేశంలో భవనాలు, స్థలాలను అద్దెకు ఇవ్వడానికి సంబంధించి పలు నిబంధనలను రూపొందిస్తూ ‘అద్దె చట్టం’ తీసుకురావడానికి కేంద్రం సిద్ధమైంది. ఇందుకు సంబంధించిన ముసాయిదా బిల్లుపై ఆగస్టు 1లోగా ప్రజలు తమ అభిప్రాయాలను తెలపవచ్చు.

- వివరాలు 13లో



### అమిత్ షాతో గోవా సీఎం భేటీ

గోవా సీఎం ప్రమోద్.. బీజేపీ చీఫ్ అమిత్ షా, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నడ్డాతో ఢిల్లీలో భేటీ అయ్యారు. 10 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీజేపీలో చేరడంతో కేబినెట్ విస్తరణపై ఆయన చర్చించినట్లు తెలుస్తోంది.

- వివరాలు 13లో

# ‘నవరత్నాల’ బడ్జెట్ నేడే

## హామీలకు పెద్దపీట.. జనరంజకంగా జగన్ సర్కారు తొలి బడ్జెట్

**దాదాపు రూ.2.31 లక్షల కోట్లతో రాష్ట్ర వార్షిక బడ్జెట్** | **రూ.28,866 కోట్లతో వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్**

- అసెంబ్లీలో బడ్జెట్ సమర్పించనున్న ఆర్థిక మంత్రి బుగ్గన, మండలిలో మంత్రి సుభాష్ చంద్రబోస్
- అమ్మ ఒడి, వైఎస్సార్ రైతు భరోసాకు తగిన కేటాయింపులు
- సాగునీటి రంగానికి అత్యధిక ప్రాధాన్యం
- పేదల గృహ నిర్మాణానికి చేయూత
- విద్య, వైద్య రంగాల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు
- చేనేత, మత్స్యకారులు, ఆటోడ్రైవర్లు, అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకునేలా బడ్జెట్ కేటాయింపులు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు పెళ్లి కానుక వరాలు
- గ్రామ వలంటీర్లు, గ్రామ సచివాలయాలకు తగినన్ని నిధులు
- గత సర్కారు రైతన్నలకు ఎగ్గొట్టిన రూ.2,000 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లించేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించనున్న రాష్ట్ర ప్రభుత్వం
- టీడీపీ ప్రభుత్వం మిగిల్చిన భారీ బకాయిలను భరిస్తూనే ప్రజారంజక బడ్జెట్‌కు రూపకల్పన



### కేటాయింపులు ఇలా ఉండవచ్చు (రూ. కోట్లలో)


| పథకం పేరు | కేటాయింపులు | పథకం పేరు | కేటాయింపులు |
|---|---|---|---|
| వైఎస్సార్ పెన్షన్ కానుక | 18,000 | ఆసుపత్రుల్లో మౌలిక వసతులు | 2,000 |
| అమ్మఒడి | 6,500 | రైతుల వాటాగా సర్కారు చెల్లించే పంటల బీమా ప్రీమియం | 2,163 |
| వైఎస్సార్ రైతు భరోసా | 8,500 | విపత్తుల నిర్వహణ నిధి | 2,000 |
| గృహ నిర్మాణం | 8,000 | ధరల స్థిరీకరణ నిధి | 3,000 |
| జలవనరులు | 12,000 | అగ్రిగోల్డ్ బాధితులకు | 1,150 |
| ఆరోగ్య, కుటుంబ సంక్షేమం | 12,000 | విద్యుత్ సబ్సిడీ | 5,000 |
| పాఠశాలలు, హాస్టళ్లలో మౌలిక వసతులు | 2,000 | | |

**సాక్షి, అమరావతి:** తొలిసారిగా శుక్రవారం శాసనసభలో ప్రవేశపెట్టనున్న రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జనరంజకంగా తీర్చిదిద్దింది. మేనిఫెస్టోలో నవరత్నాల ద్వారా ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చడమే లక్ష్యంగా బడ్జెట్‌కు రూపకల్పన చేసింది. రాష్ట్ర వార్షిక బడ్జెట్ రూ.2.31 లక్షల కోట్ల నుంచి రూ.2.32 లక్షల కోట్ల మధ్య ఉండవచ్చని సమాచారం. అన్నదాతల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం వ్యవసాయానికి రూ.28 వేల కోట్లతో ప్రత్యేక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నట్లు తెలిసింది.

**రైతుల పట్ల సీఎం చిత్తశుద్ధికి ఇదిగో నిదర్శనం..**

టీడీపీ సర్కారు పెద్ద ఎత్తున బిల్లులను చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టడమే కాకుండా భారీ అప్పులను నూతన ప్రభుత్వానికి అప్పగించింది. ఆర్థిక వ్యవస్థ ఇంత క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌తో కలసి బడ్జెట్ రూపకల్పనపై సుదీర్ఘ కసరత్తు చేశారు. గత సర్కారు బకాయిల్లో కొన్నింటిని పరిగణనలోకి తీసుకుని బడ్జెట్‌లో కేటాయింపులు చేయడం విశేషం. ఇందుకు ఉదాహరణ రైతులకు గత సర్కారు బకాయి పడ్డ ఇన్‌పుట్ సబ్సిడీని చెల్లించాలని సీఎం వైఎస్ జగన్

మిగతా 2వ పేజీలో ▶



# స్పీకర్ కోర్టులో బంతి

రెబల్ ఎమ్మెల్యేల రాజీనామా విషయమై ఓ నిర్ణయం తీసుకోవాలనే సుప్రీంకోర్టు నన్ను కోరింది. 10 మంది శాసనసభ్యులతో జరిగిన భేటీని వీడియో తీయించాను. దీన్ని శుక్రవారం సుప్రీంకోర్టుకు సమర్పిస్తాను. ఎమ్మెల్యేలు స్వచ్ఛందంగానే రాజీనామాలు సమర్పించారా లేదా అనే విషయమై రాత్రంతా ఆలోచించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ప్రజలకు, రాష్ట్రానికి, పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థకు తప్ప నేను ఎవ్వరికీ జవాబుదారీ కాదు.

- కర్ణాటక స్పీకర్ రమేశ్‌కుమార్

13 లో

- కర్ణాటక స్పీకర్ రమేశ్ కుమార్‌తో 10 మంది రెబల్ ఎమ్మెల్యేల భేటీ
- సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు స్పీకర్‌కు తాజా రాజీనామాల అందజేత
- ఇష్టపూర్వకంగానే రాజీనామాలిచ్చారా అన్నది పరిశీలిస్తా: స్పీకర్
- కర్ణాటక అసెంబ్లీ వద్ద 144 సెక్షన్
- రాజీనామా చేయను: సీఎం కుమారస్వామి

## 32 రోజుల్లోనే ‘మరణ శిక్ష’ తీర్పు



మైనర్ బాలికను రేప్ చేసి చంపిన కేసుతో పాటు మరో లైంగిక దాడికి పాల్పడిన కేసుల్లో దోషికి మధ్యప్రదేశ్ కోర్టు మరణ శిక్ష విధించింది. గత నెల 8న విష్ణు బమోరా(32), ఓ బాలికను (12) రేప్ చేసి చంపేశాడు. ఈ బాలికతో పాటు మరో ఎనిమిదేళ్ల బాలికపై అసహజ లైంగిక దాడి చేసినందుకు పోలీసులు పోక్సో, ఐపీసీ చట్టాల కింద కేసులు నమోదు చేశారు.

- వివరాలు 13లో


సాక్షి సెలబ్రేషన్ ఆఫర్

2 కూపన్

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE | Vencobb CHICKEN | ప్రతిపాదించిన నేటి గుడ్లు & చికెన్ విజయవాడ జోన్ ధరలు

| | | | | |
|---|---|---|---|---|
| గుడ్ల రిటైల్ ధర ₹ 55 డజన్ | ఫారం దగ్గర లైవ్ బర్డ్ | 85 కిలో | డ్రెస్డ్ స్కిన్‌తో | 155 కిలో |
| | రిటైల్ లైవ్ బర్డ్ | 107 కిలో | స్కిన్‌లెస్ | 177 కిలో |

Conditions Apply


ఇదం జగత్



...మీరు 500 కి.మీ. చేయలేమో సార్!

## ప్రపంచ కప్ ఫైనల్లో ఇంగ్లాండ్

**సెమీ ఫైనల్లో ఆస్ట్రేలియాపై 8 వికెట్ల తేడాతో ఘన విజయం**



సెమీస్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా ఖేల్ ఖతమైంది. ఈ ప్రపంచకప్‌లో కొత్త చాంపియన్ ఖాయమైంది. గురువారం జరిగిన రెండో సెమీఫైనల్లో ఇంగ్లండ్ 8 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాపై జయకేతనం ఎగురవేసింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా 49 ఓవర్లలో 223 పరుగుల వద్ద ఆలౌటైంది. స్మిత్ (119 బంతుల్లో 85; 6 ఫోర్లు) ఒంటరి పోరాటం చేశాడు. ‘మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్’ క్రిస్ వోక్స్ ప్రత్యర్థిని దెబ్బతీశాడు. లక్ష్యఛేదనకు దిగిన ఇంగ్లండ్ 32.1 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 226 పరుగులు చేసింది.

– స్పోర్ట్స్‌లో

## ఉందిలే మంచి కాలం

గ్రీన్‌కార్డు కోటా బిల్లుకు అమెరికా గ్రీన్ సిగ్నల్

అమెరికాలోని భారతీయుల్లో హర్షాతిరేకాలు



అమెరికాలో శాశ్వత నివాసం కోసం కలలు కంటూ ఉద్యోగాల ఆధారిత గ్రీన్ కార్డు కోసం దశాబ్దాల తరబడి ఎదురు చూస్తున్న భారతీయులకు ఇది శుభవార్త. గ్రీన్‌కార్డులను ఒక్కో దేశానికి గరిష్టంగా ఏడు శాతం మాత్రమే మంజూరు చేయాలన్న కోటా పరిమితిని ఎత్తివేసే బిల్లుకి అమెరికా ప్రతినిధుల సభ బుధవారం ఆమోద ముద్ర వేసింది.

- వివరాలు 13లో

## కోగంటే సూత్రధారి!




సత్యం

4లో

- రాంప్రసాద్ హత్యకు రెండు నెలల క్రితమే కుట్ర!
- హత్యకు కోటి రూపాయల సుపారీ
- అనుకూలంగా ఉందనే హత్యకు పంజగుట్ట ఎంపిక
- నిందితులకు వ్యతిరేకంగా ఆధారాల సేకరణ
- కొలిక్కి వచ్చిన స్టీల్ వ్యాపారి రాంప్రసాద్ హత్య కేసు
- వ్యాపార లావాదేవీలే హత్యకు కారణం
- 9 మంది అదుపులో.. మరొకరి కోసం గాలింపు

## జైసింగ్ దంపతులపై సీబీఐ దాడులు



- స్వచ్ఛంద సంస్థ ద్వారా ఎఫ్‌సీఆర్‌ఏ నిబంధనలు ఉల్లంఘించారని ఆరోపణలు
- ఢిల్లీలోని ఇల్లు, కార్యాలయంతోపాటు ముంబై ఆఫీస్‌లోనూ సోదాలు



“ జైసింగ్ భర్త ఆనంద్ గ్రోవర్ తన స్వచ్ఛంద సంస్థ ద్వారా రూ.32.39 కోట్లకుపైగా అవకతవకలకు పాల్పడ్డారు.

- హోంశాఖ ఫిర్యాదు

- వివరాలు 13లో

## 40 వేల ఉద్యోగాల భర్తీకి సన్నద్ధం

- వార్డు సచివాలయాల్లో ఉద్యోగాల భర్తీకి త్వరలో నోటిఫికేషన్.. పట్టభద్రులు, ఉన్నత విద్యావంతులు అర్హులు
- ఒక్కో సచివాలయంలో పది కొత్త ఉద్యోగాలు
- 10 విభాగాలు, 18 సేవలు
- కార్యదర్శుల విధులు, బాధ్యతలు వెల్లడి

5 లో

# 'నవరత్నాల' బడ్జెట్ నేడే

▶ మొదటి పేజీ తరువాయి

నిర్ణయించడం. కరువు కాటకాలతో పంటలు కోల్పోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వకుండా టీడీపీ సర్కారు ఎగనామం పెట్టింది. గత సర్కారు ఎగ్గొట్టిన రూ.2,000 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీని రైతులకు ఇవ్వాలని ముఖ్యమంత్రి జగన్ నిర్ణయం తీసుకోవడమే కాకుండా ఆ మేరకు బడ్జెట్‌లో కేటాయింపులు చేయించడం అన్నదాతల పట్ల ఆయన చిత్తశుద్ధిని రుజువు చేస్తోంది. మరోపక్క వృథా, దుబారా, ఆర్భాటపు వ్యయాలకు తెరదించుతూ అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధిని సమ్మిళితం చేస్తూ ఆయా రంగాలకు బడ్జెట్‌లో కేటాయింపులు చేశారు. అమ్మ ఒడి, వైఎస్సార్ రైతు భరోసా, పేదల గృహాలతో పాటు వ్యవసాయం, సాగునీరు, విద్య, వైద్య రంగాలకు బడ్జెట్‌లో ప్రాధాన్యం కల్పించారు.

### సంక్షేమానికి పెద్దపీట

సుదీర్ఘ కసరత్తు అనంతరం రూపొందించిన బడ్జెట్‌లో అన్ని సంక్షేమ కార్యక్రమాలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తగిన విధంగా కేటాయింపులు చేయాలని నిర్ణయించింది. రాష్ట్రాభివృద్ధిపై దూరదృష్టితో ఆలోచించి గోదావరి జలాలను శ్రీశైలానికి తరలింపు ప్రతిపాదనతోపాటు పోలవరం, వంశధార, గాలేరు నగరి ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేలా బడ్జెట్ రూపొందించారు. రూ.5 లక్షల లోపు వార్షిక ఆదాయం కలిగిన అన్ని కుటుంబాలకు యూనివర్సల్ హెల్త్ కేర్ కార్డులు ఇవ్వాలని నిర్ణయించిన నేపథ్యంలో మధ్య తరగతి ప్రజలకు కొండంత ఆరోగ్య భరోసా కల్పించేలా



బడ్జెట్‌లో కేటాయింపులు చేయనున్నారు. చేనేత, మత్స్యకారులు, ఆటో డ్రైవర్లుతోపాటు అగ్రి గోల్డ్ బాధితులను ఆదుకునేలా కేటాయింపులు ఉంటాయని పేర్కొంటున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన యువతుల వివాహాల కోసం పెళ్లి కానుక కింద బడ్జెట్‌లో కేటాయింపులు చేస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థకు బడ్జెట్‌లో తగిన కేటాయింపులు ఉండనున్నాయి.

### అన్ని పథకాలకు తగిన విధంగా కేటాయింపులు..

ప్రధానంగా ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక వసతుల కల్పన, ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు కేటాయించనున్నారు. ఎస్సీ, ఎస్టీ కాలనీలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్

**రూ.2.31 లక్షల కోట్లతో రాష్ట్ర బడ్జెట్!**

గత తెలుగుదేశం ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దివాళా తీయించి నూతన సర్కారుకు ఖాళీ ఖజానా అప్పగించినప్పటికీ సంక్షేమ పథకాలకు పెద్దపీట వేస్తూ రూ. 2.31 లక్షల కోట్ల నుంచి రూ.2.32 లక్షల కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టాలని సుదీర్ఘ కసరత్తు అనంతరం ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి నిర్ణయించినట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. రాష్ట్ర సొంత ఆదాయం రూ.85 వేల కోట్ల నుంచి రూ.86 వేల కోట్ల వరకు ఉంటుందని బడ్జెట్‌లో అంచనా వేశారు. కేంద్రం నుంచి గ్రాంట్ల రూపంలో రూ.60 వేల కోట్లకుపైగా వస్తాయని భావిస్తున్నారు. కేంద్ర పన్నుల వాటా రూపంలో రూ.34 వేల నుంచి రూ.36 వేల కోట్ల దాకా రాష్ట్రానికి వస్తాయని అంచనా వేశారు.


సరఫరాకు కేటాయింపులతోపాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ హాస్టళ్లకు ప్రభుత్వం ప్రత్యేక కేటాయింపులు చేయనుంది. ఆత్మహత్యకు పాల్పడటం లేదా ప్రమాదవశాత్తు చనిపోయిన రైతన్నల కుటుంబాలకు రూ. ఏడు లక్షల చొప్పున పరిహారం చెల్లించేందుకు బడ్జెట్‌లో కేటాయింపులు చేస్తున్నారు. సహకార రంగం పునరుద్ధణకు నిధులు కేటాయించనున్నారు. రైతులకు ఉచితంగా బోర్లు వేసేందుకు బడ్జెట్‌లో తగినన్ని నిధులు

## రూ.28 వేల కోట్లతో వ్యవసాయ బడ్జెట్!

**వ్యవసాయ మంత్రి కన్నబాబుకు బదులుగా అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న మంత్రి బొత్స**

సాగుకు ప్రాధాన్యం ఇస్తూ వ్యవసాయానికి సంబంధించి ప్రత్యేకంగా బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం నేడు అసెంబ్లీలో ప్రవేశపెడుతోంది. అనుబంధ రంగాలతో కలిపి రూ.28,866 కోట్ల వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఇందులో కేవలం వ్యవసాయ రంగానికే రూ.12,510 కోట్లను కేటాయించనున్నారు. పశు సంవర్ధక శాఖకు రూ.1,240 కోట్లు, వ్యవసాయ మార్కెటింగ్ శాఖకు రూ.3,212 కోట్లు, విద్యుత్ సబ్సిడీకి రూ.5,000 కోట్లను కేటాయించనున్నారు. అన్నదాతల సంక్షేమం కోసం కృషి చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వ్యవసాయ బడ్జెట్‌ను గత ఏడాది కన్నా 10 – 15 శాతం ఎక్కువ అంచనాలతో రూపొందించినట్లు సమాచారం. వ్యవసాయ శాఖ మంత్రి కురసాల కన్నబాబు సోదరుడు సురేష్ అకాల మృతి చెందిన నేపథ్యంలో మంత్రులు బొత్స, మోపిదేవి అసెంబ్లీ, శాసన మండలిలో వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు.

**వ్యవసాయానికి గత కేటాయింపులు ఇలా...**




దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉండగా వ్యవసాయానికి ప్రత్యేకంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలని యోచించారు. 2013–14 నుంచి ఇది ఆచరణలోకి వచ్చింది.

కేటాయించనున్నారు. కడపలో స్టీల్ ప్లాంటు ఏర్పాటు కోసం కూడా బడ్జెట్‌లో కేటాయింపులు చేయనున్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీకి బడ్జెట్‌లో రూ.1,740 కోట్లను కేటాయించనున్నారు.

### నేడు ఉదయం బడ్జెట్‌కు మంత్రిమండలి ఆమోదం

ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ శుక్రవారం ఉదయం 11 గంటలకు అసెంబ్లీలో తొలిసారిగా రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఇదే సమయానికి శాసన మండలిలో రెవెన్యూ మంత్రి పిల్లి సుభాష్ చంద్రబోస్ బడ్జెట్ సమర్పిస్తారు. వ్యవసాయ బడ్జెట్‌ను పట్టణాభివృద్ధి శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అసెంబ్లీలో, మంత్రి మోపిదేవి వెంకటరమణ శాసన మండలిలో ప్రవేశపెట్టనున్నారు. అంతకు ముందు శుక్రవారం ఉదయం 8 గంటలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రిమండలి సమావేశమై బడ్జెట్‌కు ఆమోద ముద్ర వేయనుంది.

# మాది రైతు పక్షపాత ప్రభుత్వం

**రైతులు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది**
**అసెంబ్లీలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్**

సాక్షి, అమరావతి

రాష్ట్రంలో రైతాంగ సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం అన్ని విధాల చర్యలు తీసుకుంటుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రకటించారు. ఇది రైతు సంక్షేమ ప్రభుత్వమని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే అనేక కార్యక్రమాలు చేపట్టిందని వివరించారు. గత ప్రభుత్వం రైతు సమస్యలను గాలికొదిలేసిందని, బకాయిలు విడుదల చేయకుండా పక్కాదారి పట్టించడం వల్లే ఖరీఫ్‌లో విత్తన సమస్య ఏర్పడిందని ఎండగట్టారు. అయిదేళ్లుగా వరుస కరువుల వల్ల దారుణంగా నష్టపోయిన అన్నదాతలను ఆదుకోవాల్సిందిపోయి తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించిన తీరు బాధ కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కరువు పరిస్థితిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం శాసనసభలో మాట్లాడారు. రాష్ట్రంలో సాగు నీటి ఎద్దడి, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో గత ప్రభుత్వం అయిదేళ్లలో అనుసరించిన తీరు, రైతుల పక్షపాత ప్రభుత్వంగా ప్రస్తుతం ఏమి చేయబోతున్నామనే విషయాలు ఈ బడ్జెట్ సమావేశాల్లో మొదటి రోజు సభ ముందు ఉంచుతున్నామంటూ ముఖ్యమంత్రి తన ప్రసంగాన్ని ప్రారంభించారు. రాష్ట్రంలో 62 శాతం మంది రైతులే ఉన్నారని, రైతులు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని నొక్కి చెప్పారు. నైరుతి రుతు పవనాల సీజన్‌లో ఇప్పటి (జూన్ ఒకటో తేదీ నుంచి ఈ నెల 10వ తేదీ) వరకు 135.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 48.3 శాతం లోటుతో 70.1 మిల్లీమీటర్ల వర్షం మాత్రమే కురిసిందని సీఎం పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్‌లో సగటున 42 లక్షల హెక్టార్లలో పంటలు సాగు కావాల్సి ఉండగా జూన్ 1 నుంచి జూలై 10 నాటికి సగటున 9.15 లక్షల హెక్టార్లలో విత్తనాలు, నాట్లు పడాల్సి ఉండగా ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 3.82 లక్షల హెక్టార్లలో మాత్రమే విత్తనాలు పడ్డాయని వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇంకా ఏం చెప్పారంటే..

### రైతుల జీవితాలతో ఆడుకున్నారు

'వర్షాలు ఆలస్యమయ్యాయి. ఒక వైపు గ్రామాల్లో తాగునీటి కొరత పెరుగుతుండగా, మరో వైపు జూలై రెండో వారం వచ్చినా విత్తనాలు వేయని పరిస్థితి ఉంది. వీటన్నింటినీ సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఇదే సమయంలో మరికొన్ని నిజాలను కూడా సభ ముందు ఉంచుతున్నా. మేం అధికారంలోకి వచ్చి కేవలం 40 రోజులు మాత్రమే అయినప్పటికీ ఈ పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం. 2013 – 2014లో ఒక వైపు తీవ్రమైన కరువు, మరోవైపు వరుస తుపాన్లు రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేశాయి. ఆదుకుంటామని నమ్మించి అధికారంలోకి వచ్చిన గత ప్రభుత్వం రూ.2,300 కోట్ల పెట్టుబడి రాయితీని ఎగ్గొట్టింది. గత ఏడాది కొనుగోలు చేసిన ధాన్యానికి కూడా రైతులకు గత ప్రభుత్వం రూ.960 కోట్లు బకాయిలు పెట్టింది. అక్షరాలా రూ.384 కోట్లు విత్తన బకాయిలు ఉన్నాయని, కనీసం అవైనా చెల్లించాలని అడిగితే గత సర్కారు ఇవ్వలేదు. రైతుల జీవితాలతో ఆడుకున్నారని అధికారులు సైతం చెబుతుంటే నిజంగా ఇది ఎంత మానవత్వం లేని ప్రభుత్వం అని బాధనిపించింది. కరువు సంవత్సరాల్లో కనీసం వడ్డీ మాఫీ కూడా చేయలేదు. కరువు సంభవించినప్పుడు ఏ రైతు అయినా కనీసం వడ్డీ మాఫీ చేసి రుణాలు రీషెడ్యూలు చేయాలని కోరుకుంటారు. అయితే గత ప్రభుత్వ హయాంలో తీవ్ర కరువులు సంభవించినా రుణాల రీషెడ్యూలు చేయలేదు. వడ్డీ మాఫీ మాటే లేదు. అలాంటి ఆలోచనలుగానీ, ప్రతిపాదనలు గానీ ఏ రోజూ గత ప్రభుత్వం నుంచి రాలేదు.

### పగటి పూట 9 గంటల ఉచిత విద్యుత్‌కు శ్రీకారం

దారుణమైన పరిస్థితుల్లో ఉన్న రైతుల సంక్షేమం కోసం మేము అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే వారికి తోడుగా ఉండేందుకు ఏమేం చేశామన్నది గర్వంగా చెబుతాం. వైఎస్సార్



**ప్రాజెక్టుల నుంచి నీరు పారిస్తాం**

గోదావరి జలాలను శ్రీశైలం, నాగార్జున సాగర్‌కు తరలించేందుకు గొప్ప కార్యక్రమం చేపట్టబోతున్నాం. ఇది ఒక చరిత్ర. రైతులకు ఉచిత విద్యుత్ అందించడమే కాకుండా 200 రిగ్గులు కొనుగోలు చేసి అడిగిన ప్రతి ఒక్కరికి బోర్లు వేస్తామని ప్రకటిస్తున్నా. వైఎస్సార్ జలయజ్ఞం ద్వారా సకాలంలో చెరువుల పునరుద్ధరణ చేయబోతున్నాం. సకాలంలో ప్రాజెక్టులు పూర్తి చేస్తాం. ఇరిగేషన్ ప్రాజెక్టులు అన్నీ కూడా అవినీతిమయం అయ్యాయి. ఈ వ్యవస్థలో మార్పులు తెస్తాం. అవినీతి జరిగిన ప్రతి చోట రివర్స్ టెండరింగ్ పిలుస్తాం. ప్రాజెక్టుల నుంచి నీళ్లు ఎలా ప్రవహింపజేయాలో చేసి చూపిస్తాం. (ఈ సందర్భంగా టీడీపీ వారు పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తగా సీఎం అభ్యంతరం వ్యక్తం చేశారు. గత అయిదేళ్లలో అధికారంలో ఉన్నప్పుడు చేసిందే ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడూ చేస్తున్నారని తప్పుబట్టారు. వయసు పెరిగినా బుద్ధి పెరగలేదు. ఎదిగేకొద్దీ ఒదిగి ఉండాలి. సభా నాయకుడు మాట్లాడేప్పుడు సంయమనం పాటించాలి. ఇది కూడా తెలుసుకోకపోతే ఎలా? అని సీఎం హితవు చెప్పారు.) సహకార రంగంలోని డెయిరీలకు పాలు పోసే రైతులకు లీటర్‌కు రూ.4 బోనస్ ఇస్తాం. గ్రామ సచివాలయాలు, గ్రామ వలంటీర్ వ్యవస్థ ప్రతి రైతుకు మేలు చేసే దిశగా అడుగులు వేస్తున్నాం. నీటి ఎద్దడి, కరువును ఎదుర్కొనేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

> **"గత ఐదేళ్ల ప్రభుత్వ హయాంలో తీవ్రమైన కరువు చూశాం. గత ఏడాది (2018 -19) ఒక్క ఖరీఫ్‌లోనే కరువును ఎదుర్కొనేందుకు అక్షరాలా రూ.1,838 కోట్లు అవసరమని గత ప్రభుత్వం లెక్కలు కట్టింది. ఈ మేరకు ఇన్‌పుట్ సబ్సిడీ అవసరమని తేల్చింది. ఇందులో రూ.900 కోట్లు కేంద్రం నుంచి మనకు వచ్చింది. అయినా పంట నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ లేదా సహాయం రూపంలో ఒక్క రూపాయి కూడా ఇచ్చిన పాపాన పోలేదు."**

సున్నా వడ్డీ రుణాల పథకానికి శ్రీకారం చుట్టాము. ఇచ్చిన మాట ప్రకారం 60 శాతానికి పైగా వ్యవసాయ కనెక్షన్లకు పగటి పూట 9 గంటల విద్యుత్ ఇస్తున్నాం. మిగిలిన 40 శాతం ఫీడర్ల ద్వారా 9 గంటలు పగటి పూట విద్యుత్ సరఫరా చేయడానికి మౌలిక సదుపాయాల కల్పనకు రూ.1,700 కోట్లు అవసరమని అధికారులు చెప్పగానే నిధులు మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకున్నాం. వచ్చే జూన్ నాటికి ఈ 40 శాతం ఫీడర్లలో కూడా రైతులకు 9 గంటలు పగటిపూటే విద్యుత్ సరఫరా చేస్తాం. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్ రూ.1.50కే ఇస్తున్నాం. దీనివల్ల అక్షరాలా రూ.720 కోట్ల మేరకు ఆక్వా రైతులకు ప్రయోజనం కలుగనుంది.

### వైఎస్సార్ ఉచిత పంటల బీమా

వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం ప్రవేశపెట్టాం. ఈ పథకం ద్వారా 55 లక్షల మంది రైతుల తరపున 1.38 కోట్ల ఎకరాలకు అక్షరాలా రూ.2,164 కోట్ల బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తుంది. రైతుల పంటలకు గిట్టుబాటు ధరల కల్పన కోసం రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేస్తున్నాం. నష్టాల్లో ఉన్న శనగ రైతులను ఆదుకునేందుకు ఇప్పటికే క్వింటాల్‌కు రూ.1,500 చొప్పున రూ.330 కోట్లు విడుదల చేశాం. ఈ మొత్తాన్ని ఇప్పటికే పంపిణీ చేస్తున్నాం. మొన్న జమ్మలమడుగులో చెక్కుల పంపిణీ కూడా ప్రారంభించాం. మన సరిహద్దులో ఉన్న తెలంగాణలో ఆయిల్‌ఫామ్ ధర మన రాష్ట్రంలో కంటే రూ.1,000 ఎక్కువగా ఉంది. రైతులు ఎంత అడిగినా గత సర్కారులో పట్టించుకున్న నాథుడే లేరు. మనం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆయిల్‌ఫామ్ రైతులకు అదనపు మద్దతు ధర కల్పిస్తూ రూ.80 కోట్లు విడుదల చేశాం. దీనివల్ల 1.10 లక్షల మందికి లబ్ధి చేకూరుతుంది. పొగాకు ధరలు పడిపోతున్న తరుణంలో వెంటనే స్పందించాం. గతంలో జగన్ అనే వ్యక్తి అక్కడికి వెళ్లి ధర్నా చేస్తే తప్ప రైతులకు మేలు జరగలేదు. ఈసారి పరిస్థితి మారింది. పొగాకు ధరలు పడిపోకుండా మంత్రి వెళ్లారు. లోగ్రేడ్ పొగాకుకు కూడా మంచి ధర వచ్చేలా చేశారు. కొనుగోలు కార్యక్రమానికి కూడా శ్రీకారం చుట్టాం.

### మార్కెట్ కమిటీల గౌరవ చైర్మన్లుగా ఎమ్మెల్యేలు

ప్రతి జిల్లాలో వివిధ నియోజకవర్గాల్లో వివిధ పంటల ధరలు ఎలా ఉండాలో తెలుసుకునేందుకు, ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చేందుకు మార్కెట్ కమిటీలకు ఇకపై ఎమ్మెల్యేను గౌరవ చైర్మన్లుగా నియమించాలని నిర్ణయం తీసుకున్నా. మార్కెట్ కమిటీలకు ఎగ్జిక్యూటివ్ చైర్మన్లు ఎలాగూ ఉంటారు. ఎమ్మెల్యేలు కూడా మార్కెట్ కమిటీల సమావేశాలకు హాజరవుతూ ఎప్పటి కప్పుడు ధరలు తెలుసుకుంటూ అక్కడ పండే పంటలకు గిట్టుబాటు ధరను ప్రభుత్వానికి సిఫార్సు చేస్తారు. రూ.3 వేల కోట్ల ధరల స్థిరీకరణ నిధులతో రైతులకు మేలు చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నాం. గత ప్రభుత్వం విత్తన బకాయిలు విడుదల చేయకుండా రైతులను గాలికొదిలేస్తే మా ప్రభుత్వం రూ.384 కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ధాన్యం సేకరణకు రూ.960 కోట్లు బకాయిలు పెట్టారు. ఆ మొత్తం కూడా విడుదల చేస్తూ నిర్ణయం తీసుకున్నాం. ఇందులో భాగంగా రూ.360 కోట్లు విడుదల చేశామని గర్వంగా చెబుతున్నాను. ఇన్‌పుట్ సబ్సిడీ బకాయిలు కూడా రూ.2 వేల కోట్లు మా ప్రభుత్వం చెల్లిస్తుందని చెబుతున్నాను. వ్యవసాయ ట్రాక్టర్లకు రోడ్డు ట్యాక్స్ రద్దు చేశాం. వ్యవసాయ మిషన్ ఏర్పాటు చేశాం. ప్రతి నెల ఈ మిషన్ సమావేశం నిర్వహించి, క్షేత్ర స్థాయిలో విషయాలు తెలుసుకొని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. ఇవన్నీ నెల రోజుల్లోనే చేశాం.

> **"రాష్ట్రంలో 70 లక్షల మంది రైతులు, కౌలు రైతులకు వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా ఏటా రూ.8,750 కోట్లు సహాయం చేయబోతున్నాం. దాదాపు 16 లక్షల మంది కౌలు రైతులకు కూడా సహాయం అందించబోతున్నాం. ఒకే విడతలో ఇంత మంది రైతులకు సహాయం చేయనుండటం దేశంలోనే రికార్డు అవుతుంది. ఈ సొమ్మును బ్యాంకులు ఇతర రుణాల కింద జమ చేసుకోకుండా నిబంధన కూడా తీసుకొస్తున్నాం. భూ యాజమాన్య హక్కులు పూర్తిగా కాపాడుతూ కౌలు రైతు చట్టంలో మార్పులు చేస్తాం. అభద్రతా భావం తొలగించేలా ఇదే అసెంబ్లీ సమావేశాల్లోనే బిల్లు పెడతాం."**

### ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలకు భరోసా

ప్రమాదవశాత్తు రైతులు మరణించినా, ఆత్మహత్య చేసుకున్నా గతంలో ఎవరూ పట్టించుకునే వారు కాదు. 2014 – 2018 వరకూ డిస్ట్రిక్ట్ క్రైమ్ బ్యూరో లెక్కల ప్రకారం 1,513 మంది ఆత్మహత్య చేసుకుంటే వారిలో 391 మందికి మాత్రమే అంతో ఇంతో సహాయం అందజేశారు. మేము అధికారంలోకి రావడంతోనే ఆత్మహత్య చేసుకున్న రైతులకు రూ.7 లక్షల పరిహారం ఇవ్వాలని నిర్ణయించాం. గత ప్రభుత్వ ఐదేళ్ల హయాంలో ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలకు కూడా ఈ సాయం అందించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించాం. అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే మా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలివీ. ఇక ఏడాదిలో ఏమి చేస్తామో చెబుతాను. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా మరో పథకం తెస్తున్నాను. తుపాన్లు, కరువులు వస్తే గత

> **"కరువు కాలంలో ఉపాధి కల్పనకు తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను కోరాం. ఇంకా ప్రతిపక్షంలో ఉన్న వారు కూడా ఎలాంటి మంచి సూచనలు, సలహాలు ఇచ్చినా స్వీకరిస్తాం."**

ప్రభుత్వంలాగా బాధిత రైతులను గాలికి వదిలేయకుండా తక్షణమే ఆదుకునేందుకు రూ.2,000 కోట్లతో విపత్తు సహాయ నిధి ఏర్పాటు చేస్తున్నాం.

### గోడౌన్లు, కోల్డు స్టోరేజీలు, ల్యాబ్‌ల ఏర్పాటు

రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది. రాష్ట్ర జనాభాలో 62 శాతం రైతులే ఉన్నారు. 62 శాతం జనాభా కష్టాల్లో ఉంటే రాష్ట్రం ఎలా బాగుంటుందని నేను ఆలోచించాను. మేము ప్రకటించిన నవరత్నాలు కూడా రైతులు, పేదలకు మేలు చేసే విధంగా రూపొందించాం. అందులో ఒకటి వైఎస్సార్ రైతు భరోసా. ఈ పథకంలో భాగంగా ప్రతి రైతు కుటుంబానికి పెట్టుబడి కింద అక్షరాలా రూ.12,500 ఈ అక్టోబర్ 15వ తేదీ నుంచే అందించనున్నామని సగర్వంగా చెబుతున్నాను. మేనిఫెస్టోలో చెప్పిన దానికి ఏడు నెలల ముందు నుంచే ఈ పథకం అమలు చేస్తున్నాం. రాష్ట్ర రైతుల్లో 50 శాతం మందికిపైగా 1.25 ఎకరాల లోపు భూమి మాత్రమే ఉంది. 2.5 ఎకరాల లోపు భూమి ఉన్న రైతులు 70 శాతం మంది ఉన్నారు. ఇలాంటి రైతులకు ఈ సహాయం చాలా ఉపయోగపడుతుంది. తొలి ఏడాదే సహకార రంగాన్ని పునరుద్ధరించబోతున్నాం. మూతపడిన సహకార డెయిరీలు, చక్కెర కర్మాగారాలను తిరిగి తెరిపిస్తాం. ప్రతి నియోజకవర్గంలో గోడౌన్లు, కోల్డు స్టోరేజీలు అవసరం మేరకు ఏర్పాటు చేసేందుకు ఈ ఏడాది నుంచే శ్రీకారం చుడతాం. వచ్చే అయిదేళ్ల కాలంలో మండల స్థాయిలో కూడా అందుబాటులోకి తెస్తామని సగర్వంగా చెబుతున్నాను. రైతులు కొంటున్న విత్తనాలు, పురుగు మందుల నాణ్యతను పరిశీలించేందుకు ప్రతి నియోజకవర్గంలో ల్యాబొరేటరీలు ఏర్పాటు చేస్తున్నాం. నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు నేరుగా గ్రామ స్థాయిలో విక్రయించేలా చర్యలు తీసుకోబోతున్నాం. ఎక్కడా కల్తీలకు ఆస్కారం లేకుండా చట్టాలను ఇంకా గొప్పగా తీర్చిదిద్దబోతున్నాం. కొబ్బరికి కనీస మద్దతు ధర కల్పించేలా చర్యలు తీసుకోబోతున్నాం.

### రబీకి విత్తనాల సేకరణకు ఆదేశించాం

ఎక్కడా నీటి కొరత రాకుండా ఉండేందుకు ఎంత డబ్బు ఖర్చైనా పరవాలేదని కలెక్టర్లకు చెప్పాం. ఇంతకు ముందు పాలకులకు ఆ మనసు లేదు. నీటి విలువ, ప్రజల కష్టాలు తెలిసిన మనసున్న ప్రభుత్వంగా ప్రతి నియోజకవర్గానికి ప్రతి ఎమ్మెల్యేకు కోటి రూపాయలు కేటాయిస్తున్నాం. ప్రతి ఎమ్మెల్యే వారి నియోజకవర్గాల్లో పర్యటించి నీటి ఎద్దడి నివారణకు ఈ డబ్బులు సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాను. గత ప్రభుత్వానికి భిన్నంగా నిధులు కేటాయిస్తాం. ప్రతిపక్ష నేత చంద్రబాబుకు కూడా కోటి రూపాయలు కేటాయిస్తున్నాం. ప్రజలకు మంచి చేయండని కోరుతున్నాం. పశువులకు కూడా నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటాం. వచ్చే రబీని దృష్టిలో పెట్టుకుని విత్తనాల సేకరణకు అధికారులకు ఆదేశాలు ఇచ్చాం. రాయలసీమ జిల్లాల్లో ఎండుతున్న పంటలను కాపాడుకునేందుకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు ఒక్కో ట్యాంకరుకు రూ.500 ఉన్న మొత్తాన్ని రూ.600కు పెంచాం. ఈ బడ్జెట్‌లోనే రూ.2 వేల కోట్ల ప్రకృతి వైపరీత్యాల నిధి పెడతాం. ఏ సీజన్‌లో అయినా విపత్తుల వల్ల పంట నష్టపోతే మరుసటి సీజన్‌లో పంటల సాగుకు అనుకూలంగా పెట్టుబడి రాయితీ ఇస్తాం. కరువే వస్తే.. గతంలో ఎప్పుడూ జరగని విధంగా రుణాల వడ్డీని మాఫీ చేస్తాం. ప్రభుత్వమే దీనిని భరిస్తుంది. రుణాల రీషెడ్యూలు కూడా చేస్తాం. గత అయిదేళ్లలో ఇలాంటివి మనం అసలు చూడలేదు. ఈ పరిస్థితిని పూర్తిగా మార్చబోతున్నాం'' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్నారు.

**చంద్రబాబు నాడు - నేడు**

ఎన్నికలకు ముందు చంద్రబాబు రైతులకు ఏమి చెప్పారో, ఎన్నికల తర్వాత రుణమాఫీ విషయంలో ఏమి చేశారనే విషయంపై ముఖ్యమంత్రి ఆధారాలతో సహా అసెంబ్లీలో చూపించారు. చంద్రబాబు నాడు – నేడు.. అంటూ రుణమాఫీపై మాట మార్చిన తీరును స్పీకర్ అనుమతితో టీవీ స్క్రీన్లపై ప్రదర్శిస్తూ వివరించారు. 'వ్యవసాయ రుణాలన్నీ మాఫీ చేస్తాం. రుణాల చెల్లింపు బాధ్యత నా భుజస్కంధాలపై వేసుకుంటా.. మీరు పైసా కూడా చెల్లించాల్సిన పనిలేదు..' అని ఎన్నికల ప్రచారం సందర్భంగా చంద్రబాబు ప్రసంగం వీడియో క్లిప్పులను చూపించారు. 'మొన్న రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) మీటింగ్‌లో అధికారులు చెప్పిన అంశాలు చాలా బాధ కలిగించాయి. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయ్యే నాటికి (31–3–2014) ముందున్న బ్యాంకు రుణాలన్నీ మాఫీ చేస్తామని ప్రకటించారు. అదే తేదీ నాటికి 184వ ఎస్ఎల్‌బీసీ లెక్కల ప్రకారం వ్యవసాయ రుణాల మొత్తం రూ. 87,612 కోట్లు. ఇవన్నీ పూర్తిగా బేషరతుగా మాఫీ చేస్తామని ఎన్నికల ముందు ఊదరగొట్టారు. తర్వాత అధికారంలోకి రాగానే మాట మార్చి గత ప్రభుత్వం రైతులను మోసం చేసింది. రూ.87,612 కోట్ల రుణాలు మాఫీ చేయాల్సి ఉండగా వాటిని రకరకాల షరతులతో రూ.24 వేల కోట్లకు కుదించారు. ఇందులో కూడా చెల్లించింది కేవలం రూ.15 వేల కోట్లు మాత్రమే. రైతుల తరపున కట్టాల్సిన వడ్డీ సొమ్మును కూడా కట్టకుండా ఆ పథకాన్నే రద్దు చేసింది. గత ప్రభుత్వ నిర్వాకం వల్ల నేడు రైతుల రుణాలు రూ.1,49,240 కోట్లకు ఎగబాకాయి.




## విత్తన సమస్య పాపం బాబు సర్కారుదే

- అధికారులు ఎన్ని లేఖలు రాసినా స్పందించ లేదు
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మండిపాటు
- 4.41 లక్షల క్వింటాళ్ల వేరుశనగ విత్తనం అవసరం
- గత ప్రభుత్వం అందుబాటులో ఉంచింది 50 వేల క్వింటాళ్లే

**అమరావతి :** రాష్ట్రంలో ప్రస్తుతం రైతులు విత్తనాల కోసం ఇక్కట్లు పడుతుండటానికి గత ఐదేళ్ల చంద్రబాబు ప్రభుత్వ నిర్వాకమే కారణమని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కరువు పరిస్థితిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం శాసనసభలో మాట్లాడారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అందించాల్సిన విత్తనాల సేకరణ కూడా గత ప్రభుత్వం చేయలేదన్నారు. సాధారణంగా ఈ సంవత్సరం జూన్‌లో పంట వేయాలంటే గత ఏడాది నవంబర్‌లోనే విత్తనాల సేకరణ ప్రారంభించి ఏప్రిల్ కల్లా పూర్తి చేయాలని, మే నెలలో పంపిణీ చేయాలని చెప్పారు. వాస్తవంలో అలా జరగక పోవడం వల్లే రైతులు ఇక్కట్లు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 'మా ప్రభుత్వం జూన్‌లో వచ్చింది. అంటే మా ప్రభుత్వం వచ్చినప్పటికే విత్తన సేకరణ పూర్తయి రైతులకు పంపిణీ జరుగుతుండాలి. అలా జరగనందునే రైతులు రోడ్డు మీదకు రావాల్సిన దుస్థితి ఏర్పడింది. మేం బాధ్యతలు స్వీకరించిన నాటికి 4.41 లక్షల క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు రైతులకు సరఫరా చేయాలని ప్రణాళిక ఉంది. తీరా చూస్తే కేవలం 50 వేల క్వింటాళ్ల విత్తనాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. గత ప్రభుత్వాన్ని ఎన్నిసార్లు అడిగినా, ఎన్ని లేఖలు రాసినా నిధులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశారని అధికారులు చెప్పార'ని వివరించారు. నిధులు ఇవ్వాలంటూ ఫిబ్రవరి 19న ఆంధ్రప్రదేశ్ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు గత ప్రభుత్వానికి రాసిన లేఖతోపాటు మరో లేఖను కూడా స్పీకర్ అనుమతితో టీవీ స్క్రీన్‌పై చూపిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆంగ్లంలో చదివి వినిపించారు. అధికారులు ఒకటి కాదు రెండు కాదు ఇన్నిన్ని లేఖలు రాశారంటూ లేఖల కట్టను చేత్తో పట్టుకుని పైకెత్తి చూపించారు. గత ప్రభుత్వం బాధ్యతగా చేయాల్సిన పని సమయానికి చేయకపోవడం వల్ల రైతాంగం పరిస్థితి ఇంత దారుణంగా మారిందని మండిపడ్డారు. రాష్ట్రంలో 4.41 లక్షల క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు అవసరం ఉంటే కేవలం 50 వేల క్వింటాళ్లు మాత్రమే అందుబాటులో ఉన్న పరిస్థితిలో మేం అధికారంలోకి వచ్చాం. ఎన్నిసార్లు లేఖలు రాసినా ప్రభుత్వం స్పందించనందున ఏమీ చేయలేకపోయామని అధికారులు చెబుతుంటే చాలా బాధనిపించిందని సీఎం వివరించారు.

## జీరో అవర్ ప్రశ్నలకు త్వరగా సమాధానాలివ్వండి

**మంత్రులు, అధికారులకు స్పీకర్ తమ్మినేని సీతారాం సూచన**



**సాక్షి, అమరావతి:** అసెంబ్లీలో జీరో అవర్‌లో సభ్యులు అడిగే ప్రశ్నలకు సాధ్యమైనంత త్వరగా సమాధానాలు చెప్పాలని మంత్రులు, అధికారులకు స్పీకర్ తమ్మినేని సీతారాం సూచించారు. ఇప్పుడు అడిగే ప్రశ్నలకు ప్రస్తుత సమావేశాలు ముగిసేలోగా జవాబులు తెప్పించాలని అన్నారు. జీరో అవర్‌కు పవిత్రత ఉండాలని చెప్పారు. చేస్తాం.. చూస్తాం.. సంబంధిత మంత్రి దృష్టికి తీసుకువెళతామని సమాధానమిచ్చి చేతులు దులుపుకోవద్దని కోరారు. గురువారం శాసనసభలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు చింతల రామచంద్రారెడ్డి, అంబటి రాంబాబు చేసిన విజ్ఞప్తి మేరకు స్పీకర్ ఈ ఆదేశాలు ఇచ్చారు.


**వాయిదా తీర్మానం తిరస్కరణ..:** విత్తనాల కొరతపై టీడీపీ ఎమ్మెల్యే రామానాయుడు నాయకత్వంలో ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని స్పీకర్ తమ్మినేని సీతారాం తిరస్కరించారు. ఈ అంశంపై, రాష్ట్రంలో అనావృష్టి పరిస్థితులపై ముఖ్యమంత్రి సభలో ప్రకటన చేయనున్నందున వాయిదా తీర్మానం అవసరం లేదని పేర్కొన్నారు.

**సభకు నీటి పారుదల అభివృద్ధి సంస్థ వార్షిక నివేదిక..:** 2017–18 సంవత్సరానికి రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ లిమిటెడ్ 44వ వార్షిక నివేదికను రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి పి.అనిల్‌కుమార్ యాదవ్ గురువారం శాసనసభలో ప్రవేశపెట్టారు. కంపెనీ చట్టం–2013లోని సెక్షన్ 394(2) కింద ఈ నివేదికను సభ ముందుంచినట్టు మంత్రి ప్రకటించారు.

# 30 వరకు అసెంబ్లీ కార్యకలాపాల షెడ్యూలిదీ..

**సాక్షి, అమరావతి:** ఆంధ్రప్రదేశ్ శాసనసభా సమావేశాల ప్రారంభం రోజు నుంచీ 14 రోజులపాటు ఆయా రోజుల్లో చేపట్టే కార్యక్రమాల షెడ్యూలును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం సభ ముందుంచారు. బుధవారం జరిగిన శాసనసభా వ్యవహారాల సలహా మండలి(బీఏసీ) సమావేశంలో ఖరారు చేసిన మేరకు ఆయన ఈ షెడ్యూలును అసెంబ్లీకి సమర్పించారు. కాగా గురువారం నాటి ఎజెండా ప్రకారం షెడ్యూలును సభ ముందుంచడానికి నిర్దేశించిన సమయంలో సీఎం జగన్ సభలో లేకపోవడంతో.. స్పీకర్ తమ్మినేని సీతారామ్ ఈ బిజినెస్ షెడ్యూలును ముఖ్యమంత్రి సభ ముందుంచినట్లే పరిగణించాలని ప్రకటించారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల తొలి రోజైన 11వ తేదీన కరువుపై సుదీర్ఘమైన చర్చతోపాటుగా ప్రశ్నోత్తరాలు, తదితర ఎజెండాపై చర్చ జరిగింది.

**12వ తేదీ నుంచి ఈ నెల 30వ తేదీ వరకూ జరిగే రోజువారీ కార్యక్రమాల వివరాలిలా ఉన్నాయి**



- **12వ తేదీ:** 2019–20 ఆర్థిక సంవత్సరపు వార్షిక బడ్జెట్ ప్రతిపాదన. వ్యవసాయ, అనుబంధ రంగాల బడ్జెట్ కూడానూ ఇదే రోజున ప్రవేశపెడతారు.
- **13వ తేదీ:** సెలవు
- **14వ తేదీ:** సెలవు
- **15వ తేదీ:** బడ్జెట్‌పై సాధారణ చర్చ ప్రారంభం
- **16వ తేదీ:** బడ్జెట్‌పై రెండో రోజు సాధారణ చర్చ
- **17వ తేదీ:** బడ్జెట్‌పై మూడో రోజు సాధారణ చర్చ.. ఆర్థిక శాఖ మంత్రి సమాధానం.
- **18వ తేదీ:** రోడ్లు, భవనాలు, పోర్టులు, భారీ, మీడియం, మైనర్ ఇరిగేషన్ శాఖలు, విద్యుత్ శాఖ పద్దుల ప్రతిపాదన. ప్రభుత్వ కార్యకలాపాలు–బిల్లులు
- **19వ తేదీ:** వ్యవసాయం, సహకారం, అనుబంధ రంగాలు, పౌరసరఫరాల శాఖల పద్దుల ప్రతిపాదన. ప్రభుత్వ కార్యకలాపాలు–బిల్లులు
- **20వ తేదీ:** సెలవు
- **21వ తేదీ:** సెలవు
- **22వ తేదీ:** గృహ నిర్మాణం, సాంఘిక సంక్షేమం, గిరిజన సంక్షేమం, బీసీల సంక్షేమం, మైనారిటీల సంక్షేమం, మహిళా–శిశు సంక్షేమం, వికలాంగుల సంక్షేమం శాఖల పద్దుల ప్రతిపాదన. ప్రభుత్వ కార్యకలాపాలు–బిల్లులు
- **23వ తేదీ:** ప్రాథమిక–ఉన్నత విద్య, సాంకేతిక విద్య, క్రీడలు, యువజన సర్వీసులు, వైద్యం–ఆరోగ్య శాఖల పద్దుల ప్రతిపాదన. ప్రభుత్వ కార్యకలాపాలు–బిల్లులు
- **24వ తేదీ:** మున్సిపల్ పరిపాలన–పట్టణాభివృద్ధి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల పద్దుల ప్రతిపాదన. ప్రభుత్వ కార్యకలాపాలు, బిల్లులు
- **25వ తేదీ:** రెవెన్యూ రిజిస్ట్రేషన్, సహాయ పునరావాసం, ఎక్సైజ్ పాలన, వాణిజ్య పన్నుల శాఖ పరిపాలన, రవాణా పాలన, హోంశాఖ, రాష్ట్ర శాసనసభా వ్యవహారాలు, గవర్నర్, మంత్రులు, న్యాయ పరిపాలన, సాధారణ పరిపాలన, ఎన్నికలు, ద్రవ్య పరిపాలన, ప్రణాళికా శాఖ, సర్వే–స్టాటిస్టిక్స్, సమాచార, పౌరసంబంధాల శాఖల పద్దుల ప్రతిపాదన. ప్రభుత్వ కార్యకలాపాలు–బిల్లులు
- **26వ తేదీ:** కార్మిక, ఉపాధి కల్పన శాఖ, దేవదాయ, ధర్మాదాయ, అటవీ, సైన్సు అండ్ టెక్నాలజీ, పర్యావరణం, పరిశ్రమలు–వాణిజ్యం, పర్యాటకం, కళలు–సాంస్కృతికం, ఐటీ, కమ్యూనికేషన్స్, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖల పద్దుల ప్రతిపాదన. ప్రభుత్వ కార్యకలాపాలు.
- **27వ తేదీ:** సెలవు
- **28వ తేదీ:** సెలవు
- **29వ తేదీ:** ఆంధ్రప్రదేశ్ ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ.. ఆమోదం. ప్రభుత్వ కార్యకలాపాలు
- **30వ తేదీ:** ప్రభుత్వ కార్యకలాపాలు.
- ఇవిగాక ప్రశ్నోత్తరాలు, జీరో అవర్ తరువాత వాయిదా తీర్మానాలను పరిశీలిస్తారు.

## ముగిసిన తొలి విడత మెడికల్ వెబ్ కౌన్సెలింగ్

**విజయవాడ (హెల్త్ యూనివర్సిటీ):** రాష్ట్రంలో ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లోని కాంపిటెంట్ అథారిటీ సీట్ల అడ్మిషన్లకు జరిగిన తొలి విడత వెబ్ కౌన్సెలింగ్ గురువారంతో ముగిసింది. సీట్లు పొందిన అభ్యర్థుల జాబితా యూనివర్సిటీ (హెచ్‌టీటీపీ://ఎన్‌టీఆర్‌యూహెచ్‌ఎస్.ఏపీ.ఎన్ఐసీ.ఇన్) వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. అభ్యర్థులు 15వ తేదీలోగా ఆయా కళాశాలల్లో చేరాల్సి ఉంటుంది.

**SRI VENKATESWARA UNIVERSITY, TIRUPATI**
**(NAAC "A" Grade)**

Advertisement No.E.II(6)/ACS/2019-20, Date: 10.07.2019

**NOTIFICATION**

Online Applications are invited in the prescribed format from the eligible candidates for hiring the Academic Consultants in various Departments of SVU Colleges and SVU Institutions on consolidated rates of monthly remuneration, on purely temporary basis for the academic year 2019-20 only.

For Registration, Submission of Online Application, Eligibility Criteria, Research Experience, Registration Fee and other details, visit the website: www.svudoa.in

Filled in downloaded Online Applications along with acknowledgement of Registration Fee with all necessary documents should be submitted to the Registrar, Sri Venkateswara University, Tirupati-517502 **on or before 25.07.2019 by 5.00 P.M.**

I/C REGISTRAR

## 79 మండలాల్లో మొదలుకాని గ్రామ వలంటీర్ల ఇంటర్వ్యూలు

**సాక్షి, అమరావతి:** గ్రామ వలంటీర్ల నియామక ఇంటర్వ్యూలు 79 మండలాల్లో ఇంకా ప్రారంభం కాలేదు. రాష్ట్రంలో 660 మండలాల్లోనూ గురువారం నుంచే ప్రతి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు మొదలు కావాల్సి ఉండగా 581 మండలాల్లో ఆరంభమయ్యాయి. నియామక ప్రక్రియకు మండల స్థాయిలో కన్వీనర్‌గా వ్యవహరించే ఎంపీడీవోలు చాలా చోట్ల బదిలీ హడావుడిలో మునిగి ఉండడంతో ఆయా చోట్ల గ్రామ వలంటీర్ల ఇంటర్వ్యూల ప్రక్రియ తొలిరోజు జరగలేదు. మరో పక్క తొలిరోజు ఇంటర్వ్యూలు జరగాల్సినవారిలో సగం మందే హాజరైనట్లు పంచాయతీరాజ్ అధికారులు తెలిపారు. తొలి రోజు 32,782 మందిని ఇంటర్వ్యూలకు పిలవగా, 15,989 మంది మాత్రమే హాజరయినట్టు జిల్లాల నుంచి పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయానికి సమాచారం అందింది.

**ఎంపీడీవోల బదిలీల హడావుడే కారణం**

**1,93,321కి పెరిగిన గ్రామ వలంటీర్ల పోస్టులు**

భర్తీ చేసే గ్రామ వలంటీర్ల పోస్టుల సంఖ్య పెరిగింది. మొదట 1,81,885 గ్రామ వలంటీర్ల నియామకం చేపట్టాలని అధికారులు భావించారు. ప్రతి గ్రామంలోనూ 50 ఇళ్లకు ఒక యూనిక్ కోడ్‌తో వాలంటీర్ల కీ రిజిస్టర్ తయారీ బుధవారం రాత్రితో ముగియగా, నియామకం చేపట్టాల్సిన గ్రామ వలంటీర్ల సంఖ్య మొత్తం 1,93,321కు పెరిగినట్టు పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయ అధికారులు చెబుతున్నారు.




## వార్డు వలంటీర్ల ఇంటర్వ్యూలు ప్రారంభం

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలోని వివిధ పట్టణాల్లో అర్బన్ వలంటీర్ల పోస్టులకు గురువారం ఇంటర్వ్యూలు ప్రారంభం అయ్యాయి. మొత్తం 110 మున్సిపాల్టీలు, నగరపాలక సంస్థల నుంచి వలంటీర్ పోస్టులకు 1,68,994 మంది దరఖాస్తు చేసుకున్నారు. సరైన రికార్డులను దరఖాస్తులకు జత చేయని కారణంగా 12,684 దరఖాస్తులను తిరస్కరించారు. మిగిలిన 1,55,310 దరఖాస్తుదారులకు మున్సిపల్ అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించే ప్రక్రియను చేపట్టారు. శుక్ర, శనివారాల్లోనూ ఇంటర్వ్యూలు కొనసాగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

## రేపు కోస్తా, రాయలసీమలో వర్ష సూచన

**సాక్షి, విశాఖపట్నం:** నైరుతి రుతుపవనాల ప్రభావం రాష్ట్రంపై ప్రస్తుతం బలహీనంగా ఉన్నప్పటికీ.. రానున్న రెండు రోజుల్లో పరిస్థితులు కొంత మెరుగు పడనున్నాయి. ఈ ప్రభావం వల్ల శనివారం నుంచి కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని ఐఎండీ గురువారం రాత్రి విడుదల చేసిన నివేదికలో తెలిపింది. మరోవైపు పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం వల్ల గడిచిన 24 గంటల్లో రాష్ట్రంలో పలు చోట్ల వర్షం కురిసింది. చింతూరులో 5 సెం.మీ, కూనవరంలో 4, గోరంట్లలో 3, తంబళ్లపల్లి, సూళ్లూరుపేట, వరరామచంద్రాపురం, గుడివాడ, వేలేరుపాడు, కుక్కునూరు తదితర ప్రాంతాల్లో 2 సెం.మీ వర్షపాతం నమోదైంది.




## సామాజిక మాధ్యమాల్లో ఉద్యోగ ప్రకటనలు అవాస్తవం

**టీటీడీ ప్రజాసంబంధాల విభాగం**

**తిరుమల:** తిరుమల శ్రీవారి ఆలయ భద్రతా విభాగంలో సెక్యూరిటీ గార్డుల నియామకం జరుగుతోందని సామాజిక మాధ్యమాల్లో వస్తున్న ప్రకటనలు అవాస్తవమని టీటీడీ ప్రజాసంబంధాల విభాగం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. భీమల విజయకృష్ణమ నాయుడు అనే వ్యక్తి టీటీడీలో సెక్యూరిటీ గార్డుల నియామకం అంటూ సామాజిక మాధ్యమాల్లో ప్రకటన విడుదల చేశాడని, ఇలాంటి నకిలీ ప్రకటనలు చూసి నిరుద్యోగులు మోసపోవద్దని టీటీడీ విజ్ఞప్తి చేసింది. భీమల విజయకృష్ణమ నాయుడుపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపింది.

## గిరిజనుల సమస్యలపై విచారణ జరపండి

**ఎన్‌హెచ్చార్సీకి ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు**

**సాక్షి, న్యూఢిల్లీ:** పోలవరం ప్రాజెక్టు వల్ల నిర్వాసితులవుతున్న గిరిజనుల సమస్యలపై దాఖలైన పిటిషన్‌ను తిరిగి విచారించాలని జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను ఢిల్లీ హైకోర్టు గురువారం ఆదేశించింది. ప్రాజెక్టు నిర్మాణం కోసం గిరిజనులను బలవంతంగా తరలిస్తున్నారంటూ పెంటపాటి పుల్లారావు ఎన్‌హెచ్చార్సీలో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన కమిషన్ గిరిజనుల తరలింపు విషయంలో మానవీయ కోణంలో ఆలోచించి వారికి అన్ని విధాల సహకారం అందించాలని ఆదేశాలిచ్చింది. పోలవరం ప్రాజెక్టుపై సుప్రీంకోర్టులో కూడా పలు పిటిషన్లు దాఖలైన నేపథ్యంలో ఎన్‌హెచ్చార్సీలో దాఖలైన పిటిషన్‌పై కమిషన్ విచారణ నిలిపివేసింది. దీన్ని సవాల్ చేస్తూ పుల్లారావు ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించగా ఎన్‌హెచ్చార్సీ 3 నెలల్లో విచారణను తిరిగి ప్రారంభించాలని ఆదేశాలిచ్చింది.

## రవాణా శాఖలో భారీగా బదిలీలు

**సాక్షి, అమరావతి:** రాష్ట్ర రవాణా శాఖలో బదిలీలు భారీగా జరిగాయి. గురువారం ఉద్యోగులకు పదోన్నతులు ఇచ్చి పెద్ద ఎత్తున బదిలీలు చేపట్టారు. రాష్ట్ర విభజన నాటి నుంచి రవాణాశాఖలో ఇంత పెద్ద ఎత్తున బదిలీలు ఒకేసారి జరగలేదని రవాణా ఉద్యోగుల నాన్ టెక్నికల్ సంఘం అధ్యక్షుడు డి.మణికుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాస్ అన్నారు. రవాణాశాఖలో చేపట్టిన బదిలీలు శాఖ అభివృద్ధికి మేలు చేసేవిధంగా ఉన్నాయని వారు తెలిపారు. బదిలీల్లో భాగంగా సీనియర్ అసిస్టెంట్ల నుంచి పరిపాలన అధికారుల వరకు మొత్తం 21 మందికి పదోన్నతులు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని ఉద్యోగసంఘాల నేతలు పేర్కొన్నారు.



# చంద్రయానానికి.. రెడీ

## తుది విడత తనిఖీల్లో చంద్రయాన్–2 మిషన్



సూళ్లూరుపేట (శ్రీహరికోట): భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రం సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్)లో చంద్రయాన్–2 మిషన్‌ను రోదసీలోకి తీసుకెళ్లే జీఎస్ఎల్వీ మార్క్3–ఎం1 రాకెట్‌కు ఇస్రో శాస్త్రవేత్తలు తుది తనిఖీలు నిర్వహిస్తున్నారు. పీఎస్ఎల్వీని నాలుగుదశల్లో ప్రయోగిస్తే.. జీఎస్ఎల్వీ రాకెట్‌ను మూడు దశల్లోనే ప్రయోగించేలా డిజైన్ చేశారు. ఈ నెల 7న రాకెట్.. ప్రయోగవేదిక మీదికొచ్చాక దశలవారీ తనిఖీలు చేస్తున్నారు. ఈ తనిఖీల్లో భాగంగా గురువారం లాంచ్ వెహికల్‌లో బ్యాటరీలు నింపే పనిని చేపట్టారు. సాధారణ పరీక్షలను కూడా పూర్తిచేశారు. శుక్రవారం సాయంత్రానికి అన్ని పరీక్షలు పూర్తిచేసి.. రాకెట్‌ను సిద్ధంచేసి.. శనివారం ఉదయాన్నే ఎంఆర్ఆర్ (మిషన్ రెడీనెస్ రివ్యూ) సమావేశాన్ని నిర్వహించనున్నారు. రాకెట్ అనుసంధాన పనులు, అన్ని పరీక్షలనూ పూర్తిచేసి ప్రయోగం చేసుకోమని ఎంఆర్ఆర్ కమిటీ.. లాంచ్ ఆథరైజేషన్ బోర్డుకు రాకెట్‌ను అప్పగించనుంది. లాంచ్ ఆథరైజేషన్ బోర్డు చైర్మన్ ఆర్ముగం రాజరాజన్ ఆధ్వర్యంలో మరోసారి లాంచ్ రిహార్సల్స్ కార్యక్రమాన్ని నిర్వహించాక కౌంట్‌డౌన్ సమయాన్ని నిర్వహిస్తారు. 15వ తేదీ వేకువజామున 2.51 గంటలకు 3,800 కిలోల బరువు కలిగిన చంద్రయాన్–2 మిషన్‌ను మోసుకుని నింగివైపునకు దూసుకెళ్లేందుకు జీఎస్ఎల్వీ మార్క్3–ఎం1 రాకెట్‌ను సిద్ధం చేస్తున్నారు.

### రాష్ట్రపతి భద్రతపై ప్రత్యేక దృష్టి

ఈ నెల 15న జరగనున్న చంద్రయాన్–2 ప్రయోగాన్ని వీక్షించేందుకు రాష్ట్రపతి రామనాథ్ కోవింద్ దంపతులు 14న శ్రీపొట్టిశ్రీరాములునెల్లూరు జిల్లా సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్)కు చేరుకోనున్నారు. ఈ నేపథ్యంలో ఆయనకు భద్రత కల్పించేందుకు గురువారం ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ ఎస్పీ సుబ్బరాయుడు, అడిషనల్ ఎస్పీ చిట్టెయ్యల ఆధ్వర్యంలో షార్‌లో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్రపతి ఈ నెల 13న తిరుమల వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నాక.. 14వ తేదీ సాయంత్రం 4 గంటలకు రేణిగుంట విమానాశ్రయం నుంచి ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా 5:30 గంటలకు షార్‌కు చేరుకుని.. నక్షత్ర అతిథి భవనంలో బస చేస్తారు. అక్కడ నుంచి ఆయన చంద్రయాన్–2కు సంబంధించిన ప్రయోగ వేదికను తిలకిస్తారు. ప్రయోగాన్ని వీక్షించేందుకు రాత్రికి మిషన్ కంట్రోల్ సెంటర్‌కు వస్తారు. ప్రయోగం అనంతరం ఆయన షార్‌లోనే బసచేసి 15వ తేదీ ఉదయాన్నే చెన్నైకు చేరుకుంటారు. అయితే షార్‌లో ఆయన దిగే హెలిపాడ్ నుంచి.. బసచేసే నక్షత్ర అతిథి భవనం వరకు జిల్లా కలెక్టర్ శేషగిరిబాబు, ఎస్పీ ఐశ్వర్య రస్తోగి, షార్ కంట్రోలర్ జేవీ రాజారెడ్డి, సీఐఎస్ఎఫ్ కమాండెంట్ వైభవ్‌కుమార్ దూబే తదితరులు రూట్ తనిఖీలు నిర్వహించారు. షార్ కేంద్రంలో ఇప్పటికే సీఐఎస్ఎఫ్ భద్రతా దళాలు అటవీప్రాంతంలో కూంబింగ్ చేస్తున్నాయి. షార్‌కు బయట ప్రాంతంలోనూ సుమారు 1500 మంది సిబ్బందిని బందోబస్తు కోసం ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్రపతితో పాటు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు గవర్నర్లు నరసింహన్, వాజూభాయ్, భన్వరీలాల్ పురోహిత్‌లు కూడా వస్తుండటంతో ప్రత్యేకంగా భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. సూళ్లూరుపేట–శ్రీహరికోట మార్గంలో అటకానితిప్ప వద్ద ప్రత్యేక చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. వేనాడుకు వెళ్లే వాహనాలను కూడా ప్రత్యేకంగా తనిఖీ చేస్తున్నారు.

# కాళేశ్వరం కడుతున్నప్పుడు ఏం చేశారు?

## అసెంబ్లీలో ప్రతిపక్ష నేత చంద్రబాబుపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజం

సాక్షి, అమరావతి: 'తెలంగాణలో కాళేశ్వరం ప్రాజెక్టును కడుతున్నప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్నది ఎవరు? దానిని అడ్డుకోవాల్సింది ఎవరు? ఆ ప్రాజెక్టు కడుతున్నప్పుడు ఒక్క మాటయినా మాట్లాడారా? హరికృష్ణ భౌతికకాయాన్ని పక్కనే పెట్టుకుని కేటీఆర్‌తో పొత్తు గురించి మాట్లాడింది మీరు కాదా?' అంటూ ప్రతిపక్షనేత చంద్రబాబునాయుడుపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల మొదటి రోజైన గురువారం తెలుగుదేశం సభ్యులు పలువురు కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి సీఎం జగన్ వెళ్లి రాష్ట్రానికి నష్టం చేశారంటూ ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టును వ్యతిరేకించిన వ్యక్తి ఎలా వెళ్లారని చంద్రబాబు ప్రశ్నించారు. తెలుగువారి భవిష్యత్తు అని, ఐదుకోట్ల మంది నోళ్లు మూయించలేరని అన్నారు. ఈ ఆరోపణలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఘాటుగా సమాధానం ఇచ్చారు. తప్పు చేసినదంతా చంద్రబాబు సర్కారేనని, ఇప్పుడు తమపై బురదజల్లుతున్నారంటూ ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి మాట్లాడుతున్న సమయంలో ప్రతిపక్ష నేత చంద్రబాబు మారు మాట్లాడలేని పరిస్థితి నెలకొంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రసంగం ఆయన మాటల్లోనే..

### నేను వెళ్లకపోయినా బటన్ నొక్కేవారు..

కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి హోదాలో మీరు ఎందుకు వెళ్లి బటన్ నొక్కారని అడుగుతున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయ్యాక మాత్రమే నేను ముఖ్యమంత్రి హోదాలో వెళ్లా. నేను ప్రారంభానికి వెళ్లినా వెళ్లకపోయినా వాళ్లు బటన్ నొక్కేవాళ్లు, ఆన్ అయ్యేది. ఐదేళ్లు బాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే కదా కాళేశ్వరం ప్రాజెక్టు కట్టింది. ప్రాజెక్టు కడుతున్నప్పుడు అడ్డుకోకుండా అప్పుడేమైనా గాడిదలు కాశారా? టీడీపీ అధికారంలో ఉండగానే ఆల్మట్టి ప్రాజెక్టు ఎత్తు పెంచారు. గడిచిన 47 సంవత్సరాల్లో సీడబ్ల్యూసీ (సెంట్రల్ వాటర్ కమిషన్) లెక్కల ప్రకారం కృష్ణా నది నుంచి శ్రీశైలం దిగువకు 1,100 నుంచి 1,200 టీఎంసీల నీళ్లు వచ్చేవి. గత 10 ఏళ్ల నుంచి సగటున చూస్తే కృష్ణా నది నుంచి శ్రీశైలంకు వచ్చే నీళ్లు ఐదారు వందల టీఎంసీలకు పడిపోయిన పరిస్థితి. ఆల్మట్టి ఎత్తు పెంచుకుంటూ పోతున్నా చంద్రబాబు ఏనాడూ మాట్లాడలేదు. ఆల్మట్టి 519 మీటర్ల నుంచి 524 మీటర్ల ఎత్తుకు పెంచితే మనకు నీళ్లు ఎలా వస్తాయి? రెండు రాష్ట్రాలుగా ఆంధ్రప్రదేశ్ విడిపోతే నష్టం జరుగుతుందని తెలిసి కూడా విభజనకు లేఖ ఇచ్చింది మీరు కాదా? సోనియా గాంధీ అంటే మీకు భయమా? గోదావరికి ప్రధాన పాయలు నాలుగు. నాసిక్ నుంచి వచ్చే మొదటి పాయ ఇప్పటికే ఎండిపోయిన పరిస్థితిలో ఉంది. రెండోదైన ప్రాణహిత నుంచి గోదావరి 36 శాతం నీళ్లు తీసుకెళ్తోంది. సుమారు 65 శాతం నీళ్లు తీసుకొచ్చే ఈ రెండు పాయలూ తెలంగాణలోనే ఉన్నాయి. మూడోదైన ఇంద్రావతి నుంచి 26 శాతం నీళ్లు వెళ్తున్నాయి. మనకు నీళ్లు తెస్తున్నది శబరిపాయ మాత్రమే. ఈ పాయ నుంచి 11 శాతం నీళ్లు మాత్రమే గోదావరి జలాలు వస్తున్నాయి. కేవలం 500 టీఎంసీల నీళ్లు మాత్రమే మనకు కిందకు వచ్చే పరిస్థితి. తెలంగాణ ప్రభుత్వం నీళ్లు వదిలితే గానీ ఇక్కడకురావు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే 3 టీఎంసీల నీళ్లు లిఫ్ట్ చేసుకుని తరలించుకుపోతుంటే ఏం చేయగలిగారు? వాళ్ల రాష్ట్రంలోని నదులను వాళ్లు ఇష్టం వచ్చినట్లు వాడుకుంటున్నా ఎవరూ ఏమీ చేయలేకపోతున్నారు. నీళ్లకోసం గొడవలు పడతాం.. కోర్టుకు వెళతాం, కేసులు వేస్తాం. కానీ అవేమీ తెగవు.

### సఖ్యత ఉంటేనే అభివృద్ధి..

మనకు ఇప్పుడు రాష్ట్రాల మధ్య సఖ్యత కావాలి. సఖ్యత ఉంటేనే అభివృద్ధి జరుగుతుంది. ఈ విషయంలో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ వాళ్ల రాష్ట్రం నుంచి కృష్ణా ఆయకట్టు స్థిరీకరణ కోసం ముందుకొచ్చారు. ఎందుకంటే శ్రీశైలానికి నీళ్లు వస్తే తెలంగాణలోని మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలకు నీళ్లు వస్తాయని, నాగార్జునసాగర్‌కు నీళ్లు వస్తే ఖమ్మం, నల్లగొండ జిల్లాలకు నీళ్లు ఇచ్చే పరిస్థితి మెరుగవుతుందని. కృష్ణా ఆయకట్టు ప్రశ్నార్థకమైతే తమ రాష్ట్రానికి ఇబ్బంది కలుగుతుందనే ఉద్దేశంతో కేసీఆర్ ముందుకు వచ్చారు. ఇద్దరం కలిసి గోదావరి నీళ్లను శ్రీశైలం, నాగార్జునసాగర్‌కు తీసుకెళ్లగలిగితే కృష్ణా ఆయకట్టుకు మొత్తం స్థిరీకరణ జరుగుతుంది. దీనికి సంతోషించాల్సింది పోయి.. రాజకీయాలు చేస్తున్నారంటే ఇంతకంటే దిక్కుమాలిన ప్రతిపక్షం మరొకటి ఉండదు. ఏదైనా నదీ జలాల ఒప్పందాల వ్యవహారాలు చంద్రబాబుకు తెలియకపోవడం దారుణం. ఇంత ఘోరమైన ప్రతిపక్షం ప్రపంచ చరిత్రలో ఎక్కడా ఉండదు. ఇప్పటికైనా టీడీపీ నేతల వైఖరి మార్చుకోకపోతే మూల్యం చెల్లించుకోక తప్పదు.

# 'సున్నావడ్డీ'కి మీరిచ్చిన నిధులెన్ని?

- ఐదేళ్లలో ఎన్ని నిధులిచ్చారో చంద్రబాబు చెప్పాలి
- అసెంబ్లీలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిమాండ్
- రైతులను మోసం చేసినందుకే బాబు ప్రతిపక్షంలోకి మారారు
- తాము రూ.3,068 కోట్లు కేటాయిస్తున్నామని స్పష్టీకరణ

సాక్షి, అమరావతి: రైతులకు సున్నా వడ్డీ పథకం కింద ఐదేళ్ల తెలుగుదేశం పార్టీ పాలనలో ఎన్ని నిధులు ఇచ్చారో చెప్పాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. రైతులకు సున్నా వడ్డీకి రుణాలు సక్రమంగా ఇచ్చేందుకు చంద్రబాబుకు మనసు రాలేదని విమర్శించారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులు, వర్షాభావం, రైతుల కష్టాలపై గురువారం అసెంబ్లీలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ సభ్యుడు నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ... రైతులకు సున్నావడ్డీ పథకాన్ని కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, టీడీపీ ప్రభుత్వంలో కూడా ఆ పథకం కొనసాగిందని చెప్పారు. సున్నా వడ్డీ పథకాన్ని సక్రమంగా అమలు చేయకుండా చంద్రబాబు ప్రభుత్వం రైతులను మోసం చేసిందని సీఎం వైఎస్ జగన్ ఆరోపించారు.

### సున్నా వడ్డీ పథకానికి రూ.3,068 కోట్లు కేటాయిస్తున్నాం

''వ్యవసాయ రుణాల్లో సున్నా వడ్డీ అంటే ఎంతో అసలు చంద్రబాబుకు తెలుసా? రైతులకు ఎంత ప్రయోజనం చేకూరు తుందో తెలుసా? ప్రభుత్వంపై ఎంత భారం పడుతుందో తెలుసా? వ్యవసాయ రుణాలపై 7 శాతం వడ్డీ చెల్లించాలి. అందులో కేంద్ర ప్రభుత్వం 3 శాతం భరిస్తుంది. మిగిలిన 4 శాతం రైతులు చెల్లించాలి. దాన్ని రైతులు చెల్లించాల్సిన అవసరం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం భరించాలి. రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ(ఎస్ఎల్‌బీసీ) లెక్కల ప్రకారం 2018–19 సంవత్సరానికి రాష్ట్రంలో ఉన్న వ్యవసాయ రుణాలు రూ.76,721 కోట్లు. వాటిపై రైతులు చెల్లించాల్సిన 4 శాతం వడ్డీ అంటే రూ.3,068 కోట్లు అవుతుంది. ఆ వడ్డీని రైతులు చెల్లించాల్సిన అవసరం లేకుండా మా ప్రభుత్వమే భరించేందుకు రూ.3,068 కోట్లు కేటాయిస్తున్నాం. టీడీపీ ప్రభుత్వం ఎప్పుడైనా అలా సున్నా వడ్డీ రుణాలకు అంత మొత్తాన్ని ఎప్పుడైనా కేటాయించిందా? 2014–19 మధ్యలో సున్నా వడ్డీ పథకం కింద టీడీపీ ప్రభుత్వం ఎంత వెచ్చించిందో చెప్పగలరా? 2014 నుంచి 2019 వరకు ప్రతి ఏడాది బడ్జెట్‌లో రూ.172 కోట్లు చూపించారు. దాన్ని ఖర్చు కూడా చేసేవారు కాదు. ప్రతి ఏడాది అదే జరుగుతూ వచ్చేది. ఇది రైతులను మోసం చేయడం కాదా? రైతులను మోసం చేసినందుకే చంద్రబాబు ప్రతిపక్షంలోకి మారారు. వాస్తవం ఏమిటో చంద్రబాబు తన మనస్సాక్షిని అడగాలి'' అని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హితవు పలికారు.

### రైతులకు రూ.84 వేల కోట్ల రుణాలు

''అధికారంలోకి వచ్చిన వెంటనే వైఎస్సార్ సున్నా వడ్డీ రుణాల పథకం ప్రకటించాం. బ్యాంకుల నుంచి ఈ ఏడాది రూ.84 వేల కోట్ల పంట రుణాలివ్వాలని నిర్ణయం తీసుకున్నాం. రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లిస్తే వారు వడ్డీ చెల్లించాల్సిన అవసరం లేదు. గడువు లోగా అప్పు చెల్లిస్తే వడ్డీని పూర్తిగా ప్రభుత్వమే చెల్లిస్తుంది. వడ్డీ వ్యాపారుల కంబంధ హస్తాల నుంచి రైతులకు విముక్తి కలిగించేందుకు ఈ పథకానికి శ్రీకారం చుట్టాం'' అని ముఖ్యమంత్రి ఉద్ఘాటించారు.

### రోజూ రికార్డులు దగ్గర పెట్టుకుంటామా?: చంద్రబాబు

''సున్నా వడ్డీ రుణాలపై నన్ను సమాధానం చెప్పమనడం ఏమిటి? మీ విధానాలు(పాలసీలు) మీవి... మా విధానాలు మావి. రోజూ రికార్డులు దగ్గర పెట్టుకుంటామా? మీ పాలసీల ప్రకారం మీరు పరిపాలిస్తారు. మా పాలసీల ప్రకారం మేము పరిపాలిస్తాం'' అని ప్రతిపక్ష నేత చంద్రబాబు వ్యాఖ్యానించారు. ''నన్ను సభలో ఎగతాళి చేస్తున్నారు. మీరు అవమానిస్తే మేము పడాలా?'' అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### టీడీపీ శవ రాజకీయం చేస్తోంది

సున్నావడ్డీ పథకంపై చర్చ సందర్భంగా అసెంబ్లీలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ సభ్యుల మధ్య వాడీవేడీ చర్చ జరిగింది. ఈ సందర్భంగా గత టీడీపీ ప్రభుత్వ తీరును వైఎస్సార్‌సీపీ సభ్యులు ఎండగట్టారు. చంద్రబాబు ఎందుకు అంతటి అసహనానికి లోనవుతున్నారో అర్థం కావడం లేదని మున్సిపల్ శాఖ మంత్రి బొత్స సత్యన్నారాయణ ఎద్దేవా చేశారు. బాబుకు సంప్రదాయాలు ఇప్పుడే గుర్తుకొచ్చాయా అని ప్రశ్నించారు. 'రైతుల పట్ల చంద్రబాబు ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించింది. పరిహారం చెల్లించకుండా ఎగ్గొట్టేందుకు రైతుల ఆత్మహత్యలను తక్కువ చేసి చూపారు' అని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి విమర్శించారు. ప్రస్తుతం టీడీపీ శవ రాజకీయాలు చేస్తోందని ధ్వజమెత్తారు. అనంతపురం జిల్లాలో రైతులను చంద్రబాబు ప్రభుత్వం నిండా ముంచిందని పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దేకుంట శ్రీధర్‌రెడ్డి విమర్శించారు. రెయిన్ గన్‌లతో పంటలను కాపాడుతామని చెప్పి చంద్రబాబు మోసం చేశారని ఆరోపించారు. పార్టీలతో సంబంధం లేకుండా ప్రతి నియోజకవర్గానికి (ఎమ్మెల్యేకి) రూ.కోటి నిధులు ఇస్తామని ప్రకటించినందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని అభినందించాలని ప్రతిపక్ష నేత చంద్రబాబుకు మంత్రి పెద్దిరెడ్డి సూచించారు. చంద్రబాబు బదులిస్తూ.. ''మా పార్టీ ఎమ్మెల్యే బాల వీరాంజనేయ స్వామికి జరిగిన అవమానానికి క్షమాపణలు చెబితే సీఎంను అభినందించే విషయం ఆలోచిస్తా'' అని అన్నారు.

### బుర్ర మాత్రం ఆ స్థాయిలో లేదు

#### టీడీపీ సభ్యులకు సీఎం అక్షింతలు

ముఖ్యమంత్రి జగన్ మాట్లాడుతున్న సమయంలో టీడీపీ ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు లేచి పాయింట్ ఆఫ్ ఆర్డర్ అంటూ ఏదో మాట్లాడారు. కూర్చోవాలని స్పీకర్ పదేపదే చెప్పినా ఆయన వినిపించుకోలేదు. దీంతో సీఎం జగన్ స్పందిస్తూ.. ''మనిషి ఆ సైజులో ఉన్నారు. బుర్ర మాత్రం ఆ స్థాయిలో లేదు. ఏం మాట్లాడాలో, ఏం మాట్లాడరాదో కూడా తెలియదు'' అంటూ అచ్చెన్నాయుడికి చురక అంటించారు. ఈ సందర్భంగా బుచ్చయ్య చౌదరి, అచ్చెన్నాయుడు ఇద్దరూ లేచి ఏదో అనడంతో ''వయసు పెరుగతోంది గానీ బుర్ర, బుద్ధీ పెరగలేదు. ఎదిగే కొద్దీ ఒదగడం నేర్చుకోవాలి. సీఎం పదవికైనా విలువ ఇవ్వడం నేర్చుకోండి'' అని అచ్చెన్నాయుడు, బుచ్చయ్య చౌదరికి సీఎం జగన్ అక్షింతలు వేశారు.

# రాష్ట్ర రుణ భారం 2,61,302.81 కోట్లు



## ఆర్థిక మంత్రి బుగ్గన

- ఎర్రచందనం అక్రమ రవాణాపై నిఘా పెంచుతాం: బాలినేని
- ప్రాధాన్యతా క్రమంలో రహదారుల నిర్మాణం: ధర్మాన
- పరిశ్రమల్లో స్థానికులకే 75 శాతం ఉద్యోగాలు: జయరాం
- ప్రైవేటులో ఫీజుల నియంత్రణకు కమిషన్: ఆదిమూలపు సురేష్
- 60 ఏళ్లకే పింఛన్, కొత్త లబ్ధిదారులు 5,39,823 మంది: పెద్దిరెడ్డి
- ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యుల ప్రశ్నలకు మంత్రుల సమాధానం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ అప్పు రూ. 2,61,302.81 కోట్లు అని రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ గురువారం అసెంబ్లీలో పేర్కొన్నారు. రాష్ట్రం విడిపోయే నాటికి ఆంధ్రప్రదేశ్ రుణ భారం ఎంత, 2014 నుంచి 2019 వరకూ రుణ భారం ఏ మేరకు పెరిగిందని ప్రశ్నోత్తరాల సమయంలో వైఎస్సార్‌సీపీ సభ్యులు ధర్మాన ప్రసాదరావు, కొలుసు పార్థసారథి, సుధాకర్ బాబు అడిగిన ప్రశ్నలకు బుగ్గన సమాధానమిచ్చారు. 2014 జూన్ 2 నాటికి మొత్తం రుణాల్లో అవశేష ఆంధ్రప్రదేశ్‌కు రూ. 1,30,654.34 కోట్లు కేటాయించారని, అంటే ప్రభుత్వ రుణం రూ. 97,123.93 కోట్లు గానూ, ప్రజా పద్దులపై రూ. 33,530.41 కోట్లుగా విభజించి ఉందని చెప్పారు. 2014 జూన్ నుంచి 2019 మే వరకు వరకు రాష్ట్ర ప్రభుత్వం మొత్తం రూ. 1,00,658 కోట్ల నికర అప్పు (ప్రభుత్వ రుణం) చేసిందన్నారు. 2019 మే 30 నాటికి ఆంధ్రప్రదేశ్ మొత్తం అప్పు రూ. 2,61,302.81 కోట్లుగా తేలిందన్నారు. ప్రభుత్వ రుణం రూ. 1,97,782.26 కోట్లుగాను, ప్రజాపద్దులపై రూ. 63,520.55 కోట్లు ఉందన్నారు.

### ఎర్రచందనంలోనూ దోపిడీకి పాల్పడ్డారు

ఎర్రచందనం అక్రమ రవాణాకు సంబంధించి నమోదైన కేసులెన్ని అని టీడీపీ సభ్యుడు గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రశ్నించారు. దీనికి మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి సమాధానమిస్తూ.. 2003 నుంచి 2019 వరకు 15,508 కేసులు నమోదయ్యాయని చెప్పారు. 14,343.084 మెట్రిక్ టన్నుల ఎర్రచందనం అక్రమ తరలింపు నేరాల్లో ప్రమేయమున్న 28,336 మంది అరెస్టు అయ్యారన్నారు. అక్రమ రవాణా జరుగుతున్న కీలక ప్రాంతాల్లో నిఘా పెంచుతామని చెప్పారు. ఇంతలోనే చీఫ్ విప్ గడికోట శ్రీకాంత్‌రెడ్డి కలుగజేసుకుని గతంలో ప్రభుత్వం గ్లోబల్ టెండర్లు నిర్వహిస్తామని ఇంట్లోనే కూర్చుని నిర్ణయించి దోపిడీకి పాల్పడిందన్నారు. రాష్ట్రంలో రహదారుల నిర్మాణాలు, మరమ్మతులపై ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, మాట్లాడుతూ.. గత ప్రభుత్వం రోడ్ల నిర్వహణకు పైసా కూడా ఇవ్వలేదని, ఈ ప్రభుత్వం ఎప్పుడు పనులు పూర్తి చేస్తుందో చెప్పాలని కోరారు. దీనిపై రోడ్లు భవనాల శాఖ మంత్రి ధర్మాన కృష్ణదాస్ సమాధానమిస్తూ.. రాష్ట్రవ్యాప్తంగా 46,232 కిలోమీటర్ల మేర రహదారుల నిర్వహణ చేపడుతున్నామన్నారు. ప్రాధాన్యతా క్రమంలో ఈ నిర్మాణాలను చేపడుతున్నామని వివరించారు.

### స్థానికులకే ఉద్యోగాలు

రాష్ట్రంలో ఏర్పాటయ్యే పరిశ్రమల్లో స్థానికులకే 75 శాతం ఉపాధిని కల్పించేందుకు కొత్త విధానాన్ని తీసుకురావాలనే ప్రతిపాదన ఉందని మంత్రి గుమ్మనూరు జయరాం చెప్పారు. ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ప్రశ్నకు ఆయన ఈ మేరకు సమాధానమిచ్చారు. ప్రకాశం జిల్లాలోని రాళ్లపాడు రిజర్వాయర్ నుంచి నెల్లూరు జిల్లాలోని కామధేను ప్రాజెక్టుకు నీళ్లు తీసుకెళ్లడానికి అనుమతినిచ్చారా అని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి ప్రశ్నించారు. దీనికి మంత్రి అనిల్‌కుమార్ స్పందిస్తూ.. కామధేను బ్రీడింగ్ సెంటర్‌కు 7.888 మిలియన్ క్యూబిక్ అడుగుల నీటిని కేటాయించామన్నారు.

### 'హామ్' కాంట్రాక్టుల్లో అవకతవకలపై విచారణ



విద్యాశాఖ మంత్రి సురేష్

విద్యా వ్యవస్థలో మౌలిక వసతుల కల్పన కోసం ప్రవేశపెట్టిన హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్ఏఎం–హామ్) కాంట్రాక్టుల్లో అవకతవకలు జరిగినట్టు వచ్చిన ఆరోపణలపై విచారణ జరుపుతామని విద్యా శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో రూ. 4,800 కోట్ల నిధులతో ప్రవేశపెట్టిన హామ్ పథకం కింద అంచనాలు పెంచి నిధుల దుర్వినియోగం చేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. రాష్ట్రంలో విద్యా హక్కు చట్టం అమలుపై ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, వాసుపల్లి గణేష్ కుమార్, ఆదిరెడ్డి భవానీ అడిగిన లిఖిత పూర్వక ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో ప్రైవేటు పాఠశాలలు విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయడం లేదన్న అంశంపై జరిగిన చర్చలో పార్థసారథి, చింతల రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో 25 శాతం రిజర్వేషన్లు అమలు చేసేలా చర్యలు తీసుకోనున్నట్టు మంత్రి సురేష్ చెప్పారు. ప్రైవేటు కాలేజీల్లో ఫీజులను నియంత్రించేలా కమిషన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాలు ముగిసేలోగా ఫీజులపై ప్రభుత్వ విధానాన్ని ప్రకటిస్తామని తెలిపారు.

### జలయజ్ఞం ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం

మంత్రి అనిల్ కుమార్



దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జలయజ్ఞం పేరుతో చేపట్టిన ప్రాజెక్టులన్నిటినీ పూర్తి చేస్తామని మంత్రి అనిల్ కుమార్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రాజెక్టుల పనులు ఆగిపోయాయని, వీటిపై ప్రజల్లో ఆందోళన ఉందని, వీటి పరిస్థితి గురించి చెప్పాలని టీడీపీ సభ్యులు అచ్చెన్నాయుడు, రామానాయుడు ప్రశ్నోత్తరాల సమయంలో అడిగారు. ప్రాజెక్టులు ఎప్పుడు చేపడతారు, టెండర్లు ఎప్పుడు చేపడతారు వీటన్నిటిపై స్పష్టత ఇవ్వాలని కోరారు. దీనికి మంత్రి స్పందిస్తూ.. మీకు (టీడీపీ ప్రభుత్వం) రైతులకు మంచి చేయాలనే ఉద్దేశం లేదు కాబట్టి ఆ ప్రాజెక్టులను పూర్తి చేయలేదని దుయ్యబట్టారు. మా నాయకుడు వైఎస్ జగన్‌కు ప్రాజెక్టులు పూర్తిచేసే అవకాశం వచ్చిందన్నారు. ఎక్కడైనా ప్రాజెక్టు కట్టేటప్పుడు ఒక శిలాఫలకం, ప్రారంభించేటప్పుడు ఒక శిలాఫలకం పెడతారని, కానీ గేటుకొక శిలాఫలకం, పెట్టి టీడీపీ నేతలు ప్రచారం చేసుకున్నారని ధ్వజమెత్తారు. టెండరు ప్రక్రియపై ఇప్పటికే కమిటీ వేశామని, 45 రోజుల్లో దీనిపై నివేదిక ఇస్తారని, ఇందులో అవినీతి జరిగి ఉంటే రివర్స్ టెండరింగ్ చేస్తామన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలు అన్నదమ్ముల్లా సఖ్యతతో వ్యవహరిస్తున్నాయని, దీనివల్ల జలవివాదాలు ఉండవని చెప్పారు.

### అక్రమ అవయవ వ్యాపారాన్ని సహించం

రాష్ట్ర హోం మంత్రి సుచరిత



రాష్ట్రంలో అక్రమ అవయవ వ్యాపారాన్ని సహించే ప్రసక్తే లేదని, ఇందులో ఎవరి పాత్ర ఉన్నా కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర హోం శాఖ మంత్రి మేకతోటి సుచరిత హెచ్చరించారు. రాష్ట్రంలో 2017 నుంచి 2019 జూన్ వరకు 5 కేసులు నమోదయినట్లు చెప్పారు. టీడీపీ సభ్యుడు వెలగపూడి రామకృష్ణ అడిగిన ప్రశ్నకు ఆమె జవాబు ఇచ్చారు. నమోదైన ఐదు కేసుల్లో ప్రస్తుతం ఒక కేసులో (నరసరావుపేట వన్‌టౌన్) చార్జీషీట్ దాఖలైందని, మిగతా నాలుగింటిపై దర్యాప్తు జరుగుతోందని వివరించారు.

### 60 ఏళ్లకే ఫించన్: పెద్దిరెడ్డి



రాష్ట్రంలో సామాజిక భద్రత పింఛను మంజూరుకు వయో పరిమితిని 65 ఏళ్ల నుంచి 60 ఏళ్లకు తగ్గించినట్టు పంచాయితీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెప్పారు. సభ్యులు వేగుళ్ల జోగేశ్వరరావు, మద్దాలి గిరిధరరావు, వీరాంజనేయ స్వామి అడిగిన లిఖిత పూర్వక ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. వయస్సు తగ్గించడం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా 5,39,823 మంది కొత్తగా అర్హత సాధించారని, ప్రస్తుతం ఇవన్నీ మంజూరు దశలో ఉన్నాయన్నారు.

# కోగంటే సూత్రధారి!

- రాంప్రసాద్ హత్యకు రెండు నెలల క్రితమే కుట్ర!
- హత్యకు కోటి రూపాయల సుపారీ
- నిందితులకు వ్యతిరేకంగా ఆధారాల సేకరణ
- కొలిక్కి వచ్చిన స్టీల్ వ్యాపారి రాంప్రసాద్ హత్య కేసు

సాక్షి, హైదరాబాద్/అమరావతి బ్యూరో: తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన స్టీల్ వ్యాపారి తేలప్రోలు రాంప్రసాద్ హత్య కేసులో కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. రెండు నెలల క్రితమే ఆయన హత్యకు నిందితులు కుట్ర పన్నినట్లు ప్రధాన నిందితుడైన కోగంటి సత్యం విచారణలో వెలుగుచూసింది. అయితే, ఎన్నికల నేపథ్యంలో హత్య అమలు వాయిదా పడింది. రాంప్రసాద్ కదలికలపై మొత్తం మూడుచోట్ల రెక్కీ నిర్వహించిన నిందితులు.. కుట్ర అమలుకు అనుకూలంగా ఉంటుందనే పంజగుట్ట ప్రాంతాన్ని ఎంచుకున్నారని బయటపడింది. ఈ కేసులో కోగంటి సత్యం సహా మొత్తం పది మందిని నిందితులుగా గుర్తించిన పోలీసులు గురువారం రాత్రి వరకు తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. పరారీలో ఉన్న మరో నిందితుడి కోసం గాలిస్తున్నారు. అలాగే, ఈ హత్య పథక సూత్రధారి కోగంటి సత్యమే అని కూడా నిర్ధారణకు వచ్చారు. రాంప్రసాద్‌ను చంపేందుకు కిరాయి హంతకులకు కోటి రూపాయల సుపారీ ఇచ్చినట్టు పోలీసులు ఆధారాలు సేకరించారు.

### రంగంలోకి దిగిన ప్రధాన అనుచరుడు..

విజయవాడకు చెందిన కామాక్షి స్టీల్స్ వ్యాపార లావాదేవీల్లో తలెత్తిన వివాదాలు, మధ్యలో టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు జోక్యం.. రెండు నెలల క్రితం గుంటూరు జిల్లా మంగళగిరి వద్ద కోగంటి సత్యం ప్రయాణిస్తున్న వాహనం ప్రమాదానికి గురికావడం తదితర పరిణామాల నేపథ్యంలో రాంప్రసాద్‌ను హత్య చేయాలని కోగంటి సత్యం నిర్ణయించుకున్నాడు. ఆ పనిని తన ప్రధాన అనుచరుడైన శ్యామ్‌కు అప్పగించాడు. ఎన్నికల కారణంగా పోలీసుల తనిఖీలు విస్తృతంగా ఉండడం.. రాంప్రసాద్ ఆచూకీ స్పష్టంగా తెలియకపోవడంతో కోగంటి సత్యం తన పథకాన్ని వాయిదా వేశాడు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత శ్యామ్, సురేష్‌లు తమ అనుచరుడైన ఆనంద్‌ను రంగంలోకి దింపి రాంప్రసాద్ ఆచూకీ కనిపెట్టే బాధ్యత అప్పగించారు.

### గది అద్దెకు తీసుకుని గాలింపు..

విజయవాడ నుంచి హైదరాబాద్ వచ్చిన ఆనంద్ ఓ గది అద్దెకు తీసుకుని గాలింపు మొదలు పెట్టాడు. చివరకు రాంప్రసాద్ ఆచూకీ కనిపెట్టిన అతను.. పరిగిలో రాంప్రసాద్ నిర్వహిస్తున్న అభిరామ్ స్టీల్స్ ఫ్యాక్టరీ, గచ్చిబౌలిలోని నివాసం, పంజగుట్టలోని కార్పొరేట్ కార్యాలయాలను గుర్తించాడు. ఈ విషయం తెలుసుకున్న శ్యామ్, సురేష్‌లు.. హైదరాబాద్ వచ్చి ఆయా ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించారు. ఫ్యాక్టరీ వద్ద దాడిచేస్తే కార్మికులు చూసి తమను పట్టుకోవడం, ఎదురుదాడి చేయడం లేదా రాంప్రసాద్‌ను హుటాహుటిన ఆస్పత్రికి తీసుకువెళ్లే అవకాశం ఉందని భావించారు. ఇంటి వద్ద కూడా దాదాపు ఇలాంటి పరిస్థితులే ఉండటంతో అక్కడ కూడా దాడి చేయకూడదని నిర్ణయించుకున్నారు. పంజగుట్టలో అభిరామ్ స్టీల్స్ కార్యాలయం సమీపంలో ఉన్న దేవాలయం వద్దే అనువుగా ఉంటుందని నిర్ణయించుకున్నారు. ఇదే విషయాన్ని కోగంటి సత్యంకి చెప్పడంతో అతడి నుంచి గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. దీంతో రంగంలోకి దిగిన శ్యామ్, చోటు, రమేష్ తదితరులు గత శనివారం రాత్రి రాంప్రసాద్‌ను మట్టుబెట్టారు. ఈ హత్యలో ప్రత్యక్షంగా, పరోక్షంగా మొత్తం పది మందికి పాత్ర ఉన్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. కోగంటి సత్యం, శ్యామ్, చోటు, రమేష్, ఆనంద్, సురేష్ సహా మొత్తం తొమ్మిది మందిని పోలీసులు పట్టుకున్నారు. హత్య జరిగిన సమయంలో మొత్తం ఎనిమిది మంది ఉన్నట్లు సీసీ ఫుటేజీ ద్వారా గుర్తించారు. నిందితుల్ని శుక్రవారం అరెస్టుచేసే అవకాశం ఉంది. ఇప్పటికే హత్యకు వినియోగించిన వాహనాలు, ఆయుధాలు, సెల్‌ఫోన్లు తదితరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. నిందితులపై నేరం నిరూపించడానికి అవసరమైన ఇతర ఆధారాల కోసం అన్వేషిస్తున్నారు. ఈ కేసు దర్యాప్తు తీరు తెన్నుల్ని పర్యవేక్షిస్తున్న ఉన్నతాధికారులు నిందితులకు వ్యతిరేకంగా పక్కా ఆధారాలు సేకరించాల్సిందిగా ఆదేశాలు జారీచేశారు.

### రోడ్డు ప్రమాదం తర్వాతే హత్యకు ప్రణాళిక

రెండు నెలల కిందట మంగళగిరి వద్ద జాతీయ రహదారిపై కోగంటి సత్యం ప్రయాణిస్తున్న వాహనం ప్రమాదానికి గురైంది. అప్పట్లో దీనిపై ఆయన ఎవరిపై అనుమానం వ్యక్తంచేయలేదు. అయితే, ఈ ప్రమాదం వెనుక రాంప్రసాద్ హస్తమున్నట్లు గుర్తించిన సత్యం.. మరోవైపు కామాక్షి స్టీల్స్ వ్యాపార లావాదేవీల వివాదం తీవ్రరూపం దాలుస్తుండడంతో భవిష్యత్తులో అతని నుంచి తనకెదురయ్యే ముప్పును తప్పించుకునేందుకే రాంప్రసాద్ హత్యకు ప్రణాళిక రూపొందించినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఇందుకోసం రూ. కోటి వరకు సత్యం సుపారీ ఇచ్చినట్లు.. ఈ చెల్లింపులన్నీ శ్యామ్ చేసినట్లు పోలీసులు ఆధారాలు సేకరించారు. ఇదిలా ఉంటే.. రెండు దశాబ్దాలుగా స్టీలు వ్యాపార రంగంలో ఉన్న కోగంటి సత్యంపై విజయవాడ నగరంలో మొత్తం 24 కేసులున్నాయి. ఏ–1 రౌడీషీట్ కూడా ఉంది. వైజాగ్, విజయవాడలో ఆస్తి, వ్యాపార తగాదాలు ఉన్నాయి. ఇందులో మూడు కేసులు మినహా అన్ని కేసులు కొట్టేశారు.

# పెండింగ్‌లో రూ.560 కోట్ల 'వడ్డీలేని రుణాలు': చంద్రబాబు

సాక్షి, అమరావతి/మంగళగిరి: తమ ప్రభుత్వ హయాంలో రూ.560 కోట్ల వడ్డీ లేని రుణాలు పెండింగ్‌లో ఉన్నాయని టీడీపీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు చెప్పారు. అసెంబ్లీ వాయిదా పడిన తర్వాత గురువారం మంగళగిరిలోని ఒక రిసార్ట్స్‌లో ఆయన 22 మంది టీడీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశమయ్యారు. అసెంబ్లీ సమావేశాల్లో ఎవరు ఏ సబ్జెక్ట్‌పై మాట్లాడాలన్న దానిపై సమీక్షించారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడారు. 2018–19 సంవత్సరానికి సంబంధించి రూ.560 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, అంతకుముందు కొంత చెల్లించామని తెలిపారు. రూ.లక్ష లోపు రుణాలు తీసుకున్న వారికి సున్నా వడ్డీ, రూ.లక్ష నుంచి రూ.3 లక్షల లోపు రుణాలు తీసుకున్న వారికి పావలా వడ్డీ వర్తిస్తుందని, ఇది కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో ప్రారంభమై ఇప్పటికీ కొనసాగుతోందని తెలిపారు. వడ్డీలేని రుణాల పథకాన్ని 2018–19కి కొనసాగిస్తున్నట్లు 2018 మే నెలలో అప్పటి వ్యవసాయ శాఖ కమిషనర్ మురళీధర్‌రెడ్డి ఎస్ఎల్‌బీసీ, ఆప్కాబ్‌కు సర్క్యులర్ ఇచ్చారని తెలిపారు. కరువు మండలాలుగా ప్రకటించిన తర్వాత ఆర్‌బీఐ మార్గదర్శకాల ప్రకారం పంట రుణాలు ఆటోమేటిక్‌గా రీషెడ్యూల్ అవుతాయని పేర్కొన్నారు. ఇవేమీ తెలియకుండా తనను రాజీనామా చేయాలంటూ చాలెంజ్ చేస్తున్నారని దుయ్యబట్టారు. ఈ వ్యవహారంపై శుక్రవారం అసెంబ్లీలో సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇస్తామని అన్నారు. స్పీకర్ సైతం ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

# 40 వేల ఉద్యోగాల భర్తీకి సన్నద్ధం

## వార్డు సచివాలయాల్లో ఉద్యోగాల భర్తీకి త్వరలో నోటిఫికేషన్

- పట్టభద్రులు, ఉన్నత విద్యావంతులు అర్హులు
- ఒక్కో సచివాలయంలో పది కొత్త ఉద్యోగాలు
- 10 విభాగాలు, 18 సేవలు
- కార్యదర్శుల విధులు, బాధ్యతలు వెల్లడి

**సాక్షి, అమరావతి:** నగరాలు, పట్టణాల్లోని వార్డు సచివాలయాల్లో ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం ఈ నెల 15వ తేదీన నోటిఫికేషన్ జారీ చేయనుంది. ఒక్కో సచివాలయంలో పది మంది కొత్త ఉద్యోగులను శాశ్వత ప్రాతిపదికన నియమించనున్నారు. మున్సిపల్ శాఖ ఇచ్చిన ప్రతిపాదనలను ప్రభుత్వం ఆమోదించడంతో 40 వేల ఉద్యోగాల భర్తీకి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం పట్టణాల్లో కొనసాగుతున్న మున్సిపల్ సిబ్బందికి తోడుగా వీరిని నియమించనున్నారు. పట్టణ ప్రజలకు ప్రస్తుతం మున్సిపాల్టీలు 18 రకాల సేవలను అందిస్తున్నాయి. అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణ, అర్బన్ ప్లానింగ్, రక్షిత మంచినీటి సరఫరా, అగ్నిమాపక సేవలు, పారిశుధ్యం, మురికివాడల అభివృద్ధి, బలహీనవర్గాల అభ్యున్నతి, పర్యావరణ పరిరక్షణ, రహదారులు, పార్కుల నిర్మాణాలకు సంబంధించిన సేవలను అందిస్తోంది. అదే విధంగా విద్యా సాంస్కృతిక రంగాలు, జనన మరణాల నమోదు, వీధిలైట్లు, పార్కింగ్, బస్‌స్టాప్‌ల ఏర్పాటు వంటి సేవలు కూడా అందిస్తున్నాయి. ఈ 18 సేవలను 10 విభాగాలుగా ఏర్పాటు చేసి ఒక్కో విభాగానికి ఒక్కో కార్యదర్శిని నియమించనున్నారు. వీరు తమ పరిధిలోని వాలంటీర్లతో ఆ విభాగానికి చెందిన ప్రజల సమస్యలను పరిష్కరించడంతోపాటు అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను అమలులోకి తీసుకువస్తారు.

| | ఉద్యోగ హోదా | విద్యార్హతలు | విధులు |
|---|---|---|---|
| 1. | వార్డు కార్యదర్శి (సాధారణ పరిపాలన) | డిగ్రీ, ఎంఎస్‌లో సర్టిఫికెట్, కంప్యూటర్ పరిజ్ఞానం | సాధారణ పరిపాలనలోని ఫిర్యాదులు, సమస్యల పరిష్కారం |
| 2. | వార్డు మౌలిక వసతుల కార్యదర్శి | బీఈ లేదా బీటెక్ లేదా ఏఎంఈఈ(సివిల్), ఎంఎస్ ఆఫీసులో సర్టిఫికెట్ | రక్షిత మంచినీటి సరఫరా, రహదారులు, ఇతర మౌలిక వసతుల కల్పన |
| 3 | వార్డు ఇంధన కార్యదర్శి | బీఈలేదా బీటెక్, ఏఎంఈఈ (ఎలక్ట్రికల్), ఎంఎస్ ఆఫీసులో సర్టిఫికెట్ | వీధి లైట్లు, విద్యుత్ సరఫరా, సబ్సిడీ |
| 4. | వార్డు శానిటేషన్ కార్యదర్శి | సైన్స్‌లో గ్రాడ్యుయేట్ లేదా పర్యావరణంలో ఇంజినీరింగ్, ఎంఎస్ ఆఫీసులో సర్టిఫికెట్ | వ్యర్థాల నిర్వహణ, పశు సంక్షేమం |
| 5. | వార్డు ఆరోగ్య కార్యదర్శి | డిగ్రీ, ఎంఎస్ ఆఫీసులో సర్టిఫికెట్ | ప్రజారోగ్యం, జనన మరణాల నమోదు, వైఎస్సార్ బీమా తదితరాలు |
| 6. | వార్డు విద్య కార్యదర్శి | డిగ్రీ, బీఈడీ, ఎంఈడీ, ఎంఎ ఎడ్యుకేషన్ అభ్యర్థులకు ప్రాధాన్యత, ఎంఎస్ ఆఫీస్‌లో సర్టిఫికెట్ | మున్సిపల్ విద్య, అమ్మ ఒడి, ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ |
| 7. | వార్డు ప్లానింగ్ కార్యదర్శి | బీఈ లేదా బీటెక్, లేదా ప్లానింగ్‌లో డిగ్రీ, ఆర్కిటెక్చర్ అభ్యర్థులకు ప్రాధాన్యత, ఎంఎస్ ఆఫీసులో సర్టిఫికెట్ | అర్బన్ ప్లానింగ్, అర్బన్ హౌసింగ్, పర్యావరణ పరిరక్షణ |
| 8. | వార్డు రెవిన్యూ కార్యదర్శి | డిగ్రీ, ఎంఎస్ ఆఫీసులో సర్టిఫికెట్, సర్వే డిప్లమో చేసిన అభ్యర్థులకు ప్రాధాన్యత | పౌరసరఫరాలు, మున్సిపల్ రెవిన్యూ విధులు |
| 9. | వార్డు మహిళా కార్యదర్శి | బ్యాచిలర్ ఆఫ్ లా లేదా ఎల్ఎల్‌బి ఎంఎస్ ఆఫీసులో సర్టిఫికెట్ | బలహీనవర్గాల మహిళలకు సంబంధించిన సమస్యలు, |
| 10. | వార్డు వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సెక్రటరీ | సోషల్ వర్క్‌లో డిగ్రీ, ఎంఎస్ ఆఫీసులో సర్టిఫికెట్ | ఎస్సీ ఎస్టీ మైనార్టీ వర్గాల సమస్యల పరిష్కారం, యువత, ఉపాధి వైఎస్సార్ ఆసరా, పెన్షన్ తదితరాలు |

### ఉన్నత విద్యావంతుల నుంచి దరఖాస్తులు

కీలకమైన ఈ విధుల నిర్వహణకు పట్టభద్రులు, కంప్యూటర్‌పై పరిజ్ఞానం ఉన్న అభ్యర్థుల నుంచి ప్రభుత్వం దరఖాస్తులను కోరుతోంది. ఇంజినీర్లు, న్యాయవాదులు, ఆర్కిటెక్చర్లు, డిగ్రీలో సోషల్‌వర్క్, బీఈడీ, ఎంఈడీ చేసిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. నియమితులు కానున్న వార్డు కార్యదర్శులు, ఇతర ఉద్యోగులు మున్సిపల్, విద్య, సాంఘిక సంక్షేమశాఖ, రెవిన్యూ, పౌరసరఫరాల శాఖ, స్త్రీ శిశు సంక్షేమశాఖ, కార్మికశాఖ, గ్రామీణాభివృద్ధి శాఖల పర్యవేక్షణలో విధులు నిర్వహిస్తారు. ఈ విధానం అమలులోకి వచ్చిన తరువాత వార్డు ప్రజలు మున్సిపల్ కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం లేకుండానే ఈ సచివాలయాలు ప్రజల సమస్యలను పరిష్కరించనున్నాయి.

## రఘునాథునికి స్వరూపానందేంద్ర పూజలు


రఘునాథస్వామి మందిరంలో స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర

**పెందుర్తి:** రుషికేశ్ త్రివేణి ఘాట్ సమీపంలో కొలువైన శ్రీ రఘునాథ మందిరాన్ని విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ, ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్ర సరస్వతి గురువారం సందర్శించి, ప్రత్యేక పూజలు జరిపారు. కాగా, రుషికేశ్‌లోని శారదాపీఠం శాఖను విదేశీ భక్తులు సందర్శించారు.

## అంతటా ఒకే ఫీజు

**ఈ ఏడాది నుంచే అమలు • విద్యా శాఖ మంత్రి సురేష్**

**సాక్షి, అమరావతి:** విద్య వ్యాపారం కాకూడదనేది తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పునరుద్ఘాటించారు. ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల్లో ఫీజుల ఖరారుపై యాజమాన్యాల ప్రతినిధులతో గురువారం సచివాలయంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫీజు నియంత్రణ కమిషన్ నిర్ణయం మేరకు అన్ని కాలేజీల్లో ఒకే ఫీజు అమలు చేస్తామని తెలిపారు. విద్యార్థులందరికీ నాణ్యమైన విద్య అందాలనే ఉద్దేశంతో చట్టం చేయబోతున్నామని, ప్రభుత్వం ప్రకటించబోయే ఫీజు ఈ విద్యా సంవత్సరం నుంచే అమలులోకి వస్తుందని చెప్పారు. ఈ సమావేశంలో విద్యాశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జేఎస్‌వీ ప్రసాద్, టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ సుజాతశర్మ, ఏపీఎస్‌సీహెచ్ఈ చైర్మన్ హేమచంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సీఎంను కలిసిన టీడీపీ ఎమ్మెల్యే వంశీ

**సాక్షి, అమరావతి:** టీడీపీకి చెందిన గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ గురువారం అసెంబ్లీలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. పోలవరం కుడి కాలువపై రైతులు ఏర్పాటుచేసిన మోటార్లకు విద్యుత్ ఇవ్వాలని ముఖ్యమంత్రిని కోరారు.

తెలంగాణ



## చీఫ్ సెక్రటరీ.. హోం సెక్రటరీ.. ఓ పాము!

రాష్ట్ర హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజీవ్ త్రివేది గురువారం ఓ విషసర్పాన్ని బంధించారు. ప్రశాసన్ నగర్‌లోని ఉన్నతాధికారుల క్వార్టర్స్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి నివసిస్తున్నారు. ఆయన నివాసం వెనుక ఉన్న స్థలంలో పాము తారసపడింది. పడగ విప్పి బుసకొడుతున్న పామును చూసిన వాళ్లు భయాందోళనలకు లోనయ్యారు. ఇంతలో విషయం తెలుసుకున్న రాజీవ్ త్రివేది అక్కడకు చేరుకున్నారు. తన వద్ద ఉన్న ఉపకరణంతో ఆ పామును చాకచక్యంగా పట్టుకుని ప్లాస్టిక్ జార్‌లో బంధించారు. దానికి ఎలాంటి హానీ తలపెట్టనని, జనావాసాలకు దూరంగా వదిలివేస్తానని ఆయన పేర్కొన్నారు.

– సాక్షి, హైదరాబాద్

## రైతు ఆత్మహత్యలకు కారకులెవరు?

- రెండు నెలల కిందటి వరకూ అధికారంలో ఉన్న టీడీపీ కాదా?
- ఆ పార్టీ ఎమ్మెల్సీలను ప్రశ్నించిన పిల్లి సుభాష్‌చంద్రబోస్



**సాక్షి, అమరావతి:** ఎవరి తప్పిదాల వల్ల రైతులు ఇప్పటికీ ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్న దానిపై చర్చించుకుందామా.. అంటూ శాసనమండలిలో ప్రభుత్వ పక్ష నాయకుడు, ఉప ముఖ్యమంత్రి పిల్లి సుభాష్‌చంద్రబోస్ టీడీపీ ఎమ్మెల్సీలను ప్రశ్నించారు. గురువారం సభ ప్రారంభం కాగానే అనంతపురం జిల్లాలో రైతు ఆత్మహత్యపై వెంటనే చర్చ జరపాలంటూ టీడీపీ ఎమ్మెల్సీలు వాయిదా తీర్మానం ప్రవేశపెట్టగా.. చైర్మన్ షరీఫ్ దానిని తిరస్కరిస్తున్నట్టు ప్రకటించారు. దీంతో టీడీపీ ఎమ్మెల్సీలు చైర్మన్ పోడియంలోకి వచ్చి చర్చ చేపట్టాలంటూ నినాదాలు చేశారు. పిల్లి సుభాష్ చంద్రబోస్ జోక్యం చేసుకుంటూ.. రైతు సంబంధిత అంశాలపై తమ ప్రభుత్వం బాధ్యతతో పనిచేస్తోందని, ఇప్పుడు రైతులు ఇబ్బందులు పడుతున్నారంటే దానికి కారణం రెండు నెలల కిందటి వరకూ అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం కాదా.. అని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు జోక్యం చేసుకుంటూ 2014–19 మధ్య పెద్ద సంఖ్యలో రైతులు ఆత్మహత్యలు చేసుకున్నా ఒక్క రోజు కూడా స్పందించని టీడీపీ నేతలు.. ఇప్పుడు ఆ అంశంపై అత్యవసరంగా చర్చించాలనడం విడ్డూరంగా ఉందన్నారు. అనంతరం టీడీపీ ఎమ్మెల్సీలు ఆందోళన విరమిస్తున్నట్టు ప్రకటించడంతో ప్రశ్నోత్తరాల కార్యక్రమం మొదలైంది.

### 16.25 లక్షల మందికి 'వైఎస్సార్ చేయూత': మంత్రి విశ్వరూప్

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల్లో 45–60 ఏళ్ల మధ్య వయస్సుగల 16,25,064 మంది మహిళలకు 'వైఎస్సార్ చేయూత' పథకాన్ని వచ్చే ఏడాది అమలు చేయనున్నట్టు రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి పినిపె విశ్వరూప్ శాసనమండలిలో చెప్పారు.

### పంపిణీ కోసం 4,40,210 ఎకరాల ప్రభుత్వ భూమి : ఉప ముఖ్యమంత్రి చంద్రబోస్

పేదలకు ఇళ్ల పట్టాలు, పరిశ్రమల ఏర్పాటు కోసం ఉపయోగించుకునేందుకు రాష్ట్రంలో 4,08,665 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించినట్టు ఉపముఖ్యమంత్రి, రెవెన్యూశాఖ మంత్రి పిల్లి సుభాష్ చంద్రబోస్ చెప్పారు. భూమిలేని నిరుపేద రైతులకు పంపిణీ చేసేందుకు 31,545.2 ఎకరాల భూమి కూడా గుర్తించినట్లు తెలిపారు.

### ఏడాదికోసారి స్వామి వారి ఆభరణాల భౌతిక తనిఖీ : మంత్రి వెలంపల్లి

తిరుమల శ్రీవారి బంగారు, డైమండ్ నగల భౌతిక తనిఖీ ప్రక్రియ ఏడాదికోసారి చేపడతామని దేవదాయశాఖ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్ అన్నారు.

SRI KRISHNADEVARAYA UNIVERSITY
DIRECTORATE OF DISTANCE EDUCATION
ANANTAPURAMU (A.P) - 515 003.
No. SKU/DDE/B.Ed. Admn. Notification / 2019-20 Date : 11-07-2019
ADMISSION NOTIFICATION FOR 2 YEAR B.Ed. PROGRAMME 2019-20
(ACADEMIC SESSION FOR JULY, 2019)
(Recognized by UGC-DEB, New Delhi & NCTE, Bangalore)
Applications are invited from the eligible candidates for Admission into 2 year B.Ed. Programme under Open and Distance Learning (ODL) mode for 2019-20, Academic Session beginning July, 2019 as per NCTE, 2014 Regulations on or before **10-08-2019.** The admission Application Form and the Prospectus are available in the University website : **www.skucde.com**
Sd/- Prof. A. Mallikarjuna Reddy, Registrar | Sd/- Prof. C.N. Krishna Naik, Director

## మద్య నిషేధంతో మహిళల జీవితాల్లో వెలుగులు

### అందుకే సీఎం జగన్ సాహసోపేత నిర్ణయం

**శాసన మండలిలో మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి తానేటి వనిత**



**సాక్షి, అమరావతి :** మద్య నిషేధం వల్ల మహిళల జీవితాల్లో వెలుగులొస్తాయని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. శాసన మండలిలో గురువారం మహిళల సంక్షేమంపై నిర్వహించిన చర్చలో మంత్రి మాట్లాడుతూ మద్యం వల్ల మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. మద్యం వల్ల ఆదాయం ఎక్కువ వస్తున్నా ఏమాత్రం లెక్క చేయకుండా మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం వారి జీవితాలను బాగు చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దశలవారీగా మద్యాన్ని నిషేధించేందుకు సాహసోపేత నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. బాల్య వివాహాలు, అత్యాచారాలపై విద్యా సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు.

***మద్యంతోనే 80 శాతం మహిళలపై దాడులు..***

మద్యంతోనే 80 శాతం వరకు మహిళలపై వివిధ రకాల దాడులు జరుగుతున్నాయని పీడీఎఫ్ ఫ్లోర్ లీడర్ విటపు బాలసుబ్రమణ్యం అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మద్య నిషేధాన్ని అమలు చేస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. బాల్య వివాహాల నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించేందుకు చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని టీడీపీ సభ్యురాలు శమంతకమణి కోరారు.

### మహిళా శిశు సంక్షేమం కోసం పలు పథకాలు, కార్యక్రమాలు

మహిళలు, శిశువుల సంక్షేమానికి ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందని మంత్రి వనిత చెప్పారు. ఇందులో భాగంగానే వన్ స్టాప్ సెంటర్స్, మహిళల కోసం హెల్ప్‌లైన్, మహిళా పోలీస్ వలంటీర్లు, మహిళా శక్తి కేంద్ర పథకం, గృహ హింస నుంచి రక్షణ పొందటం, హింసకు గురైన మహిళలకు పరిహార పథకం, మహిళలు, పిల్లలకు సంస్థలు, సదనాలు, సమగ్ర శిశు సంరక్షణ.. తదితర పథకాలను పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు వివరించారు. ప్రస్తుతం వైఎస్సార్, అనంతపురం జిల్లాల్లో మూడు వేల మంది మహిళా పోలీసు వలంటీర్లు పనిచేస్తున్నారని, మహిళలు, పిల్లల సంరక్షణ.. సంక్షేమం కోసం మహిళా కమిషన్ పనిచేస్తోందన్నారు. స్టేట్ సోషల్ వెల్ఫేర్ బోర్డు ద్వారా 27 కుటుంబ కౌన్సెలింగ్ కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 55,607 అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయన్నారు. సాంఘిక సమైక్యత కోసం విభిన్న ప్రతిభావంతులైన స్త్రీలు, సాధారణ వ్యక్తుల మధ్య వివాహాలను ప్రోత్సహించేందుకు ఒక్కో జంటకు రూ.లక్ష ప్రోత్సాహక అవార్డు ఇస్తామని మంత్రి వివరించారు.

## విజిట్ వీసాపై వెళ్తూ పట్టుబడిన మహిళలు

- ఏపీకి చెందిన 14 మంది అదుపులోకి..
- శంషాబాద్ విమానాశ్రయంలో ఘటన

**హైదరాబాద్:** విజిట్ వీసాలతో ఉపాధి కోసం విదేశాలకు వెళుతున్న మహిళలను రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు(ఆర్‌జీఐఏ)లో ఇమిగ్రేషన్ అధికారులు అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి.. ఆంధ్రప్రదేశ్‌లోని తూ.గోదావరి, ప.గోదావరి, వైఎస్సార్ జిల్లా రాజంపేట, చిత్తూరు తదితర ప్రాంతాలకు చెందిన 14 మంది మహిళలు ఉపాధికోసం మస్కట్, అబుదాబికి వెళ్లడానికి ఏజెంట్లను ఆశ్రయించారు. అయితే సదరు ఏజెంట్లు వారిని వర్కింగ్ వీసాకు బదులుగా విజిట్ వీసాల ద్వారా పంపేందుకు ప్రయత్నించారు. ఈ మహిళలు శంషాబాద్ విమానాశ్రయం నుంచి మస్కట్, అబుదాబి వెళ్లేందుకు బయల్దేరారు. అయితే పాస్‌పోర్టు, వీసాలను తనిఖీ చేస్తున్న సందర్భంలో వర్కింగ్ వీసాలపై వెళ్లాల్సిన వారు విజిట్ వీసాలపై వెళుతున్నట్టు ఇమిగ్రేషన్ అధికారులు గుర్తించారు. దీంతో వారిని ఆర్‌జీఐఏ పోలీసులకు అప్పగించారు. విజిట్ వీసాలతో మహిళలను విదేశాలకు తరలిస్తున్న వారెవరన్న దానిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు

Urgently Required for AL JALHAMI COMPANY-DAMMAM Client Interview 19th July'19
HIGH SALARY, LARGE POSTS, FREE FOOD+FREE Acc., 8Hours Duty + OT
- SENIOR MECHANICAL ENGINEER
- SENIOR CIVIL QA / QC ENGINEER
- SENIOR CIVIL ENGINEER
- CENTRAL A / C TECHNICIAN
- OFFICE SECRETARY
- SENIOR ACCOUNTANT
- CRANE OPERATOR
- EXCAVATOR OPERATOR
- SHOVEL OPERATOR
- BULLDOZER OPERATOR
- JCB OPERATOR
- GRADER OPERATOR
- LATHE MACHINE OPERATOR
- MILLLING MACHINE OPERATOR

VENUE: ALFA TECHNICAL SERVICES (GULF JOBS / GULF STUDY'S) Nr.Navata Transport, High School Road, Gajuwaka, Visakhapatnam-530026
E-mail: alfatechservices22@gmail.com, Ph: 7799747678, 7799747679
M/S FALCON INTERNATIONAL, LIC. No.: B-0984/DEL/PER/1000+/5/3256/92, ARN: PT6288840

WANTED IMMEDIATELY
A Leading MNC Two/ Four wheeler spare parts Production, ISO, Electrical / Electronics, Software / Hardware, Garments Textiles (P) Ltd. Co. Needs Male/ Female candidates Fresh / Exps. Age: 18 to 40.
QUALIFICATION All B.Tech, All Degree (UG/PG), All Diploma, All ITI, 5 to Intermediate (Results waiters can also apply) (All back class also apply)
JOB HR-Manager, Administrate, All Engineer, Production, QC Supervisor, Programmer, Designer, Accountant, System Operator, BPO, Call Center, Office Staff, All Technician, CNC Operator, Export Job.
SALARY Rs. 15,000 to Rs. 35,000 (Room, Mess, ESI, PF available)
WORKING PLACE Hyderabad, Chennai, Bangalore, Coimbatore
Apply to : By E-mail, Courier, Postal. | Apply within 7 days
SRM INDUSTRIAL - HR
Kalliappa Complex, Veerapandi Pirivu, Jothipuram (po), Coimbatore Dt. Pin - 641 047, Tamilnadu.
Email : srmindustrial72@gmail.com

## 'రాష్ట్ర హక్కుల సాధనలో భాగస్వాములమవుదాం'


ఎంపీల సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి

**సాక్షి, న్యూఢిల్లీ:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హక్కుల సాధనలో అందరం కలసికట్టుగా పనిచేద్దామని ఢిల్లీలో ఏపీభవన్ అధికారులకు ప్రభుత్వ ప్రతినిధిగా నియమితులైన, వైఎస్సార్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అవినీతి రహిత పారదర్శక పాలన అందించేందుకు ప్రతిక్షణం చిత్తశుద్ధితో పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్య సాధనకు పాటుపడదామని ఆయన కోరారు. గురువారం ఢిల్లీలోని ఏపీభవన్‌లో రాష్ట్ర ఎంపీలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విజయసాయిరెడ్డి, వైఎస్సార్ సీపీ లోక్‌సభాపక్ష నేత పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ ఎంపీలు వంగా గీత, చింతా అనురాధ, వెంకట సత్యవతి, గొడ్డేటి మాధవి, మాగుంట శ్రీనివాసులు రెడ్డి, మార్గాని భరత్, నందిగం సురేష్, సంజీవ్‌కుమార్, గోరంట్ల మాధవ్, బ్రహ్మానందరెడ్డి, చంద్రశేఖర్, రఘురామ కృష్ణంరాజు, రెడ్డెప్ప, దుర్గాప్రసాద్‌లను భవన్ ఆర్సీ ప్రవీణ్ ప్రకాశ్, ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు ఆనందరావు, లింగరాజు తదితరులు ఘనంగా సత్కరించారు.



సాక్షి
శుక్రవారం, జూలై, 12

# అన్నదాతకు ఆసరా ఎలా?

రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపైనా, ప్రత్యేకించి రైతుల ఆత్మహత్యలపైనా పార్లమెంటులో అరుదుగా చర్చ జరుగుతుంటుంది. కనుక లోక్‌సభలో గురువారం జీరో అవర్‌లో రైతుల ఆత్మహత్యలు ప్రస్తావనకు రావడాన్ని స్వాగతించాలి. దేశంలో రైతుల స్థితిగతులు దారుణంగా ఉన్నాయని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ఆరోపించినప్పుడు రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ గత అయిదేళ్లలో రైతుల ఆత్మహత్యలు గణనీయంగా తగ్గాయని చెప్పారు. దశాబ్దాలపాటు ఏలిన గత పాలకులే రైతుల ప్రస్తుత దుస్థితికి కారణమని కూడా ఆయన చెప్పారు. ఈ ఆరోపణలు, ప్రత్యారోపణల సంగతలా ఉంచితే రైతులు చాలా దుర్భర స్థితిలో ఉన్నారని అందరూ గుర్తించాలి. ఈ చర్చ జరగడానికి ముందు రోజు ఉత్తరప్రదేశ్‌లోని బుందేల్‌ఖండ్ ప్రాంతంలో ఒక రైతు ఆత్మహత్య గురించిన కథనం మీడియాలో వచ్చింది. రైతు తన కుమార్తెను మెడిసిన్ చదివించాలన్న కోరికతో ఆమెను ఒక కోచింగ్ సెంటర్‌లో చేర్చాలనుకున్నాడు. అందుకోసం తనకున్న కొద్దిపాటి భూమిని తనఖా పెట్టాలనుకున్నాడు. కానీ అప్పటికే అప్పులున్న ఆ భూమిపై అదనంగా రుణం ఇవ్వడానికి వడ్డీవ్యాపారులు నిరాకరించడంతో ఆత్మహత్య చేసుకున్నాడు. పంటలు దెబ్బతినడం, కుటుంబాల్లో అనారోగ్యం, పిల్లల చదువులు, పెళ్లిళ్లు... ఇలా అనేక కారణాలు రైతుల ఆత్మహత్యలకు దారి తీస్తున్నాయి. తాజా ఉదంతంలో పోలీసులు ఆ రైతు మానసిక వ్యధతో ఆత్మహత్య చేసుకున్నాడని చెబుతున్నారు. బహుశా ప్రభుత్వం కూడా ఆయన మరణం వెనక సాగు సంబంధ కారణాలు లేవని చెప్పే అవకాశం ఉంది. కానీ బుందేల్‌ఖండ్ ప్రాంతంలో గత రెండేళ్లలో 20మంది రైతులు కన్నుమూశారు. పంటలు బాగా పండి, ఆ పంటలకు గిట్టుబాటు ధర లభిస్తే... వీరు కుటుంబ సంబంధమైన బాధ్యతల్ని నెరవేర్చుకోలిగేవారు. అందరిలా జీవనం సాగించేవారు. బలవన్మరణాలకు పాల్పడే స్థితి ఉండేది కాదు. అందువల్ల రైతుల ఆత్మహత్యలను నమోదు చేయడంలోనూ, ఆ కుటుంబాలను ఆదుకోవడంలోనూ ప్రభుత్వాలు పెద్ద మనసుతో వ్యవహరించాల్సి ఉంటుంది.

బ్రిటిష్ వలసపాలన కాలంలో 1830లో పాలకుడిగా ఉన్న లార్డ్ మెట్‌కాఫ్ బ్రిటన్‌కు ఒక నివేదిక పంపుతూ భారత్‌లో గ్రామాలన్నీ వేటికవి రిపబ్లిక్‌ల వంటివనీ, అవన్నీ స్వయంపోషకాలనీ అభివర్ణించాడు. ఈ కారణం వల్లనే అన్ని ఒడిదుడుకులనూ ఎదుర్కొని భారత్ మనుగడ సాగించగలుగుతున్నదని చెప్పాడు. అప్పట్లో గ్రామాలకున్న ఈ శక్తిసామర్థ్యాలకు వ్యవసాయం, చేతివృత్తులే ప్రధాన కారణమని వేరే చెప్పనవసరం లేదు. కానీ దురదృష్టవశాత్తూ గత కొన్ని దశాబ్దాలుగా ఈ రెండూ క్రమేపీ దెబ్బతిన్నాయి. ఒకనాడు దేశ మనుగడకూ, దాని ఆత్మవిశ్వాసానికీ వెన్నెముకగా నిలిచిన రైతు ఇప్పుడు తానే ఒత్తిళ్లకు లోనవుతున్నాడు. రేపన్నరోజు గడిచేదెలాగో అర్థంకాక తనువు చాలిస్తున్నాడు. విత్తనాలు మొదలుకొని అన్నీ సకాలంలో సరైన ధరలకు లభ్యమయ్యేందుకు...దిగుబడులకు గిట్టుబాటు ధర వచ్చేందుకు... దళారుల బెడద తప్పించేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోగలిగితే ఈ రైతు ఆత్మహత్యల్ని నివారించడం సాధ్యమవుతుంది. బహుళజాతి సంస్థ మోన్‌శాంటో దేశమంతా 450 గ్రాముల బీటీ పత్తి విత్తన ప్యాకెట్‌ను రూ. 1858కి అమ్ముతున్న రోజుల్లో నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆ విషయంలో పట్టుదలగా పోరాడి, చివరకు సుప్రీంకోర్టు వరకూ వెళ్లి ఆ ప్యాకెట్ ధరను రూ. 750కి తగ్గించేలా చేశారు. ఈ విషయంలో అప్పటి యూపీఏ ప్రభుత్వ పెద్దల ద్వారా ఆయనకు నచ్చజెప్పించినా వైఎస్ లొంగలేదు. ఆ ఒరవడిని తర్వాత కాలంలో ఎందరు ముఖ్యమంత్రులు అనుసరించగలిగారు?

చాలా సంస్థలు రైతుల నుంచి అతి తక్కువ ధరకు కొన్న విత్తనాలను మళ్లీ వారికే అత్యధిక ధరకు అమ్ముతున్నాయి. నకిలీ విత్తనాలు అంటగట్టి సొమ్ము చేసుకుంటున్న సంస్థలున్నాయి. ఎరువులు, పురుగుమందుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఆరుగాలం శ్రమించి అధిక దిగుబడి సాధించినా కనీస మద్దతు ధరకు దిక్కులేదు. వీటన్నిటి సంగతలా ఉంచి ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడి పంటనష్టం జరిగినప్పుడు సాయం అందించడానికి సవాలక్ష నిబంధనలు అడ్డొస్తాయి. వీటిని తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడితే కనీసం అలాంటి రైతుల కుటుంబాలను ఆదుకోవాలన్న స్పృహ కూడా పాలకులకు ఉండటం లేదు. చంద్రబాబు హయాంలో ఆంధ్రప్రదేశ్‌లో 2014–19 మధ్య 1,513 మంది రైతులు ప్రాణాలు తీసుకుంటే అంతో ఇంతో ఆర్థిక సాయం దక్కింది కేవలం 391 కుటుంబాలకు మాత్రమే. మిగిలిన కుటుంబాలన్నిటి వివరాలూ సేకరించి అర్హతగల ప్రతి కుటుంబానికీ రూ. 7 లక్షల చొప్పున పరిహారం అందించాలని తాజాగా జిల్లా కలెక్టర్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశించారు. వైఎస్సార్ భరోసా పథకాన్ని చెప్పినకంటే ముందే ప్రారంభించి వార్షిక సాయం రూ. 12,500 అందించాలని నిర్ణయించారు. ఉచిత పంటలబీమా, ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు వంటివి ఏర్పాటుచేశారు. అసెంబ్లీలో గురువారం చర్చ సందర్భంగా రైతు సంక్షేమానికి తీసుకోబోయే చర్యల్ని వివరించారు. ఇలా సమస్యల్ని సహృదయంతో అర్థం చేసుకుని, మానవీయ కోణంలో ఆలోచించే పాలకులుండటం ఇప్పటి అవసరం.

మొన్నటివరకూ కేంద్ర వ్యవసాయమంత్రిగా పనిచేసిన రాధామోహన్ సింగ్ అడిగిన ప్రశ్నకు లోక్‌సభలో వ్యవసాయశాఖ సహాయ మంత్రి పురుషోత్తం రూపాల మంగళవారం బదులిస్తూ 2015 తర్వాతనుంచి రైతుల ఆత్మహత్యలకు సంబంధించిన వివరాలను రాష్ట్రాలేవీ పంపలేదని, అందువల్ల జాతీయ క్రైం రికార్డుల బ్యూరో దగ్గర గణాంకాలు లేవని చెప్పారు. బలవన్మరణాలకు పాల్పడిన రైతులెందరో చెప్పలేని దుస్థితిలో ప్రభుత్వాలున్నప్పుడు వాటినుంచి ఇక ఆశించేదేముంటుంది? ఈ పరిస్థితి మారాలి. పాలకులు చిత్తశుద్ధితో రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి.

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు ఆషాఢమాసం, తిథి శు.ఏకాదశి రా.2.22 వరకు, తదుపరి ద్వాదశి, నక్షత్రం విశాఖ సా.6.41 వరకు, తదుపరి అనూరాధ వర్జ్యం రా.10.40 నుంచి 12.14 వరకు, దుర్ముహూర్తం ఉ.8.10 నుంచి 9.02 వరకు, తదుపరి ప.12.29 నుంచి 1.21 వరకు అమృతఘడియలు... ఉ.10.08 నుంచి 11.43 వరకు, తొలి ఏకాదశి.

**సూర్యోదయం :** 5.36
**సూర్యాస్తమయం:** 6.32
**రాహుకాలం :** ఉ. 10.30 నుంచి 12.00 వరకు
**యమగండం :** ప.3.00 నుంచి 4.30 వరకు

# విశ్వవిద్యాలయాల ప్రక్షాళన అత్యవసరం

విశ్లేషణ



ప్రొఫెసర్ పులికొండ సుబ్బాచారి

**విశ్వవిద్యాలయాల పాలనలో కొంత స్వేచ్ఛ తీసుకొని తమ విధానాలను అమలు చేసుకోవచ్చు అనే వెసులుబాటు ఉండడం వల్ల కొన్ని రాష్ట్రాలు వాటికున్న అధికారాలను దుర్వినియోగం చేసి వర్సిటీల వ్యవహారాల్లో పీకల్లోతున జోక్యం చేసుకొని ఉన్నత విద్యా ప్రమాణాలను దిగజార్చే పనులు చేస్తున్నాయి. ఉమ్మడి ఏపీలో ఇలాంటివి చాలా జరిగాయి. గతంలో ఏపీ ప్రభుత్వం వర్సిటీల్లో సహాయాచార్యులను నియమించే ప్రక్రియను తాను లాక్కొని వీరి నియామకం ఏపీపీఎస్సీ ద్వారా జరిపే విధంగా మార్చింది. ఇది విశ్వవిద్యాలయాలకున్న స్వయంప్రతిపత్తిని పూర్తిగా హరించి వాటిని నాయకులు తమ కనుసన్నలలో ఉంచుకునే తీరులోనే సాగింది. ఏపీలో వైఎస్ జగన్ నేతృత్వంలో వచ్చిన నూతన ప్రభుత్వం వర్సిటీల పాలనలో జరుగుతున్న అన్ని అక్రమాలను కడిగేసి, అన్ని నియామకాల్లో ప్రమాణాలను పాటించే బాధ్యత తప్పక తీసుకోవాలి.**

గడచిన ఐదారేళ్లుగా తెలుగు రాష్ట్రాలలో విశ్వవిద్యాలయాల పాలన గాడి తప్పి కంగాళీ అయింది. ఏయే అవాంఛనీయ పరిణామాలు చోటు చేసుకున్నాయో వివేచించి దారికి తెచ్చే మార్గాన్ని ఆలోచించి ప్రస్తుత ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. మన విశ్వవిద్యాలయాలు రెండు అధికారాల అధీనంలో పనిచేయవలసి ఉంటుంది. మనకు విద్యారంగం రాజ్యాంగం ప్రకారం ఉమ్మడి జాబితాలో ఉంటుంది. యూజీసీ పార్లమెంటు అనుమతితో ఉన్నత విద్యకు సంబంధించి కొన్ని అధికరణాలను చేస్తుంది. ఇవి పార్లమెంటు చేసే చట్టాలలో భాగం. అదేవిధంగా ఆయా రాష్ట్రప్రభుత్వాలు విశ్వవిద్యాలయాల పాలనకు సంబంధించి మరికొన్ని నిబంధనలను పెట్టుకుంటాయి. ఉదాహరణకు యూజీసీ ప్రకారం ఆచార్యుల పదవీ విరమణ 65 ఏళ్లకు జరగాలి. కాని రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని 60, కొన్ని 62 మరికొన్ని 65 ఏళ్లుగా పెట్టుకున్నాయి. కాగా విశ్వవిద్యాలయాల కేంద్ర రెగ్యులేషన్ ప్రకారం 65 సంవత్సరాలుగా మాత్రమే ఉండాలని ఆదేశించవలసిందిగా రాష్ట్రాల ఆచార్యులు కొందరు సుప్రీంకోర్టును కోరారు. దానికి సుప్రీంకోర్టు నిరాకరిస్తూ రాష్ట్రాలకు వారి పాలన పద్ధతి ప్రకారం పదవీ విరమణ వయస్సును పెట్టుకోవచ్చు అని చెప్పింది. కాని అదే సుప్రీంకోర్టు యూజీసీ నిబంధనలు కొన్నింటిని రాష్ట్రాలు అధిగమించరాదని చెప్పింది. ఆచార్యుని అనుభవం పదేళ్లు ఉంటేనే వీసీ పదవికి అర్హుడు అనే విషయంలో సుప్రీం తుది తీర్పు ఇంకా రావలసే ఉంది. అందాక అదే అమలులో ఉంది చాలా రాష్ట్రాలలో.

విశ్వవిద్యాలయాల పాలనలో కొంత స్వేచ్ఛ తీసుకొని వారి వారి విధానాలను అమలు చేసుకోవచ్చు అనే వెసులుబాటు రాష్ట్రాలకు ఉండడం వల్ల కొన్ని రాష్ట్రాలు వాటికున్న అధికారాలను దుర్వినియోగం చేసి వర్సిటీల పాలనలో పీకల్లోతున జోక్యం చేసుకొని, వాటి స్వయం ప్రతిపత్తిని తుంగలో తొక్కి, రకరకాల గందరగోళాలు సృష్టించి ఉన్నత విద్యా ప్రమాణాలను దిగజార్చే పనులు చేస్తున్నాయి. తెలుగు రాష్ట్రాలలో గడచిన దశాబ్దంలో ఇలాంటివి చాలా జరిగాయి. వర్సిటీల ఆచార్యులను మూడు స్థాయిలలోని వారిని నియమించుకునే స్వతంత్ర ప్రతిపత్తి విశ్వవిద్యాలయాలకే ఉంటుంది. దీనిలో రాష్ట్ర ప్రభుత్వాల ప్రత్యక్షజోక్యం ఏ విధంగానూ ఉండదు. కాని గతంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విశ్వవిద్యాలయాలలో సహాయాచార్యులను నియమించే పద్ధతిని తాను లాక్కొని వీరి నియామకం ఏపీపీయస్సీ ద్వారా జరిపే విధంగా మార్చింది. వారికి సర్వీసుకమీషనే పరీక్షపెట్టి వారిలో ఉత్తీర్ణత పొందిన వారి జాబితాను విశ్వవిద్యాలయాలకు పంపితే ప్రభుత్వ నియమాల ప్రకారం వారిని నియమించుకునేలా చట్టాలు మార్చింది. ఇది విశ్వవిద్యాలయాలకున్న స్వయంప్రతిపత్తిని పూర్తిగా హరించి తిరిగి వాటిని నాయకుల కనుసన్నలలో ఉంచుకునే తీరులోనే సాగింది. దీని వల్ల విశ్వవిద్యాలయాలు మరో రకం డిగ్రీ కాలేజీలుగా మారిపోతాయి. ఇలా చేయడానికి ప్రభుత్వం చూపిన సాకు ఏమంటే విశ్వవిద్యాలయాల ఉపాధ్యక్షులు సహాయాచార్యుల నియామకాలలో అక్రమాలకు పాల్పడుతున్నారని అవినీతి జరుగుతూందని. కానీ సర్వీసు కమిషన్లు కూడా అవినీతికి అక్రమాలకు పాల్పడిన ఘట్టాలు గతంలో ఎన్నో జరిగిన ఉదంతాలు కోర్టు కేసులు పరిశీలిస్తే చరిత్రే తెలుస్తుంది. ప్రభుత్వం చేసిన ఈ మార్పు వల్ల అవినీతి ఒకచోటునుండి మరొక చోటుకు మారుతుందే కాని ఆగదు అని ప్రభుత్వం గమనించలేదు. దీనికి బదులు అసలు ఉపాధ్యక్షుల నియామకంలోనే నిజాయితీపరులను నియమిస్తే, యూజీసీ నిబంధనలను పాటిస్తే ఈ అక్రమాలు జరగవు. అలా కాక కొన్ని ప్రభుత్వాలు వీసీల నియామకాలలోనే యూజీసీ నియమాలను ఉల్లంఘించి అనర్హులకు అనుభవం లేనివారికి అవకాశాలిచ్చాయి. దీనికి రాజకీయ కారణాలు ఒత్తిడులే కారణం. అంతే కాదు ఆచార్యులను ప్రభుత్వమే నియమించడం వల్ల విశ్వవిద్యాలయాలకు చాలా నష్టం జరుగుతుంది. కొన్ని విశ్వవిద్యాలయాలలో ప్రత్యేకమైన శాఖలుంటాయి. అసలు కొన్ని విశ్వవిద్యాలయాలే ప్రత్యేక అవసరాలకోసం ఏర్పడతాయి. వాటికి ఏవిధమైన పోస్టులు కావాలి ఏశాఖలు కావాలి ఎలాంటి వారితో వీటిని నింపుకోవాలి అనే విషయం ఆయా విశ్వవిద్యాలయాలకే తెలుస్తుంది.




గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విశ్వవిద్యాలయాల ప్రమాణాలను, విద్యావసరాలను దెబ్బకొట్టే నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం ఖర్చును తగ్గించుకొని ఉన్నత విద్య బడ్జెట్‌కు తీవ్రంగా కోత పెట్టే దిశలో కొన్ని నిర్ణయాలు తీసుకుంది. కొన్ని శాఖలను అనవసరమైనవిగా ప్రభుత్వమే నిర్ణయించుకుంది. కొన్ని శాఖలను రద్దు చేసి వాటిలో ఉన్న ఆచార్యులను వేరే శాఖలకు పంపి శాఖలను కలిపేయడం లేదా రద్దు చేయడం చేసింది. ఆచార్యుల పోస్టులు వందల సంఖ్యలో రద్దు చేయడం లేదా ఆచార్యుల పోస్టులను సహాయ ఆచార్యుల పోస్టులుగా మార్చి వాటి రిక్రూట్‌మెంటును సర్వీసు కమిషన్ ద్వారా చేయడం, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు కూడా కొన్నింటిని రద్దుచేయడం కొన్నింటినే ఉద్యోగ ప్రకటనలలో ఉంచడం చేసింది. జానపదశాఖ, సంగీత లలితకళ శాఖలు, తత్వశాస్త్రశాఖ కొన్ని సంప్రదాయసైన్సు శాఖలలోని పోస్టులను రద్దుచేసింది. కొన్నింటిని మూసివేయడం చేసింది. సమాజానికి కంప్యూటర్ శాస్త్రం, విజ్ఞాన శాస్త్రాలు ఎంత అవసరమో ఒక అర్థశాస్త్ర శాఖ, ఒక చరిత్ర శాఖ, ఒక జానపద శాఖ తత్వశాస్త్రశాఖ కూడా అంతే అవసరం అనే స్పృహను ప్రభుత్వం కోల్పోయింది. ఈశాఖలు ఎందుకు వాటిని రద్దుచేస్తేనే మంచిది అనే ధోరణిలో ఇలా హేతుబద్ధీకరణ చేసింది ప్రభుత్వం. ఇది ఉన్నత విద్యకు సమాజ ప్రగతికి శరాఘాతం లాంటిది. ఉమ్మడి రాష్ట్రంలో 1990 దశకంలో చరిత్ర శాఖలు ఎందుకు వాటిని తీసివేయాలి అని ఆనాటి తెలుగుదేశం ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నప్పుడు పెద్దఎత్తున మేధావులలో, విశ్వవిద్యాలయాల పరిధిలో అలజడి చెలరేగింది. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కు తీసుకుంది. కానీ కిరణ్‌కుమార్ రెడ్డి ప్రభుత్వం కూడా ఆ విధానాలనే అమలుచేస్తూ వచ్చింది. విభజనానంతరం 2014లో మళ్లీ అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం తిరిగి ఒక హైపవర్ కమిటీని వేసి హేతుబద్ధీకరణ పేరుతో పైన చెప్పిన అవాంఛనీయమైన పనులు అన్నీచేసింది.

ఇక విశ్వవిద్యాలయాలను డిగ్రీకళాశాలలుగా మార్చే మరొక చర్య తీసుకుంది ప్రభుత్వం. అదేమంటే పీజీ ఎంట్రెన్స్‌కి కామన్ పరీక్ష పెట్టడం, కామన్ సిలబస్‌లు అన్ని కోర్సులకు ఉండాలని చెప్పడం ఇలాంటిదే. రీసెర్చి ప్రవేశాలకు కూడా కామన్ ప్రవేశ పరీక్షపెట్టడం కూడా ఇలాంటిదే. దీనివల్ల చాలా విశ్వవిద్యాలయాలకు వాటి స్వేచ్ఛపోతుంది. కొన్ని విశ్వవిద్యాలయాలు వాటి అవసరాలకు అనుగుణంగా పాఠ్యప్రణాళిక రచన చేసుకుంటాయి. కరిక్యులమ్ డిజైనింగ్‌కి నాక్ అత్యంత ప్రాముఖ్యం ఇస్తుంది. ఈ విషయాన్ని కూడా ప్రభుత్వం గుర్తించలేదు. ఇటీవలి కాలంలో విశ్వవిద్యాలయాలలోనే ఆయా ఉపాధ్యక్షుల అలసత్వం వల్లనేమి, భిన్నమైన ఆలోచనల వల్లనేమి పరిశోధనల ప్రమాణాలు పాతాళానికి పడిపోయే పరిస్థితి వచ్చింది. దూరవిద్యలో పీహెచ్‌డీ పరిశోధనకు అవకాశం కల్పించడం యూజీసీ చేసిన ఘోరమైన తప్పిదంగా అది గుర్తించే సరికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. తిరిగి 2009లో దాన్ని రద్దుచేసినా కొన్ని విశ్వవిద్యాలయాలు పాత డేట్లతో అడ్మిషన్లు చేసాయి. ధనసంపాదనే ధ్యేయంగా ఆయా విశ్వవిద్యాలయాలు ఈ పాపానికి దిగాయి. ఎనిమిదివేల పీహెచ్‌డీ ప్రవేశాలు కేవలం మూడు నాలుగేళ్లలోనే చేసి ద్రవిడ వర్సిటీ ప్రపంచ రికార్డు నెలకొల్పడం పైన ఎంతో చర్చ జరిగింది ఎన్నో కేసులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. కావలసినంత రచ్చ జరిగింది. ఆ వర్సిటీ దాన్ని ప్రక్షాళన చేసుకునే పని ఇంకా చేసుకుంటూనే ఉంది. కాగా ఓయూలో కూడా ఏడువేల పీహెచ్‌డీ ప్రవేశాలు జరిగాయని ఇటీవలే వార్తలు పొక్కాయి. ఒక శాఖలో శాశ్వత ఉద్యోగిగా ఉన్న ఆచార్యుడు మాత్రమే ఆ శాఖలో పీహెచ్‌డీ పర్యవేక్షణకు అర్హుడు కాగా తాత్కాలిక ఆచార్యులకు అవకాశం ఇవ్వడం, ఒక శాఖలో పనిచేసే వారికి మరొక శాఖలో పరిశోధకులకు పర్యవేక్షణ చేసే అవకాశాలు ఇవ్వడం. డాక్టరేట్ ఉందని బోధనేతర సిబ్బందికీ పర్యవేక్షణ ఇవ్వడం ఇలాంటి అక్రమవిధానాలు కూడా కొన్ని చోట్ల జరిగాయి.

విశ్వవిద్యాలయాలకు ఈసీ మెంబర్లను ఎంపిక చేసేటప్పుడు ఉన్నత విద్యావంతులకు, విద్యావేత్తలకు అవకాశం పూర్తిగా ఇవ్వాలి. కానీ ప్రభుత్వాలు రాజకీయ కోణంలోనే పునరావాస కల్పన చేసే దిశగా ఆ పద్ధతికి గండి కొట్టి కొన్ని ఎంపికలను రాజకీయ నాయకులతో చేశాయి. దీనివల్ల విశ్వవిద్యాలయ పాలన రాజకీయమయం అవుతుందే కాని విద్యాప్రమాణాలకు ఏవిధంగానూ ఉపయోగపడదు. గ్రాంటులు చాలినంత ఇవ్వకుండా మీ వనరులు మీరే చూసుకోండి అని విశ్వవిద్యాలయాలను వదిలివేయడం వల్ల కూడా అవి ఆర్థిక సంపాదన పైన ధ్యాస పెట్టడంతో పీహెచ్‌డీ అక్రమాలకు గేట్లు ఎత్తినట్లు అయింది. ఏపీలో ప్రస్తుతం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలో కొత్త ప్రభుత్వం వచ్చింది. పరిపాలనను అన్ని కోణాలలో అన్ని స్థాయిలలో చక్కదిద్దే ప్రయత్నం ఇది చేస్తూ ఉంది. ఈ సందర్భంలో విశ్వవిద్యాలయ పాలన పైన ఈ కొత్త ప్రభుత్వం ధ్యాసపెట్టాలి. పైన చెప్పిన అక్రమాలను కడిగి వేసి విశ్వవిద్యాలయాలలో ఉన్నత ప్రమాణాలు ఉండేలా చర్యలు తీసుకోవాలి. అన్ని నియామకాలను ప్రమాణాల ప్రాతిపదికనే చేయాలి. ఈ కొత్త ప్రభుత్వం ఈ గురుతర బాధ్యతను స్వీకరిస్తుందని ఆశిద్దాం.

వ్యాసకర్త విశ్రాంత ఆచార్యులు, జానపద ఆదివాసీ అధ్యయనాల శాఖ, ద్రవిడ విశ్వవిద్యాలయం
మొబైల్ : 94404 93604

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!




## సోషల్ మీడియా

### నో



"కొత్త రైల్వే సర్వీసులు లేవు, కొత్త రైల్వే లైన్లు లేవు, కొత్త లైన్ల కోసం సర్వేలు లేవు, బుల్లెట్ రైళ్లు లేవు, హైస్పీడ్ రైళ్లు లేవు, కొనసాగుతూనే ఉన్న పాత రైల్వే ప్రాజెక్టులకు బడ్జెట్‌లో కేటాయింపులు లేవు. 'లేవు' అనే మాట ఎన్నిసార్లు చెప్పుకున్నామో, అన్ని కేటాయింపులు కూడా బడ్జెట్‌లో తెలంగాణకు కేటాయించలేదు. బుల్లెట్ రైలు, హైస్పీడ్ రైలుకు దక్షిణ భారతదేశం తగినది కాదనుకోవాలా?"
– కె. తారకరామారావు, టీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు

### వద్దు ధోనీ



"మహేంద్ర సింగ్ ధోనీజీ, నమస్కారం. మీరు రిటైర్ అవుదామనుకుంటున్నారన్న వార్తలు ఈ మధ్య వినిపిస్తున్నాయి. దయచేసి అటువంటి ఆలోచన ఏదీ చేయవద్దు. మన దేశానికి మీ ఆట ఎంతో అవసరం. రిటైర్మెంట్ అనే ఆలోచననే మీ మనస్సులోకి రానీయవద్దని నా అభ్యర్థన"
– లతామంగేష్కర్, గాయని

### స్ఫూర్తి



"పడిపోయినప్పుడల్లా లేచి నిలబడటాన్ని నాకు ఆటలే నేర్పించాయి. నాకు స్ఫూర్తిగా నిలిచే ప్రతీ ఒక్క అభిమానికి ఎన్నిసార్లు కృతజ్ఞతలు చెప్పినా సరిపోదు. మీ అందరి మద్దతుకు ధన్యవాదాలు. ఇదే స్ఫూర్తిని కొనసాగించండి. నా చివరి ఊపిరి వరకు నేను ఆడగలిగినంత బాగా ఆడతా. లవ్ యు ఆల్"
– రవీంద్ర జడేజా, క్రికెటర్

### పరిధి



"సుప్రీంకోర్టు తీర్పు చాలా ఆశ్చర్యం కలిగించింది. స్పీకర్ నిర్వహించాల్సిన కార్యకలాపాలపై ఆదేశాలు ఇవ్వడం సుప్రీంకోర్టు పరిధిలోకి రాదు. ప్రత్యేక పద్ధతిలో పనిచేయాల్సిందిగా స్పీకర్‌ను సుప్రీంకోర్టు ఆదేశించలేదు. ఇది రాజ్యాంగం ఇచ్చిన అధికారాలను అతిక్రమించడమే. నియంతృత్వ పాలన తన ప్రభావాన్ని విస్తరిస్తోంది"
– దినేష్ గుండూరావు, కాంగ్రెస్ నేత

### గాడిద



"తెలంగాణలో కాళేశ్వరం కడుతూ ఉంటే గత ఐదేళ్ళలో చంద్రబాబు గాడిదలు కాశాడా అధ్యక్షా?' – సీఎం జగన్. తెలుగుదేశం శాసనసభ్యులు– 'మా చంద్రబాబుని గాడిద అంటారా! స్టేట్‌మెంట్ వెనక్కు తీసుకోండి'. వార్నీ... జగన్ అన్లేదుగానీ మీరు మాత్రం బాబును గాడిద అనేశారు. మనసులో మాట ఇలా బయటపడ్డది అంతే."
– కత్తి మహేష్, సినీ నటుడు

# దేవిప్రియ రచనలు: ఒక విజ్ఞప్తి

సుప్రసిద్ధ కవి, ప్రముఖ సంపాదకుడు దేవిప్రియ సమగ్ర రచనల ప్రచురణకి ప్రయత్నం జరుగుతోంది. ఆయన పాత్రికేయ రచనలు ప్రత్యేకంగా ప్రచురించవలసి ఉంది.

తొలి విడతగా దేవిప్రియ కవిత్వం, రంగస్థల రచనలు, రేడియో, టెలివిజన్ రచనలు, లలిత గీతాలు, కొన్ని సినిమా పాటలు రెండు, మూడు సంపుటాలుగా వెలువరించే ప్రయత్నం చేస్తున్నాము. కింద పేర్కొన్న రచనల సేకరణలో సహాయపడవలసిందిగా దేవిప్రియ అభిమానులకీ, సాహిత్య ప్రియులకీ విజ్ఞప్తి చేస్తున్నాము.

- కంచికచర్ల కోటేశు సజీవ దహనం మీద రాసిన కవిత. విజయవాడ నుంచి వెలువడిన జ్వాల రాజకీయ వారపత్రిక మార్చి, 1968 సంచికలు.
- విజయవాడ నుంచి వెలువడిన తెలుగు–వెలుగు వారపత్రిక సంచికలు: 1968–1969–1970–1971.
- ప్రజాతంత్ర సోదర పత్రికగా వెలువడిన విజేత మాసపత్రిక సంచికలు: 1977–1978.
- దూరదర్శన్, హైదరాబాద్ కేంద్రం ప్రసారం చేసిన రాణి పువ్వు అనే నృత్య రూపకం: 1979.
- విజయవాడ ఆకాశవాణి కోసం రాసిన నాటిక ఆడ తోడు–మగ నీడ: 1968
- గుంటూరు ఏసీ కాలేజీ విద్యార్థులు ప్రదర్శించిన మహాత్ముడు: 1968–69.
- మరి రెండు నాటికలు: పట్టాలు తప్పని బండి: 1967–68, వీఎస్ఆర్ కాలేజీ విద్యార్థుల ప్రదర్శన: కాలం కార్చిన కన్నీరు: 1969.
- పద్య కావ్యం వనజారాయలు: 1970–71
- నాయనమ్మ పదాలు: 1967
- వియోగిని: సంక్లిష్టమైన వియోగినీ ఛందస్సులో రాసిన దీర్ఘ పద్యం: 1968–69.
- పలు సందర్భాలలో రాసిన కంద పద్యాలు.
- మద్రాసులో అలనాటి చిత్ర నిర్మాత, రంగస్థల నటుడు శేషయ్య శెట్టి ప్రదర్శించిన భస్మాసుర నాటక కోసం సాలూరి హనుమంతరావు బాణీలకు రచించిన పదికిపైగా గీతాలు: 1971–72.
- మద్రాసు హిందుస్తాన్ బైబిల్ సొసైటీవారి సిలోన్ రేడియో కార్యక్రమం కోసం రాసిన పాటలు.

చిరునామా : 204, రాచకొండ టవర్స్, ఆల్వాల్, సికింద్రాబాద్–10
ఈ–మెయిల్: tadikondadevipriya@gmail.com

# పోరాట వీరుడు గులాం రసూల్

సిపాయిల తిరుగుబాటు -1857- కంటే ముందు మన దేశంలో అనేక తిరుగుబాట్లు జరిగాయి. 1757లో బెంగాల్ నవాబు సిరాజుద్దౌలా తొలిసారిగా బ్రిటిష్ వారిపై కరవాలం ఝుళిపించాడు. తర్వాత ఉత్తర భారతంలో పలు స్థానిక తిరుగుబాట్లు నమోదయ్యాయి. దక్షిణ భారత్‌లో మైసూరు పాలకుడు హైదరాలీ, అతని కుమారుడు టిప్పు సుల్తాన్ బ్రిటిష్ వారిపై సాగించిన అలుపెరుగని పోరాటం అందరికీ తెలిసిందే. క్రీ.శ 1799లో నాల్గవ మైసూరు యుద్ధంలో టిప్పు సుల్తాన్ చనిపోయాక బ్రిటిష్ వారికి ఆ యుద్ధంలో సహాయపడిన నిజాంనవాబుకు నేటి రాయలసీమ జిల్లాప్రాంతాలు, బళ్లారి దక్కాయి. 1800 సంవత్సరం అక్టోబరులో నిజాం నవాబు ఈ ప్రాంతాలను బ్రిటిష్ వారికి దత్తత ఇచ్చాడు. సీమలో బ్రిటిష్ పాలన మొదలైంది. కర్నూలు ప్రాంత నవాబు అలఫ్‌ఖాన్ బ్రిటిష్ వారితో సంధి కుదుర్చుకుని ఏటా లక్షకుపైగా శిస్తు చెల్లిస్తూ సువిశాల ప్రాంతాన్ని పాలించేవాడు. ఇతడి మరణం తర్వాత తన ఆఖరి కుమారుడు గులాం రసూల్ ఖాన్ కర్నూలు జాగీర్దార్ అయ్యాడు. బ్రిటిష్ పాలకుల దోపిడీపై ద్వేషంతో రగిలిన రసూల్, 1830 ప్రాంతంలో మొదలైన వహాబీ ఉద్యమం పట్ల ఆకర్షితుడై వారి సహాయార్థం కర్నూలులో ఏకంగా ఆయుధాల కర్మాగారాన్నే నెలకొల్పాడు. ఇది తెలిసిన బ్రిటిష్ వారు క్రీ.శ. 1839 సెప్టెంబరులో కర్నూలు కోటపై సైనికులతో దాడి చేశారు. కర్నూలు సమీపంలోని జోహరాపురం వద్ద ఇరుపక్షాలకు జరిగిన యుద్ధంలో పట్టుబడిన గులాం రసూల్ ఖాన్‌ని విచారణ నిమిత్తం తమిళనాడులోని తిరుచునాపల్లి జైలుకు పంపి 1840 జూలై 12న కుట్రపూరితంగా హత్య చేసిన బ్రిటిష్ పాలకులు కర్నూలు జాగీరును వశపర్చుకున్నారు. ప్రముఖ రచయిత ఎస్.డి.వి. అజీజ్ ఈ పోరాటాన్ని గులాం రసూల్ ఖాన్ పేరిట తెలుగులో నవలగా రాశారు. దీన్ని ఇంగ్లిష్, కన్నడంలోకి అనువదించారు. ప్రథమ భారత స్వాతంత్ర్య పోరాటానికి ముందే బ్రిటిష్ వారిపై పోరాడి 35 ఏళ్ల ప్రాయంలోనే అసువులు బాసిన ఈ సమర యోధుడి పట్ల ప్రభుత్వం ఇంతకాలం ఉదాసీనంగా ఉండడం విచారకరం. ఇతడి పోరాటాన్ని విద్యార్థులకు పాఠ్యాంశంగా చేర్చడమే కాకుండా కర్నూలులో అతడి విగ్రహాన్ని ప్రభుత్వమే నెలకొల్పాలి. తన వర్ధంతిని ఏటా ప్రభుత్వమే జరిపిస్తూ, కర్నూలు ఎయిర్‌పోర్టుకు తన పేరు పెట్టాలని కర్నూలు జిల్లా ప్రజల డిమాండ్.



(స్వాతంత్ర్య సమరయోధుడు గులాం రసూల్ ఖాన్ 179వ వర్ధంతి సందర్భంగా)

ఖదీరుల్లా, అధ్యక్షులు, ఇంటలెక్చువల్ కలెక్టివ్ ఫోరం, కర్నూలు
మొబైల్ : 98498 86629

# ఆ ఎమ్మెల్యేలకు పదవులు గడ్డిపోచలా?

విశ్లేషణ



మాడభూషి శ్రీధర్

కర్ణాటకలో సంకీర్ణ ప్రభుత్వాన్ని పడగొట్టాలంటే ఉన్న ఎమ్మెల్యేల బలం సరిపోదు. తమ బలం ఫిరాయింపులతో పెరగాలి లేదా ప్రభుత్వ పక్షాన్ని రాజీనామాలతో తగ్గించాలని పథకం వేశారు. ఫిరాయిస్తే కోట్లిస్తాం, మంత్రి పదవిస్తాం అంటూ బీజేపీ నేతలు కాంగ్రెస్, జనతాదళ్ ఎమ్మెల్యేలతో మాట్లాడిన టెలిఫోన్ రికార్డులు బయటపడినా భయపడకుండా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, జనతాదళ్ ఎమ్మెల్యేలు 'వారంతట వారే' పదవులను గడ్డిపోచల వలె వదిలించుకునేందుకు పథకం వేశారు. ప్రత్యేక విమానం, లగ్జరీ బస్సుల్లో 'సొంత' ఖర్చుతో ముంబై వెళ్లిపోయారు. పాపం శివకుమార్ పరుగెత్తి విమానాశ్రయం చేరుకునేటప్పటికే ఎమ్మెల్యేలు ప్రత్యేక విమానంలో ఎగిరిపోయారు.

బీజేపీ వారి సర్కార్‌లో మంత్రిపదవి అయితే రెండుమూడు సౌకర్యాలు ఉంటాయి. రాష్ట్రంలో కేంద్రంలో ఒకే సర్కారు ఉంటుంది కనుక చాలా హాయి. మంత్రి పదవి ఉంటే సహజంగానే నాలు గురాళ్లు వెనకేసుకోవాలి కదా. అప్పుడు ఆదాయ పన్నువారు, ఎన్ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్లు సీబీసీ వారు దాడులు చేయకుండా ఊరుకుంటారా? బీజేపీ మంత్రి పదవితో పోల్చితే సంకీర్ణ మంత్రిపదవిలో ప్రమాదాలు ఎక్కువ. పరువు, పదవీ పోయి జైలు దక్కవచ్చు. మరి ఈ శివకుమార్ మాట్లాడేదేముంటుంది? శివకుమార్, కుమార స్వామి, సిద్దరామయ్యకు ఎటూపాలు పోవడం లేదు.

రాజీనామా వ్యూహం అద్భుతమైంది. అందులో వచ్చే సౌకర్యమేమంటే ఎవరూ అన్యాయం.. రాజ్యాంగ వ్యతిరేకం అని అరిచే అవకాశాలు లేవు. ఎవరి అభ్యంతరం లేకుండా బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేసుకోవచ్చు. సభలో ఉండి ఓటువేసే వారిలో సగానికి ఒకరెక్కువ ఉంటే చాలు అని మన సంవిధానం చెబుతున్నది కదా. కనుక రాజీనామాలు చేయించేస్తే మళ్లీ ఉపఎన్నికలు జరిగే దాకా మన రాజ్యానికి తిరుగులేదనే వ్యూహంతో యడ్యూరప్ప, వారి అనుయాయులు, ఆపైన ఢిల్లీ నాయకులు కర్ణాటక సింహాసనం మీద కూర్చోవడానికి ఉవ్విళ్లూరుతున్నారు.

ఉపఎన్నికలు జరిగే దాకా ఈ అంకెమారదు, అయితే మనవాళ్లను గెలిపించుకోవడం ఎంత సేపు? జనం కమలం మీద ఓట్లు గుద్దడానికి ఉవ్విళ్లూరుతున్నారు కదా. జనతాదళ్, కాంగ్రెస్ కలిసి పోటీచేసినా సీనియర్ నేత మాజీ ప్రధాని దేవెగౌడనే గెలిపించుకోలేని వారు ఉప ఎన్నికల్లో గెలువగలుగుతారా? ప్రజాస్వామ్యాన్ని ఎలా కాపాడుకోవాలో పాపం జనతాదళ్‌కు, కాంగ్రెస్‌కు తెలియడం లేదు. శాసన సభలో అసలు బలం 224 అయినా 16 మంది రాజీనామాలు ఆమోదిస్తే అది 208కి పడిపోయి 105 మంది ఉన్న పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవచ్చునని బీజేపీ ఆశ. కాంగ్రెస్, జనతాదళ్ సంకీర్ణ బలం వందకు తగ్గిపోతుంది. తిరుగుబాటు ఎమ్మెల్యేలను కలుసుకోవడానికి శివకుమార్ ముంబైకి వెళ్లినా ప్రయోజనం లేకపోయింది. 1995లో తెలుగుదేశం వారి ఫిరాయింపు ఇంజినీర్లు చెలరేగిన కాలంలో వైస్రాయ్ హోటల్‌కు తెలుగు తమ్ముళ్లు ఎన్టీఆర్‌నే రానీయనట్టు, శివకుమార్‌ను అరెస్టు చేసి పంపించారు. ఆ విధంగా న్యాయం, ధర్మం, రాజ్యాంగం, పోలీసులు, పొరుగు ప్రభుత్వాలు కూడా ఎమ్మెల్యేల రాజీనామా స్వేచ్ఛను కాపాడడానికి కృషి చేస్తున్నారు.

కర్ణాటక శాసన సభాపతి 'వీరు స్వచ్ఛందంగా రాజీనామా చేశారా? ఇవి నిజమైన రాజీనామా లేనా?' అని అనుమానిస్తున్నారు. ఆ విధంగా అనుమానించడం స్పీకర్ రాజ్యాంగ బాధ్యత. రాజీనామా ఎందుకు చేస్తున్నారో స్పీకర్‌కు చెప్పాల్సిన పని లేదు. కానీ అది నిజమైన స్వచ్ఛందమైన రాజీనామా అని స్పీకర్‌కు విశ్వాసం కలగాలి. అందుకు ఆయన తనకు తోచిన విధంగా ఎంక్వయిరీ చేసుకోవచ్చు అని రాజ్యాంగం స్పష్టంగా చెప్పింది.

స్పీకర్ కు కాకపోయినా ఓటర్లకు ఎమ్మెల్యేలు వివరణ ఇచ్చుకోవాలి. ఈ ప్రభుత్వం ఎందుకు బాగోలేదు, వారి తప్పులను ఇదివరకు ఎప్పుడైనా ఎత్తి చూపారా? రాజీనామా చేస్తే తప్ప కర్ణాటక ప్రభుత్వం బాగుపడదని ఎప్పుడు తెలిసింది. ఈ జ్ఞానోదయం ముంబై హోటల్‌కు వెళ్లడానికి ముందు కలగకపోవడం కూడా ఆశ్చర్యమే కదా, అయినా పది మందికలిసి ఒకే బస్సులో వెళ్తున్నా అది ఒక్కొక్కరు వ్యక్తిగతంగా సొంతంగా ఆలోచించి ఏ కుట్రా లేకుండా ఏదురుద్దేశమూ లేకుండా నిర్ణయించుకున్నారని ఏ విధంగా అనుకుంటారని స్పీకర్ అనుమానిస్తున్నారు.

అయిదేళ్లకోసం ఎన్నుకున్న ప్రజలకు, పార్టీకి ద్రోహం చేస్తూ మధ్యంతరంగా వదిలేయడం ఊరికే జరగదు. బలీయమైన అసలు కారణాలను దాచేశారు. సభ్యత్వాలను గడ్డిపోచగా భావించి వదులుకుంటూంటే ఆపుతారా అని స్పీకర్‌ను కోప్పడాలని 'తిరుగుబాటు' ఎమ్మెల్యేలు సుప్రీంకోర్టును అడుగుతున్నారు.

వ్యాసకర్త బెన్నెట్ యూనివర్సిటీ ప్రొఫెసర్, కేంద్ర సమాచార మాజీ కమిషనర్
madabhushi.sridhar@gmail.com

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 270 1083

సాక్షి
ఫ్యామిలీ
విజయవాడ ॥ శుక్రవారం
12-7-2019



అలనాటి కామెడీ స్టార్ గిరిజ

గిరిజ కూతురు సలీమాతో ఇంటర్వ్యూ

'నరుడా ఏమి నీ కోరిక' డైలాగ్ ఆమెదే. 'సరదా సరదా సిగిరెట్టు ఇది దొరల్ తాగు బలె సిగిరెట్టు' అని రేలంగి సరదా పడితే 'కంపుకొట్టు ఈ సిగిరెట్టు కాల్చకోయి నా పై ఒట్టు' అని కసురుకుంది ఆమే. 'ఆరాధన' సినిమాలో అక్కినేనిని, సావిత్రిని తీవ్ర ఇక్కట్లకు తోసింది ఆమె కపటత్వమే. 'లవకుశ'లో రాముడి వేషం కట్టిన ఎన్టీఆర్‌కు సీతమ్మ వేషం కట్టిన అంజలీ పై మనసు విరిగిపోవడానికి కారణమైన రజకుని భార్య వేషం ఆమెదే. గిరిజ బ్లాక్ అండ్ వైట్ జమానాలో తెలుగు వారి కామెడీ స్టార్. రేలంగికి సరిజోడి. సెకండ్ హీరోయిన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా, కమెడియన్‌గా గిరిజ స్టార్‌డమ్‌ను చూసింది. 'వెలుగు నీడలు', 'జగదేకవీరుని కథ', 'ఆత్మ బంధువు', 'నమ్మినబంటు', 'కులగోత్రాలు', 'ప్రేమించి చూడు', 'భార్యాభర్తలు'... ఎన్నో సినిమాలు ఆమె నటనకు ఆనవాలుగా నిలిచి ఉన్నాయి.

వెండితెరపై ఒక వెలుగు వెలిగిన గిరిజ ఆ తర్వాత ఏమైందో ఎవరికీ వివరాలు తెలియదు. సోషల్ మీడియా వాడుకలోకి వచ్చాక గిరిజపై ఆధారాలు లేని కథనాలు ఎన్నో అప్‌లోడ్ అవుతున్నాయి. తెలుగువారికి ఎంతో ఇష్టమైన ఈ నటి గురించి వాస్తవాలు తెలుసుకోవడానికి 'సాక్షి' చేసిన ఎక్స్‌క్లూజివ్ ఇంటర్వ్యూ ఇది. తెలుగువారికి దాదాపుగా తెలియని గిరిజ కుమార్తె, నటి సలీమా మొదటిసారిగా చెన్నై నుంచి ఇలా సాక్షి ద్వారా తెలుగు పాఠకులతో మాట్లాడారు. ఆ వివరాలు.

● ఖదీర్

# అమ్మపై ఇన్ని పుకార్లా



సలీమా

**సాక్షి: గిరిజగారు ఎప్పుడు చనిపోయారు?**

**సలీమా:** సెప్టెంబర్ 5, 1995న చనిపోయారు. ఆమెకు డయాబెటిస్. కాని అదేం పెద్ద సమస్యగా ఉండేది కాదు. అపోలోలో డాక్టర్ సత్యమూర్తి చూసేవారు. ఆ రోజు అమ్మ టీ తాగి స్నానానికని బాత్‌రూమ్‌లోకి వెళ్లింది. కాని బయటకు వచ్చి మంచం మీద వాలిపోయి ప్రాణం విడిచింది. ఆమెకు శ్వాసకు సంబంధించిన తీవ్ర ఇబ్బంది వచ్చిందని డాక్టర్లు చెప్పారు.

**సాక్షి: గిరిజ మరణించినట్టు పేపర్లలో వార్త వచ్చిందా?**

**సలీమా:** నాకు గుర్తు లేదు. ఎవరూ రాసినట్టు లేదు. ఇండస్ట్రీవాళ్లు కూడా ఎవరూ వచ్చి చూడలేదు. అమ్మ చనిపోయిన రోజు అంతిమ సంస్కారాలు ముగిశాక – నాకు టైమ్ కూడా బాగా గుర్తు– రాత్రి 8.45కు శోభన్‌బాబు ఫోన్ చేశారు. నేను శోభన్‌బాబుని... అమ్మ చనిపోయినట్టు తెలిసింది... బాధపడకు... తెలుగు పరిశ్రమ ఎప్పుడూ నీకు తోడు ఉంటుంది.. ఏ కష్టం వచ్చినా రా అన్నారు. ఆయనొక్కరు. ఆ మరుసటి రోజు అల్లు రామలింగయ్య గారు వచ్చి వెళ్లారు. అంతే.

**సాక్షి: మీ అమ్మ చాలా దీనావస్థలో మరణించారని, నిరుపేద స్థితిలో మరణించారని ఇక్కడ వార్తలున్నాయి.**





సలీమా : అప్పుడు – ఇప్పుడు

**సలీమా:** అది తెలుగు జర్నలిస్టుల ఊహాశక్తి అనుకుంటున్నాను. మా అమ్మ చనిపోయే సమయంలో టి.నగర్‌లోని మందిర అపార్ట్‌మెంట్స్‌లో మేం ఉన్నాం. అది నేను కొన్న నా సొంత ఫ్లాట్. ఆ అపార్ట్‌మెంట్స్‌లోనే దర్శకుడు కె.మురళీమోహనరావు, రాజ్ కోటీలలోని రాజ్, హీరోయిన్ రంజిత ఉండేవాళ్లు. మీరు వాళ్లను కూడా అడిగి కన్ఫర్మ్ చేసుకోవచ్చు.

**సాక్షి: మీ అమ్మమ్మ నటి తిలకం మీ అమ్మ మద్రాసు వచ్చిన మూడేళ్లకే మరణించడం వల్ల మీ అమ్మకు సరైన దిశానిర్దేశం లేకుండా పోయిందని ఇక్కడ ప్రచారం.**

**సలీమా:** ఎవరు ఇవన్నీ రాస్తున్నది? మా అమ్మమ్మ తిలకం ఫిబ్రవరి 24, 1995న మరణించారు. ఆమె చనిపోయిన ఆర్నెల్లకు అమ్మ పోయింది. మా నాన్న మమ్మల్ని వదిలిపోయాక మా అమ్మమ్మ, అమ్మ, నేను ఒక గూటి పక్షులుగా పెరిగాం. మా అమ్మమ్మ లేకపోతే మా అమ్మ, నేను ఏమయ్యేవారమో చెప్పలేము. మా అమ్మమ్మకు చిన్న వయసులోనే పెళ్లవడం వల్ల అమ్మ, అమ్మమ్మ అక్కాచెల్లెళ్లలా ఉండేవారు. ఇద్దరూ ఒకే సమయంలో చనిపోయారు.

**సాక్షి: మీ నాన్న సన్యాసిరాజుగారి వివరాలు చెబుతారా?**

**సలీమా:** నాకు ఆయన గురించి ఎటువంటి ఆసక్తి లేదండీ.

**సాక్షి: మీకు గుర్తున్నవి?**

**సలీమా:** నాకు గుర్తున్నంత మటుకు ఆయన మా అమ్మను బాగా హింసించేవాడు. నేను చాలా చిన్న పిల్లను. కాని అంత చిన్నవయసులో కూడా మా అమ్మ సఫరింగ్ తెలిసేది. మా అమ్మకు ఆయనను ఎవరు పరిచయం చేశారో తెలియదు. కాని తిరుపతి వెళ్లి పెళ్లి చేసుకొని వచ్చారు. ఆయన ఖర్చు చేసిన ప్రతి రూపాయి మా అమ్మదే. ఆయనకు పెద్ద గ్యాంగ్ ఉండేది. మా అమ్మకు ఉన్న నీలిరంగు అంబాసిడర్ కారులో వాళ్లతో అర్ధరాత్రి వరకు తిరిగి, తాగి వచ్చేవాడు. మరుసటిరోజు కారు డ్రైవర్ వచ్చి ఆయన కారులో వాంతి చేసుకుంటున్నాడని గోల పెట్టేవాడు. ఒకసారి ఆయన ఏ వస్తువుతోటో మా అమ్మను తల మీద మోదితే పద్నాలుగు కుట్లు పడ్డాయి. నేనొకసారి పరిగెత్తుకుంటూ 'డాడీ' అని వెళితే కాలితో తన్నాడు. దొర్లి కింద పడ్డాను. ఆ తర్వాత ఆయన వైపు వెళ్లింది లేదు. ఆయన మంచి భర్త కాదు. మంచి తండ్రి కాదు. 'నేను ఈ పెళ్లి చేసుకోకపోతే చాలా బాగుండేదాన్ని. వివాహంలో స్త్రీకి సరైన పురుషుడు దొరక్కపోతే ఆమె జీవితం సగం దెబ్బ తిన్నట్టే' అని మా అమ్మ అనేది.

**సాక్షి: మీ నాన్న రెండు సినిమాలు తీశారు కదా.**

**సలీమా:** అవును. రెంటిలోనూ ఎన్టీఆరే హీరో. ఒకటి 'భలే మాస్టారు'. రెండు 'పవిత్ర హృదయాలు'. అందులో ఒక్కరూపాయి కూడా నాన్నది లేదు. అన్నీ అమ్మవే. చాలా గ్యారంటీ సైన్‌లూ అవీ అమ్మే చేసింది. సినిమాలు ఫ్లాప్ అయ్యాయి. అప్పుల బాధ పెరిగింది. ఒకరోజు పొద్దున నాన్న ఇప్పుడే వస్తానని వెళ్లి మళ్లీ కనిపించలేదు. మా ముఖం ఎప్పటికీ చూడలేదు. అమ్మమ్మ, అమ్మ, నేను... స్ట్రగుల్ అయ్యాం వాస్తవమే కాని పత్రికలు సానుభూతి కథనాలు రాసే స్థాయి కాదు.

**సాక్షి: మీ పేరు సలీమా అని ఉండటం ఆసక్తి కలిగిస్తోంది. మీరు మతం మారారా?**

**సలీమా:** లేదండీ. మా అమ్మ కలకత్తా కాళేశ్వరి దేవి భక్తురాలు. అక్కడకు వెళ్లి మొక్కుకుని వచ్చాక నేను పుట్టానని ఇంట్లో కాళమ్మ అని పిలిచేవారు. కాని ఆ తర్వాత అమ్మకు మౌంట్‌రోడ్‌లో ఉండే దర్గాపై గురి కుదిరింది. ఆ దర్గా ఇప్పటికీ ఉంది. రోడ్డు వైడెనింగ్‌లో ఆ దర్గాను తొలగించాలని ప్రయత్నించిన వారు రక్తం కక్కుకు చచ్చారని కథనాలు ఉన్నాయి. అంత పవర్‌ఫుల్. ఆ దర్గావారు నాకు ఇచ్చిన పేరు సలీమా. నా అధికారిక పేరు, రికార్డ్స్‌లో ఉన్న పేరు సలీమాయే. కాని నాకు మత పట్టింపు లేదు. గుళ్లకు, చర్చిలకు, దర్గాలకు వెళతాను.



భర్త సన్యాసిరాజుతో గిరిజ

**సాక్షి: మీరు ఏం చదివారు?**

**సలీమా:** ఇంటీరియర్ డెకరేషన్‌లో డిప్లమా చేశాను. కాని ఆ రంగంవైపు వెళ్లలేదు. అమ్మ ఇన్‌ఫ్లూయెన్స్ నా మీద ఉంది. చిన్నప్పుడే అమ్మ చీరలు కట్టడానికి ట్రై చేసేదాన్ని (నవ్వు). నాకు టీనేజ్ రాగానే మోడలింగ్ వైపు అవకాశాలు వచ్చాయి. అప్పట్లో టెక్స్‌టైల్ యాడ్స్ ఫేమస్. సుమంగళి టెక్స్‌టైల్స్, మహరాణి టెక్స్‌టైల్స్.. ఇలా దాదాపు 150 యాడ్స్ చేశాను. అక్కినేని నాగేశ్వరరావు కోరితే 'మేఘసందేశం' క్లయిమాక్స్‌లో ఆయన కూతురిగా యాక్ట్ చేశాను. ఆ సమయంలోనే అనుకోకుండా ఒక మలయాళ సినిమా మేనేజర్ నన్ను చూసి మలయాళంలో యాక్ట్ చేస్తారా అన్నారు. సరే అన్నాను. అలా టి.చంద్రకుమార్ దర్శకత్వంలో 'నిజన్ పిరన్నా నట్టిల్' (1985)లో నటించాను. మోహన్‌లాల్ హీరో. అయితే దానివల్ల గుర్తింపు రాలేదు. నటి కాంచనమ్మ రికమండేషన్‌తో ప్రఖ్యాత దర్శకుడు హరిహరన్ దర్శకత్వంలో 'నఖక్ష తంగళ్' (1986)లో నటించాను. ఆ సినిమా సూపర్ డూపర్ హిట్. ఇప్పటికీ నన్ను ఆ సినిమా హీరోయిన్‌గా అక్కడ గుర్తిస్తారు.

**సాక్షి: మరి హీరోయిన్‌గా ఎందుకు కొనసాగలేకపోయారు?**

**సలీమా:** మలయాళంలో నాలుగేళ్లలో 7 సినిమాలలో నటించాను. 'సంసారం ఒక చదరంగం' కన్నడ వర్షన్‌లో కల్పన రోల్ నేనే వేశాను. కాని ఆ తర్వాత నేను చెన్నైలో రియల్ ఎస్టేట్ వైపు వెళ్లిపోయాను. లాంగ్ గ్యాప్ తర్వాత ఇప్పుడు మలయాళం, తమిళ సినిమాలలో యాక్ట్ చేస్తున్నాను. మొన్న అంజలీ నటించిన 'లీసా'లో చాలా మంచి రోల్ చేశాను. తెలుగులో అది రిలీజైంది.

**సాక్షి: మీరు మలయాళంలో చేస్తున్నప్పుడు తెలుగు ఇండస్ట్రీ నుంచి అవకాశాలు రాలేదా?**

**సలీమా:** తెలుగు పరిశ్రమతో మాకు పెద్దగా కాంటాక్ట్ లేకపోవడం వల్ల ఏమీ రాలేదు.

**సాక్షి: గిరిజగారికి ఫీల్డ్‌లో ఎవరు ఫ్రెండ్స్ ఉండేవారు?**

**సలీమా:** సావిత్రిగారు మంచి ఫ్రెండ్. ఏ మాత్రం ఖాళీ ఉన్నా మా ఇంటికి వచ్చేవారు. ఆమెకు మా అమ్మమ్మ వంటలు ఇష్టం. నా తొలి బేబీ సైకిల్ ఆమే కొనిపెట్టారు. అమ్మమ్మ అప్పుడప్పుడు రేలంగి గారింటికి తీసుకువెళ్లేది. వాళ్ల భార్య శ్రీదేవమ్మ, కొడుకు బాబుగారు, కోడలు కుమారి గారు వీరు తెలుసు. అమ్మమ్మ చాలాసార్లు నాగేశ్వరరావు గారి గురించి చెప్పేది. సెట్‌లో కనపడితే మేకప్ కుర్చీలో కూర్చోబెట్టి 'గుడివాడ తిలకమ్మ గుడిలోకి వచ్చింది' అని పాడుతూ గిర్రున తిప్పేవారట. ఇద్దరిదీ ఒకే ప్రాంతం కావడంతో ఆయన చాలా అభిమానంగా ఉండేవారు. ఇక ఇండస్ట్రీ ఫంక్షన్స్ అంటే చిరంజీవి గారి పెళ్లికి అమ్మతో కలిసి వెళ్లిన జ్ఞాపకం ఉంది.

**సాక్షి: గిరిజగారు ఎప్పుడైనా తన నట జీవిత విశేషాలు చెప్పేవారా?**

**సలీమా:** పెద్దగా లేదు. ఆమె తన వివాహ రోజులను, సినిమా రోజులను మర్చిపోయి జీవించాలి అన్నట్టుగా ఆమెను నేను చూసుకున్నాను. కాని అప్పడప్పుడు ఆమె నటించిన పాట 'కాశీకి పోయాను రామా హరే' పాడి ఆట పట్టించేదాన్ని. నిజం చెప్పాలంటే ఆమె పాటల్లో నాకు నాగేశ్వరరావుతో కలిసి నటించిన 'హాయి హాయిగా జాబిల్లి తొలి రేయి వెండి దారాలల్లి' చాలా ఇష్టం.



కాశీకి పోయాను రామా హరీ...

**సాక్షి: రేలంగి గారు గిరిజగారు చాలా సన్నిహితంగా ఉండేవారని... కాని గిరిజ గారు ఆయనతో అనుబంధం తిరస్కరించారనీ...**

**సలీమా:** దాని గురించి నాకు తెలియదు. నా చిన్నప్పుడు అదంతా జరిగిందేమో తెలియదు.

**సాక్షి: మీరు సింగిల్‌గా ఉండటానికి మీ తల్లిగారి విఫల వివాహ ప్రభావం కారణమా?**

**సలీమా:** అలా ఏం లేదు. జీవితంలో మంచి అవకాశాలే వచ్చాయి కానీ పెళ్లి చేసుకోబుద్ధి కాలేదు. నేను మగ ద్వేషిని కాను. నాకు మంచి స్నేహితులు ఉన్నారు. ఇప్పటికైతే పెళ్లి చేసుకోలేదు. మునుముందు చేసుకుంటానేమో తెలియదు. నాకు డాన్స్ వచ్చు. మార్షల్ ఆర్ట్స్ నేర్చుకున్నాను. డ్రైవింగ్ చాలా ఇష్టం. జీవితం నాకు నచ్చినట్టుగా ఉంది.

**సాక్షి: తెలుగు ఇండస్ట్రీకి ఏమైనా చెప్పదలుచుకున్నారా?**

**సలీమా:** నేను గిరిజమ్మ కూతురుని. మా అమ్మ ఎన్నో తెలుగు సినిమాలు చేసింది. తెలుగు ఇండస్ట్రీ మీద నాకు హక్కు ఉంది. మా అమ్మ అక్కినేనితో పని చేసింది. వారబ్బాయి నాగార్జున ఫీల్డ్‌లో ఉన్నారు. ఎన్.టి.ఆర్‌తో పని చేసింది. వారబ్బాయి బాలకృష్ణ ఉన్నారు. వీరందరూ నాకూ ఇక్కడ స్థానం కల్పించాలని కోరిక. మంచి అవకాశాలు వస్తే హైదరాబాద్ షిఫ్ట్ అవ్వాలని ఉంది. నేను జీవితంలో చాలా రంగాల్లో పని చేశాను. కాని మేకప్ వేసుకొని కెమెరా ముందు నిలిచినప్పుడు పొందే ఆనందం మరెక్కడా పొందలేదు. ఒక నటి కూతురికి అనువంశికంగా వచ్చే సంపదా, ఆస్తి అదేనేమో. ●

SLE సమస్య నుండి విముక్తి పొందవచ్చా?

డా. శ్రీకాంత్ మోర్లావర్ (CMD)

SLE, ఇది ఒక ఆటోఇమ్యూన్ డిసీజ్, మన రోగ నిరోధక వ్యవస్థలోని తెల్లరక్తకణాలు మన సొంత కణాలపై దాడి చేయడం వలన కలిగే వ్యాధులను ఆటోఇమ్యూన్ డిసీజెస్ అంటాము.

ఈ వ్యాధి యొక్క దిశను ఊహించడం కష్టం. ఇది కొన్ని రోజులు తీవ్రంగాను (flare-up), కొన్ని రోజులు వ్యాధి లక్షణాలు తక్కువ అవడం జరుగుతుంది. ఈ వ్యాధి వలన శరీరంలోని అనేక అవయవాలు వ్యాధికి గురౌతాయి. ఇది గుండె, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, కీళ్ళు, చర్మం, రక్తనాళాలు, నాడీవ్యవస్థ, సంతానోత్పత్తి, కిడ్నీలు అవయవాలను పీడిస్తుంది. ఈ వ్యాధికి గురయ్యే అవయవాన్ని బట్టి లక్షణాలు కనిపిస్తాయి. ఏ వయస్సు వారిపైన ఈ వ్యాధి ప్రభావితం చేస్తుంది. ముఖ్యంగా 10 నుండి 50 సంవత్సరాల మధ్య వయస్సు గల వారిలో ఎక్కువగా కనిపిస్తుంది. పురుషుల కంటే స్త్రీలలో 10 రెట్లు అధికంగా ఈ సమస్య కనిపిస్తుంది.

కారణాలు: SLE వ్యాధికి గల ఖచ్చితమైన కారణాలు తెలియరాలేదు. కానీ కొన్ని జన్యుపరమైన అంశాలు, వాతావరణం ముఖ్యంగా అల్ట్రావాయిలెట్ కిరణాలు, కొన్ని మందులు, వైరస్‌లు, మానసిక, శారీరక ఒత్తిడి మరియు గాయాల వలన ఈ వ్యాధి ప్రేరేపించబడేదిగా అనుభవపూర్వకంగా తెలుస్తుంది.

లక్షణాలు: మెదడు మరియు నాడీ వ్యవస్థ ఈ వ్యాధి బారిన పడితే మానసిక అశాంతి, పక్షవాతం, మూర్ఛవ్యాధి, తలనొప్పి, మొద్దుబారటం, తిమ్మిర్లు, కంటిచూపు సమస్యలు ఏర్పడతాయి.

గుండె - ఈ వ్యాధి వలన గుండెలో పెరికార్డైటిస్, మయోకార్డైటిస్ మరియు ఎండోకార్డైటిస్ సమస్యలు ఏర్పడి దీని వలన అయాసం, నీరసం, మొదలగు లక్షణాలు కనిపిస్తాయి.

జీర్ణకోశ ప్రాంతము - కడుపు నొప్పి, వికారం మరియు వాంతులు కలుగుతాయి.

ఊపిరితిత్తులు - ఈ వ్యాధి బారిన పడితే శ్వాసతీసుకోవడంలో ఇబ్బంది కలుగుతంది.

ఈ వ్యాధి వలన మూత్రపిండాలు శోధమునకు గురి అయితే మూత్రం ద్వారా ప్రొటీన్‌లు మరియు రక్తకణాలు కోల్పోయి శరీర మంతా వాపులు మరియు బరువు పెరగడం వంటి లక్షణాలను గమనించవచ్చు.

తీవ్రమైన అలసట, కీళ్ళలో నొప్పి, ముఖ్యంగా చిన్న కీళ్ళలో నొప్పి మరియు వాపు, వెంట్రుకలు రాలిపోవడం, రక్తహీనత, జ్వరం చర్మంపై ఎర్రని దద్దుర్లు ఏర్పడవచ్చు.

చికిత్స: సాధారణంగా SLE వ్యాధికి అనేక చికిత్స పద్ధతులు ఉన్నప్పటికీ ఏ పద్ధతిలోనూ సంపూర్ణంగా నయం చేసే అవకాశం లేదు, కేవలం హోమియోపతి వైద్య విధానంలో మాత్రమే, మందుల వలన ఎటువంటి అసౌకర్యం, దుష్ఫలితాలు లేని చికిత్స చేయగలిగే అవకాశం ఉంది.

హోమియోకేర్ ఇంటర్‌నేషనల్‌లో మాత్రమే అందించబడే జెనెటిక్ కాన్స్‌టిట్యూషనల్ చికిత్స విధానం ద్వారా అధునాతనమైన నిపుణులచే SLE వ్యాధిని పూర్తిగా అదుపులో ఉంచడమే కాకుండా ఎటువంటి దుష్ఫలితాలు లేని విధంగా చికిత్స అందించే అవకాశం ఉంది.

* శరీర ధర్మం ప్రకారం వ్యక్తిగత ఫలితాలు/ సమయం మారవచ్చు.

హోమియోకేర్ ఇంటర్‌నేషనల్
వరల్డ్-క్లాస్ హోమియోపతి
టోల్ ఫ్రీ 1800 108 1212
ఉచిత కన్సల్టేషన్ 955 000 1199
www.homeocare.in

## చెట్టు నీడ

# ఆ మహనీయుడెవరు?



అది మదీనా నగరం. ఊరి చివర కంటి చూపు లేని, నా అనే ఆసరా లేని ఒక పండు ముదుసలి నివాసం ఉండేది. ఆమె పరిస్థితిని గమనించిన హజ్రత్ ఉమర్ (ర) ఆమె వద్దకు వెళ్లి, ''అమ్మ! నా పేరు ఉమర్ బిన్ ఖత్తాబ్. ప్రతిరోజూ నేను నీ ఇంటి పని, వంట పని చేయాలని కోరిక. నీకేమైనా అభ్యంతరమా?'' అని అడిగాడు

అందుకు ఆ ముసలావిడ, ''అయ్యా! క్షమించాలి. నీ అవసరం నాకు లేదు. ప్రతిరోజూ ఒక వ్యక్తి వచ్చి నా సకల అవసరాలు తీర్చి వెళుతున్నాడు'' అని సమాధానం ఇచ్చింది.

''రేపటి నుంచి నాకు ఆ అవకాశం ఇవ్వు. ఆ వ్యక్తిని రావద్దని చెప్పు''

''అలా నేను చేయలేను'' అని అన్నది ఆ ముసలావిడ.

''ఏం ఎందుకని? నా కన్నా అతను ఎందులో గొప్ప?''

ఆ ముదుసలి చిరునవ్వు నవ్వి – ''నువ్వు రాగానే నేను ఉమర్‌ను అని నీ పేరు చెప్పావు. కాని ఆ మూడేళ్ల నుంచి ఒక్కరోజు నాగా లేకుండా పని చేస్తున్న ఆ బిడ్డ ఇంత వరకు కనీసం తానెవరో కూడా చెప్పలేదంటే అతడు నీ కన్న ఎంత గొప్పవాడో ఆలోచించు'' అంది.

ఆ మహనీయుడు ఎవరో తెలుసుకోవాలని హజ్రత్ ఉమర్ (ర) ఒక రోజంతా కాపు కాసాడు. చీకటి పడ్డాక ఒక వ్యక్తి తన చెప్పులు చేతుల్లో పట్టుకొని చడీ చప్పుడు లేకుండా మెల్లిగా ఆ ముసలావిడ ఇంటి లోకి వెళ్లి గిన్నెలు కడిగి, బట్టలుతికి, అన్నం, కూర వండి బయటికి వచ్చాడు. ఆ వ్యక్తిని చూసి హజ్రత్ ఉమర్ ఆశ్చర్యపోయాడు.ఆయన ఎవరో కాదు సువిశాల ఇస్లామీయ సామ్రాజ్యానికి మొదటి చక్రవర్తి హజ్రత్ అబూబక్ర్ సిద్దీఖ్ (ర).

ఆ చక్రవర్తి విశాల హృదయానికి, సంస్కార వైభవానికి, నిరాడంబరతకు మైమరచి చేతులెత్తి మొక్కాడు ఉమర్.

– అబ్దుల్ బాసిత్

సాక్షి
# ఫ్యామిలీ సినిమా
విజయవాడ ॥ శుక్రవారం
12-7-2019

## డబుల్ ట్రీట్?


● చిరంజీవి

కమ్‌బ్యాక్ చిత్రం 'ఖైదీ నంబర్ 150'లో క్లాస్, మాస్ పాత్రల్లో డబుల్ యాక్షన్ చేశారు చిరంజీవి. ప్రేక్షకులకు అది డబుల్ ట్రీట్‌లా అనిపించింది. ఇప్పుడు మరోసారి చిరంజీవి ద్విపాత్రాభినయం చేయబోతున్నారని తెలిసింది. 'సైరా' తర్వాత కొరటాల శివ దర్శకత్వంలో చిరంజీవి ఓ సినిమా చేయనున్న సంగతి తెలిసిందే. కొణిదెల ప్రొడక్షన్స్, మ్యాట్నీ సంస్థలు ఈ చిత్రాన్ని నిర్మించనున్నాయి. ఈ సినిమాలో చిరంజీవి రెండు పాత్రల్లో కనిపిస్తారని సమాచారం. ఈ డ్యూయల్ రోల్ తండ్రీ కొడుకులా? అన్నదమ్ములా? అనేది తెలియాల్సి ఉంది. ఇందులో చిరంజీవికి జోడీగా ఐశ్వర్యా రాయ్‌ను హీరోయిన్‌గా తీసుకోవాలని చిత్ర బృందం భావిస్తోందట. వచ్చే ఏడాది ఉగాదికి ఈ చిత్రాన్ని రిలీజ్ చేయాలనుకుంటున్నారు.

## కాంబినేషన్ సెట్

'కేజీఎఫ్' ఫేమ్ ప్రశాంత్ నీల్ త్వరలోనే ఓ తెలుగు సినిమా చేయబోతున్నారని, అదీ ఎన్టీఆర్ హీరోగా ఉండబోతోందని ఆ మధ్య పలు వార్తలు వినిపించాయి. అయితే ఈ ఇద్దరి కాంబినేషన్ సెట్ అయిందని తెలిసింది. ఈ విషయాన్ని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాతల్లో ఒకరైన నవీన్ యర్నేని ఓ వీడియో ఇంటర్వ్యూలో తెలిపారు. ఈ ప్రాజెక్ట్ గురించి ఆయన మాట్లాడుతూ – ''కేజీఎఫ్' చిత్రం ఎన్టీఆర్‌కు చాలా నచ్చింది. ఆ దర్శకుడితో సినిమా చేస్తే బావుంటుందనే అభిప్రాయాన్ని మాతో షేర్ చేసుకున్నారు. ప్రస్తుతం 'ఆర్ఆర్ఆర్' సినిమాతో ఎన్టీఆర్, 'కేజీఎఫ్ 2'తో ప్రశాంత్ నీల్ బిజీగా ఉన్నారు. వాళ్ల ప్రాజెక్ట్స్ పూర్తయిన తర్వాత ఈ సినిమా ఉంటుంది. వచ్చే ఏడాది చివర్లో స్టార్ట్ చేయాలనుకుంటున్నాం'' అన్నారు.


● ప్రశాంత్ నీల్


● ఎన్టీఆర్


● అజిత్

## త్రీ డీల్ లేదు

హీరో– ప్రొడ్యూసర్ కాంబినేషన్ వరుసగా రిపీట్ కావాలంటే వరుస హిట్స్ అందించాలి. లేదంటే రెండు, మూడు సినిమాల డీల్ సైన్ చేయాలి. తమిళ స్టార్ హీరో అజిత్, బాలీవుడ్ బడా ప్రొడ్యూసర్ బోనీ కపూర్ 3 సినిమాల డీల్ కుదుర్చుకున్నారని వార్తలు వచ్చాయి. కానీ వాటిలో నిజం లేదని బోనీ కన్‌ఫర్మ్ చేశారు. ''బయట ప్రచారం అవుతున్న వార్తల్లో ఎటువంటి నిజం లేదు. అజిత్‌తో 'నేర్ కొండ పార్వై' సినిమా నిర్మిస్తున్నాను. ఆ తర్వాత ఓ యాక్షన్ ఫిల్మ్ చేయబోతున్నాం. అజిత్‌తో ఓ హిందీ సినిమా చేయించాలనే ఆలోచన నాకుంది. కానీ అజిత్ ఇంకా కన్‌ఫర్మేషన్ ఇవ్వలేదు'' అన్నారు. హిందీ చిత్రం 'పింక్'కి రీమేక్‌గా రూపొందిన 'నేర్‌కొండ పార్వై' ఆగస్టులో రిలీజ్ కానుంది.

## లవ్ డాక్టర్ | నన్నడగొద్దు ప్లీజ్


ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ సార్..! నేనొక అమ్మాయిని వన్ ఇయర్‌గా ప్రేమిస్తున్నాను. తనని ఇప్పటి వరకు ఎవ్వరూ చూడలేదు. లవ్ చెయ్యలేదు. నేనే ఫస్ట్ చూస్తున్నాను. తను ఇప్పుడు టెన్త్ క్లాస్. నేను డిగ్రీ ఫైనల్ ఇయర్. తను కూడా నన్ను మొదట్లో బాగా చూసేది. ఇప్పుడు చూసీ చూడనట్లుగా ఉంటోంది. వాళ్ల ఇంటి దగ్గరకి వెళ్తే చూసీ చూడనట్లే చూస్తోంది. నేను చూడనప్పుడు నన్ను చూస్తోంది. అమ్మాయికి ఎప్పుడు ప్రపోజ్ చెయ్యాలి? ప్రపోజ్ చేస్తే.. తను ఎలా రియాక్ట్ అవుతుంది? కొంచెం సలహా ఇవ్వండి ప్లీజ్.. ప్లీజ్..

– శ్రీకాంత్

చూడాలనుకునే చూపులోని చూపు.. చూడరాని చూపులాంటి చూపని చూసుకుంటే.. అలాంటి చూపు మార్చుకుని, వేరేలాంటి చూపుతో చూస్తే.. ఆ చూపులో చూడకూడని చూపు ఉండదని, నేను చూసినట్లే ఆ అమ్మాయి కూడా చూస్తుందనుకుంటున్నాను కానీ.. ఆ చూపు చూడాల్సిన వయసు ఆ అమ్మాయికి లేదు. చూడు!! అక్కడే నీ చూపు బోల్తాపడుతుంది చూడు!! చూడచక్కని అమ్మాయే అయినా.. అమ్మాయి వయసు ఒక్కసారి చూస్తే.. నీ చూపు బ్యాడ్ చూపని నీకే కనిపిస్తుంది. చూపకూడని చూపు చూపి.. అమ్మాయికి ప్రపోజల్ చూపిస్తే.. మైనర్ అమ్మాయిని అలా చూసినందుకు పోలీసులు నిన్ను చూసుకుంటారు చూడు..!! ఆ చూసుకోవడం గనుక చూడవలసివస్తే.. చావు తప్పి కన్నులొట్టపోయినంత నీ పరిస్థితిని అందరూ చూస్తారు. చూడకన్నా.. ఆ అమ్మాయిని అలా చూడకన్నా ప్లీజ్!!

lovedoctorram@sakshi.com

## వాళ్లంతా కామ్రేడ్సే
– విజయ్ దేవరకొండ

''వచ్చినప్పుడు ఎంతో అందంగా ఉన్న ప్రేమ వెళ్లిపోయేటప్పుడు ఎందుకింత బాధ పెడుతోంది' అంటూ విజయ్ దేవరకొండ చెప్పే డైలాగ్‌తో 'డియర్ కామ్రేడ్' ట్రైలర్ విడుదలైంది. విజయ్ దేవరకొండ, రష్మికా మండన్నా జంటగా భరత్ కమ్మ దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా 'డియర్ కామ్రేడ్'.


● రవిశంకర్, రష్మికా, విజయ్, భరత్, నవీన్, యష్ రంగినేని, చెర్రీ

'ఫైట్ ఫర్ వాట్ యు లవ్' అనేది ఉపశీర్షిక. మైత్రీ మూవీ మేకర్స్, బిగ్ బెన్ సినిమాస్ పతాకాలపై నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్, మోహన్ చెరుకూరి (సి.వి.ఎం), యష్ రంగినేని నిర్మించిన ఈ సినిమా ఈ నెల 26న విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ని హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ మాట్లాడుతూ– ''సినిమా విడుదలవుతుందంటే కొన్ని రోజులుగా నిద్రపట్టడం లేదు. ఈ చిత్రానికి సంబంధించి నేడు బెంగుళూరులో, 13న కొచ్చిలో, 18న చెన్నైలో, 19న హైదరాబాద్‌లో మ్యూజికల్ ఫెస్టివల్ నిర్వహించనున్నాం. మన కష్టసుఖాల్లో తోడుగా ఉండే వ్యక్తుల్ని, స్నేహితులను కామ్రేడ్ అంటాం. నేను ఈ స్థాయిలో ఉండటానికి కారణం ప్రేక్షకుల అభిమానం, ప్రేమ, సపోర్ట్.. వాళ్లంతా కామ్రేడ్సే. అందరూ ఈ మ్యూజికల్ ఫెస్టివల్‌కి రావచ్చు. బెంగుళూరులో జరిగే ఈవెంట్‌కి అతిథిగా వస్తున్న యశ్ ('కేజీఎఫ్' ఫేమ్)కి థ్యాంక్స్'' అన్నారు. ''ఇదొక అందమైన ప్రేమకథ. పది నిమిషాల సన్నివేశాల కోసం మూడు, నాలుగు నెలలు క్రికెట్ నేర్చుకోవాల్సి వచ్చింది. సెట్‌లో నన్ను 20 రోజులపాటు ఏడిపించారు. డబ్బింగ్ చెప్పడానికి నాలుగు నెలలు పట్టింది'' అన్నారు రష్మికా మండన్నా. ''ఇదొక లాంగ్ జర్నీ. మూడేళ్లుగా దీనిపై వర్క్ చేస్తున్నాం. సినిమా బాగా వచ్చింది. నేను మాట్లాడటం కంటే సినిమానే మాట్లాడుతుందనుకుంటున్నా'' అన్నారు భరత్ కమ్మ. ''ఈ సినిమా ద్వారా ఓ కొత్త విజయ్‌ని చూస్తారు'' అన్నారు యష్ రంగినేని. ''ఈ నెల 22న వైజాగ్‌లో ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించనున్నాం'' అన్నారు నవీన్ ఎర్నేని. నిర్మాత రవిశంకర్, చెర్రీ తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: వై.అనిల్, సంగీతం: జస్టిన్ ప్రభాకరన్, కెమెరా: సుజిత్ సారంగ్.

## కోడి ముందా? గుడ్డు ముందా?


● శ్రుతీహాసన్

ఈ సామెత తెలియనివాళ్లు ఉండరు. దీనికి సమాధానం తెలిసిన వాళ్లూ ఉండరు. ఇప్పుడు శ్రుతీహాసన్ కూడా తన జీవితానికి ఈ సామెతను ఆపాదించారు. సినిమాలంటే మీకు చిన్నప్పుడే ఇష్టం ఏర్పడిందా? లేక మీ అమ్మానాన్న (కమల్‌హాసన్, సారిక), ఇంకా ఇతర కుటుంబ సభ్యులు సినిమాల్లో ఉన్నందువల్ల మీరూ వచ్చేశారా? అనే ప్రశ్న శ్రుతీహాసన్ ముందుంచితే– ''కోడి ముందా? గుడ్డు ముందా? అంటే ఏం చెబుతాం. ఇది కూడా అంతే. నేను సినిమా వాతావరణంలోనే పెరిగాను. అయితే మీ ఫస్ట్ చాయిస్ ఏంటి? అని అడిగితే, 'సంగీతం' అంటాను. అయితే నన్ను సినిమానే సెలక్ట్ చేసుకుంది. ఎందుకంటే అది నా డెస్టినీ అని నా ఫీలింగ్. చిన్నప్పుడు స్కూల్ నుంచి రాగానే మా నాన్నగారు యాక్ట్ చేస్తున్న సినిమా షూటింగ్ లొకేషన్‌కి వెళ్లేదాన్ని. జనరేటర్ వ్యాన్ దగ్గర కూర్చుని హోమ్‌వర్క్ రాసేదాన్ని. ప్రొడక్షన్‌లో ఉన్నవాళ్లంతా నన్ను గారం చేసేవారు. అందుకే చికెన్ అండ్ ఎగ్ ఎగ్జాంపుల్ చెప్పా. నాకు సినిమా మీదనంతట అదే ప్రేమ పెరిగిందో, సినిమా పరిశ్రమ పిలిచింది కాబట్టి వచ్చానో తెలియడంలేదు. అయితే ఒకటి మాత్రం నిజం. నా జీవితాన్ని సినిమా నుంచి వేరుచేసి చూడలేను'' అన్నారు. ఇదిలా ఉంటే.. ఓ అభిమాని ఇటీవల శ్రుతీహాసన్ని కలిశాడు. అభిమాన తారను కలిసినందుకు బోలెడంత ఆనందాన్ని వ్యక్తం చేసి, 'మీ పెళ్లెప్పుడు? విందుకి వస్తాను' అని ట్వీటర్ ద్వారా శ్రుతీని అడిగాడు. ''పెళ్లి విందు అంటే ఇంకా చాలా టైమ్ ఉంది. నా బర్త్‌డే విందుకి వద్దువుగానిలే'' అని సరదాగా సమాధానం ఇచ్చారామె. బాయ్‌ఫ్రెండ్ మైఖేల్ కోర్సలే నుంచి విడిపోయిన శ్రుతి ఇప్పట్లో పెళ్లి చేసుకోవాలనుకోవడం లేదని అభిమానికి ఆమె ఇచ్చిన సమాధానం స్పష్టం చేస్తోంది కదూ.


● సిడ్ శ్రీరామ్

## ట్యూన్ కడుతున్నారు

సిడ్ శ్రీరామ్ 'ఇంకేం ఇంకేం కావాలే..' అని పాడితే, ప్రేక్షకులు పదే పదే పాట విన్నారు. ఆ తర్వాత 'మాటే వినదుగ వినదుగ' అని పాడితే అదీ విన్నారు. ఈ మధ్యకాలంలో పాటలతో సెన్సేషన్ క్రియేట్ చేశారు సింగర్ సిడ్ శ్రీరామ్. ఇప్పుడు ఈ పాటగాడు కాస్తా కంపోజర్ అయ్యారు. మణిరత్నం 'కడల్' సినిమాతో సింగర్‌గా మారిన సిడ్ ఇప్పుడు మణిరత్నం నిర్మాణంలో తెరకెక్కబోయే సినిమా ద్వారానే సంగీత దర్శకుడిగా మారనున్నారు. విక్రమ్ ప్రభు, ఐశ్వర్యా రాజేశ్ జంటగా ధన దర్శకత్వంలో మణిరత్నం నిర్మించనున్న చిత్రం 'వానమ్ కొట్టట్టుమ్'. ఈ సినిమా ద్వారా సంగీత దర్శకుడిగా పరిచయం కానున్నారు సిడ్ శ్రీరామ్. తొలుత ఈ సినిమాకు '96' ఫేమ్ గోవింద్ వసంత సంగీత దర్శకుడు. డేట్స్ క్లాష్ కావడంతో సిడ్ శ్రీరామ్ ట్యూన్స్ అందించడానికి రెడీ అయ్యారు.


● కేవీఆర్ మహేంద్ర

## నాపై నాకు నమ్మకం పెరిగింది

''నిశీధి' అనే షార్ట్ ఫిల్మ్ తర్వాత మూడేళ్లు ఏ పనీ చేయకుండా 'దొరసాని' కథ రాశాను. దాదాపు 42 వెర్షన్స్ రాశాను. ఈ స్టోరీ వరల్డ్‌ను అర్థం చేసుకోవడానికి, బుక్స్ చదవడానికి దాదాపు ఎనిమిది నెలలు పట్టింది. కథకు ఉన్న బలం వల్లే నేడు 'దొరసాని' సినిమా విడుదలవుతోంది'' అని దర్శకుడు కె.వి.ఆర్. మహేంద్ర అన్నారు. ఆనంద్ దేవరకొండ, శివాత్మిక జంటగా 'మధుర' శ్రీధర్ రెడ్డి, యష్ రంగినేని నిర్మించిన 'దొరసాని' సురేష్ ప్రొడక్షన్స్ సమర్పణలో నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా కె.వి.ఆర్. మహేంద్ర మాట్లాడుతూ– ''మాది వరంగల్ జిల్లాలోని జయగిరి. అందరిలాగే ఎన్నో సినిమా కష్టాలు పడ్డాను. నేను చేసిన 'నిశీధి' షార్ట్ ఫిల్మ్ చూసి, నా దర్శకత్వాన్ని ప్రశంసిస్తూ ప్రముఖ దర్శకులు శ్యామ్ బెనెగల్‌గారు నాకు మెయిల్ చేశారు. దాంతో నా మీద నాకు నమ్మకం పెరిగింది. కొత్తగా చేయాలనే ఉద్దేశంతో ఇలా 'దొరసాని' సినిమాతో మీ ముందుకు వచ్చాను. రెండు గంటల పదిహేను నిమిషాలు మా సినిమాతో ప్రేక్షకులను ఓ కొత్త ప్రపంచంలోకి తీసుకెళతాం. ఆ రోజుల్లో దొర వ్యవస్థ, పరిస్థితులకు ఓ అందమైన ప్రేమకథని జోడించాం. కథ, కథలోని స్వచ్ఛత, నిజాయతీ అందరికీ నచ్చుతుంది. రాజు పాత్రకి ఆనంద్, దొరసాని పాత్రకి శివాత్మిక చక్కగా సరిపోయారు. శివాత్మికలో నిజంగానే దొరసాని ఉంది. 'నీ తర్వాతి సినిమా నాతోనే చెయ్యాలి' అని రాజశేఖర్‌గారు ఇప్పటికే చాలా సార్లు నవ్వుతూ అడిగారు. 'ఓ కథ ఉంటే చెప్పు' అని విజయ్ దేవరకొండగారు కూడా అడిగారు. 'దొరసాని' రిలీజ్ అయ్యాక నా తర్వాతి సినిమా డిసైడ్ అవుతుంది'' అన్నారు.

## రెండు కుటుంబాల మధ్య మిస్ మ్యాచ్


● ఉదయ్‌శంకర్, వెంకటేశ్

ఎల్.ఎల్.పి పతాకంపై జి.శ్రీరామ్ రాజు, భరత్ రామ్ నిర్మించిన ఈ చిత్రం టీజర్‌ను వెంకటేష్ విడుదల చేశారు. ఉదయ్ శంకర్ మాట్లాడుతూ– ''నా మొదటి సినిమా 'ఆటకదరా శివ'కు వెంకటేష్‌గారు చాలా సహకారం అందించారు. ఇప్పుడు 'మిస్ మ్యాచ్' టీజర్ ఆయన చేతుల మీదగా విడుదలవడం సంతోషంగా ఉంది. భూపతిరాజాగారు ఇచ్చిన కథను దర్శకుడు బాగా తీశారు'' అన్నారు.

''మిస్ మ్యాచ్' టీజర్ ఆసక్తిగా ఉంది. కుటుంబ ప్రేక్షకులందరూ కలిసి చూడదగ్గ సినిమా అవుతుందని భావిస్తున్నాను. ఉదయ్ శంకర్‌కు నటుడిగా మంచి భవిష్యత్ ఉంది. కథ అందించిన భూపతి రాజాగారికి, డైరెక్టర్, నిర్మాతలకు బెస్ట్ ఆఫ్ లక్'' అని హీరో వెంకటేష్ అన్నారు. ఉదయ్ శంకర్, ఐశ్వర్యా రాజేష్ జంటగా తమిళ చిత్రం 'సలీం' ఫేమ్ ఎన్.వి. నిర్మల్ కుమార్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'మిస్ మ్యాచ్'. అధిరోహ్ క్రియేటివ్ సైన్స్ ''ఈ చిత్రం అన్నివర్గాల ప్రేక్షకులకు నచ్చుతుందని భావిస్తున్నా'' అన్నారు ఎన్.వి.నిర్మల్. ''ప్రేక్షకులు కోరుకునే అంశాలన్నీ మా సినిమాలో ఉంటాయి. సినిమా బాగా వచ్చింది'' అన్నారు శ్రీరామ్. ''రెండు కుటుంబాల మధ్య జరిగే కథే 'మిస్ మ్యాచ్'' అన్నారు రచయిత భూపతిరాజా. ఈ చిత్రానికి సంగీతం: గిఫ్టన్ ఇలియాస్, కెమెరా: గణేష్ చంద్ర.

## ఆర్ఎక్స్100లా పెద్ద హిట్ కావాలి
– 'దిల్' రాజు


● అర్జున్, 'దిల్' రాజు, కార్తికేయ, అనిల్, ప్రవీణ

''కమల్ హాసన్‌గారి 'గుణ', బాలకృష్ణగారి 'ఆదిత్య 369' సినిమాల టైటిల్స్‌లో సగం సగం కలిపి చక్కగా కథకు తగ్గట్టు 'గుణ 369' టైటిల్ కుదిరింది'' అని 'దిల్' రాజు అన్నారు. 'ఆర్ఎక్స్ 100' ఫేమ్ కార్తికేయ, అనఘ జంటగా నటించిన చిత్రం 'గుణ 369'. అర్జున్ జంధ్యాల దర్శకత్వంలో అనిల్ కడియాల, తిరుమల రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమాలోని తొలిపాట 'తొలి పరిచయమా.. తొలి పరవశమా ఇది' ను నిర్మాత 'దిల్' రాజు రిలీజ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ – ''తొలి పరిచయమా...' ఫీల్ గుడ్ సాంగ్‌లా ఉంది. ఈ సినిమా 'ఆర్ఎక్స్ 100'లా పెద్ద హిట్ కావాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ''ఇదేదో వండి వార్చిన కథ కాదు. నిజంగా జరిగిన కథ. రియలిస్టిక్‌గా ఉంటుంది. ఇంతకు ముందు సిల్వర్‌స్క్రీన్ మీద ఇలాంటి కథ రాలేదు'' అన్నారు అర్జున్ జంధ్యాల. ''గోల్డెన్ హ్యాండ్ 'దిల్' రాజుగారితో బోణీ కొట్టినందుకు మా ఆల్బమ్‌కు తిరుగుండదని నమ్మకంగా ఉన్నాం. భరద్వాజ్ కంపోజిషన్, విశ్వనాథ్ సాహిత్యం, హరిహరన్‌గారి గాత్రం సంగీత ప్రియులను ఆకట్టుకునేలా ఉన్నాయి'' అన్నారు నిర్మాతలు. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: సత్య కిశోర్, శివ మల్లాల.






ఫ్యాషన్



# బంగార్వాం

మనకు బంగారం గురించి తెలుసు.
మరి, బంగ్వారం అంటే..
బంగారాన్ని మించి ఘనంగా ఉండేది.
క్లాత్‌తో జత చేసి
కలర్‌ఫుల్‌గా వెలిగేది.

నిర్వహణ:
నిర్మలారెడ్డి

- సిల్క్ అంటే పట్టు క్లాత్ తీసుకొని, హారానికి కావల్సిన పరిమాణంలో రిబ్బన్‌లా వచ్చేలా కట్‌చేసుకోవాలి. దానికి అందమైన పెండెంట్స్, పూసలు కుట్టాలి. పల్చటి అద్దాల్లాంటివైతే గమ్‌తో అతికించవచ్చు.
- హారం పొడవుగా ఉండాలా, మెడకు పట్టీలా ఉండాలా.. అలాగే వెడల్పు విషయంలో అవగాహన తెచ్చుకొని ఆ ప్రకారం డిజైన్ తీసుకోవాలి. ఆ తర్వాత హారానికి టెంపుల్ జువెల్రీని జత చేసుకోవాలి. క్లాత్ రంగు దారంతోనే పెండెంట్స్, పూసలు కుట్టాలి.
- వీటికోసం భారీగా ఖర్చుపెట్టాల్సిన అవసరం లేదు. ఒన్‌గ్రామ్, ఇమిటేషన్ జువెల్రీని కూడా ఇందుకు ఎంచుకోవచ్చు. తక్కువ పెండెంట్స్‌తో హారాలు కలర్‌ఫుల్‌గానూ, రిచ్‌గానూ కనిపిస్తాయి.
- ఈ హారాలు సంప్రదాయ చీరకట్టుకే కాదు ఫ్యాషన్ వేర్‌కీ ఈ ఫ్యాషన్ జువెల్రీ మరింత సొబగులను తీసుకు వస్తుంది.
- జూట్ (నార) పట్టీలను కూడా ఇందుకు ఉపయోగించుకోవచ్చు. వరుసలుగా తయారుచేసుకొని లేయర్డ్ హారాలుగా ధరించవచ్చు. వేడుకలో హైలైట్ కావచ్చు.
- టెంపుల్ జువెల్రీనే కాదు బొహో స్టైల్‌లో బంజారాలు ధరించేటటువంటి సిల్వర్ జువెల్రీని కూడా ఈ హారాల తయారీలో వాడచ్చు. అందుకు ఈ జూట్ హారమే సిసలైన ఉదాహరణ.
- కొనుగోలు చేయాలంటే ఇవి పెండెంట్స్‌ను బట్టి వెయ్యి రూపాయల నుంచి ధరలు ఉన్నాయి. మీకు మీరుగా తయారు చేసుకుంటే తక్కువ పెండెంట్స్‌తోనూ అందమైన హారాలను తయారు చేసుకోవచ్చు. అందుకు మీ ఆలోచనకు మరికాస్త సృజనను జత చేయడమే.

స్త్రీ శక్తి

## భయ్యా కాదు... దబాంగ్ లేడీ

జీవితాంతం తోడుగా ఉంటానని బాస చేసిన భర్త అర్ధంతరంగా వదిలేయడంతో తనపై ఆధారపడిన ముగ్గురు బిడ్డల ఆకలి తీర్చడానికి ఓ అబల, ఆటో నడుపుతూ.. బతుకు బండిని లాక్కొస్తోంది. ఆ మహిళా ఆటోడ్రైవర్ కథ ఆమె మాటల్లోనే...

‘నా పేరు షిరీన్. నేను ఓ సంప్రదాయ, పేద ముస్లిం కుటుంబంలో జన్మించాను. చిన్నప్పటినుంచి వాళ్లెప్పుడూ తగవులాడుకునేవారు. నాకు 11 ఏళ్ల వచ్చేసరికి మా అమ్మానాన్న విడాకులు తీసుకున్నారు. అయితే మా అమ్మ చాలా ధైర్యవంతురాలు. అందుకే విడాకులు తీసుకున్న కొద్దిరోజులకే పునర్వివాహం చేసుకున్నారు. కానీ ఈ విషయాన్ని సమాజం అంత తేలికగా తీసుకోలేకపోయింది. ఓ రోజు మా అమ్మ నా సోదరుడితో కలిసి బయటకు వెళ్లింది. అప్పుడు కొందరు మగవారు మా అమ్మ దగ్గరకు వచ్చి ఆమెను దారుణంగా తిడుతూ, రెండోపెళ్లి చేసుకున్నందుకు ఆమెను వ్యక్తిత్వాన్ని కించపరిచారు. నా సోదరుడిని కూడా అవమానించారు. దాంతో అదే రోజు రాత్రి మా అమ్మ తన ఒంటికి నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకుంది.

మా అమ్మను కోల్పోవడం నా జీవితంలో అన్నింటికంటే పెద్ద విషాదం. దానినుంచి బయట పడేలోపే మా నాన్న నాకు, నా సోదరికి వివాహం జరిపించాడు. నా సోదరి గర్భవతిగా ఉండగా.. ఆమె అత్తింటి వారు విషం ఇచ్చి తనను చంపేశారు. ఇది నా జీవితంలో మరో పెద్ద షాక్. నా జీవితం అంధకారంగా మారి



నట్లు అనిపించింది. జీవితం మీద ఆశలు కోల్పోయాను. అయితే అప్పుడే నేను గర్భవతిని అని తెలిసింది. నాకొక కొడుకు జన్మించాడు. వాడి కోసమైనా బతకక తప్పని పరిస్థితి. ఈ లోపు నా సంసార జీవితంలో సమస్యలు మొదలయ్యాయి. మూడో బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత నా భర్త మా గురించి పట్టించుకోవడం పూర్తిగా మానేశాడు. అతనికి కేవలం నా శరీరంతో మాత్రమే పని. ఒకరోజు పడకగదిలో తన అవసరం తీరాక తలాక్ అంటూ మూడుసార్లు చెప్పి నాకు విడాకులు ఇచ్చాడు.

**తొలుత బిర్యానీ సెంటర్..**

‘అలా ముగ్గురు బిడ్డలతో రోడ్డుమీద పడ్డాను. ఆ సమయంలో నా పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించండి. ఆదరించే వారు లేరు. ముగ్గురు బిడ్డల ఆకలి తీర్చాలి. దాంతో నాకు నేనే ధైర్యం చెప్పుకున్నాను. బిడ్డల ఆకలి తీర్చడమే నా ముందున్న అతిపెద్ద సవాలు. అందుకోసం ఓ చిన్న బిర్యానీసెంటర్ ప్రారంభించాను. అది బాగా పుంజుకుంటున్న సమయంలో బీఎంసీ అధికారులు అనుమతులు లేవంటూ దాన్ని కూలదోశారు. మరోసారి రోడ్డున పడ్డాను. ఏం చేయాలి అని ఆలోచిస్తుండగా ఆటో రిక్షా నా కళ్ల ముందు కదలాడింది. నా భర్త ఆటో నడిపేవాడు. పిల్లల కడుపు నింపడం కోసం నేను కూడా ఆటో నడపాలని భావించాను. దాంతో నేను దాచుకున్న సొమ్ముతో ఓ ఆటో కొన్నాను. ప్రస్తుతం ఆటో నడుపుతూ నా పిల్లలను పోషిస్తున్నాను. తద్వారా బాగానే సంపాదిస్తున్నాను. నా పిల్లలకు కావాల్సినవి సమకూర్చుతున్నాను. కానీ అవమానాలు మాత్రం తప్పడం లేదు. మహిళను కావడంతో జనాలు నన్ను చులకనగా చేసి చూడటం, అవమానించడం వంటివి చేస్తుంటారు. ఇతర ఆటో డ్రైవర్లు కూడా నన్ను అణగదొక్కాలని చూస్తున్నారు. కానీ వీటన్నింటిని తట్టుకుంటూనే.. ఏడాది కాలంగా ఆటో నడుపుతున్నాను. ఆ సంపాదనతోనే ఇల్లు నడిపిస్తున్నాను. అయితే అవమానాలే కాదు.. నా ఆటోలో ప్రయాణించే ప్రయాణికుల్లో కొందరు నన్ను చాలా పొగుడుతుంటారు. చప్పట్లతో నన్ను అభినందిస్తూ.. టిప్పు కూడా ఇస్తారు’ అన్నారు.

**గర్వంగా అనిపించింది!**

‘ఓ సారి ఓ గమ్మత్తయిన సంఘటన జరిగింది. ఓ వ్యక్తి నా ఆటో ఎక్కాడు. నన్ను పురుషుడిగా భావించి.. భయ్యా అని పిలిచాడు. కానీ నేను మహిళనని తెలిసిన తర్వాత నన్ను ‘దబాంగ్ లేడీ’ అని పిలిచాడు. నాకు ఎంతో గర్వంగా అనిపించింది.

నేను ఇదంతా ఎందుకు చెప్తున్నానంటే.. మహిళలు తల్చుకుంటే ఏదైనా చేయగలరు. ఎవరో పెట్టిన నియమాలకు లోబడి స్త్రీ జీవించాల్సిన అవసరం లేదు. నా చెల్లి, తల్లిలా మరో మహిళ బాధపడకూడదనేది నా కోరిక. ఇదంతా నేను కేవలం నా కోసం మాత్రమే చెప్పడం లేదు.. నిశ్శబ్దంగా బాధను భరిస్తున్న ప్రతి మహిళకు ధైర్యం చెప్పడం కోసమే నా కథను చెప్పుకొచ్చాను’ అన్నారు షిరీన్.

భర్త నిరాదరణకు గురై ఏ ఆధారమూ లేదని కుమిలిపోయేవారికి షిరీన్ కథ స్ఫూర్తిదాయకమే.

– **పిల్లి ధరణి**, సాక్షి వెబ్ డెస్క్

పరి పరిశోధన

## ప్లాస్టిక్ ఇల్లు



ప్లాస్టిక్ చెత్తను వదిలించుకునేందుకు ప్రపంచవ్యాప్తంగా బోలెడన్ని ప్రయత్నాలు జరుగుతున్నాయి కదా.. చిత్రంలో కనిపిస్తున్నది అలాంటి ఓ ప్రయత్నం తాలూకూ ఫలితమే. స్పష్టంగా చెప్పాలంటే దాదాపు ఆరు లక్షల ప్లాస్టిక్‌బాటిళ్లను ఉపయోగించుకుని కట్టిన ఇల్లు. ఇది. అలాగని దృఢంగా ఉండదని అనుకుంటారమో... భారీ స్థాయి తుపాన్లను కూడా తట్టుకునేలా రూపొందించారు దీన్ని. వివరాల్లోకి వెళదాం. కెనెడాలో జేడీ కాంపోజిట్స్ అని ఓ నిర్మాణ కంపెనీ ఉంది. నోవా స్కాటియా అనే ప్రాంతంలో వీరు ఈ వినూత్నమైన ఇంటిని నిర్మించారు. సుమారు ఆరు లక్షల పన్నెండు వేల పెట్ బాటిళ్లను కరిగించి చిన్న చిన్న గుళికలుగా మార్చడంతో ఈ ఇంటి నిర్మాణం ప్రారంభమైంది. ఆర్మాసెల్ అనే కంపెనీ ఈ ప్రక్రియను చేపట్టింది. గుళికలన్నింటినీ ప్రత్యేకమైన ప్రక్రియ ద్వారా ప్రీఫ్యాబ్రికేటెడ్ గోడలుగా మార్చారు. ఆ తరువాత వాటిని డిజైన్ ప్రకారం అమర్చడంతో ఇల్లు రెడీ అయింది. ఒక బెడ్‌రూమ్, రెండు బాత్‌రూమ్‌లు, ఆధునిక వంటగదితోపాటు పైకప్పుపై బీబీక్యూ రూమ్ కూడా ఉన్న ఈ ఇంటి పేరు బీచ్‌హౌస్. ఇందులో వాడిన ప్యానెళ్లను పరీక్షించినప్పుడు అవి గంటకు 324 కిలోమీటర్ల వేగంతో వీచే గాలులను కూడా తట్టుకుని నిలబడుతుందని తేలింది. కాలంతోపాటు ఇంటిలో ఏవైనా మార్పులు వస్తాయా? దృఢత్వం దెబ్బతింటుందా? అన్న విషయాలను ప్రస్తుతం పరీక్షిస్తున్నారు. అన్నీ సక్రమంగా ఉంటే సమీప భవిష్యత్తులోనే ఈ సరికొత్త ప్లాస్టిక్ భవన టెక్నాలజీని వేర్వేరు రంగాల్లో వాడుకునేందుకు మార్గం సుగమం అవుతుంది.

## సౌరశక్తి ప్లాంట్‌లలో అబూదాబి రికార్డు!



వాతావరణ మార్పుల ప్రభావం నుంచి తప్పించుకునేందుకు ప్రపంచవ్యాప్తంగా సౌరశక్తి లాంటి ప్రత్యామ్నాయ ఇంధన వనరులను ఏర్పాటు చేసుకోవడం ఎక్కువ అవుతున్న విషయం మనందరికీ తెలుసు. అయితే ఈ పరిణామం కాస్తా గల్ఫ్ దేశాల్లో ఒకరకమైన పోటీకి కూడా దారితీస్తోంది. ఈ క్రమంలో అబూదాబి ప్రపంచంలోనే అతిపెద్ద సోలార్ ప్లాంట్ నిర్మాణాన్ని పూర్తి చేసింది. నూర్ అబూదాబీ అని పిలుస్తున్న ఈ సోలార్ ఫామ్‌లో ఏకంగా 1.177 గిగా వాట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. దుబాయిలోని మహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తూమ్ సోలార్ పార్కులో సామర్థ్యం ఒక గిగావాట్ కంటే ఇది కొంచెం ఎక్కువన్నమాట. నూర్ అబూదాబీని స్థానిక ప్రభుత్వంతోపాటు జపాన్‌కు చెందిన మారుబెని కార్పొరేషన్, చైనాకు చెందిన జింకో సోలార్ హోల్డింగ్‌లు సంయుక్తంగా నిర్మించాయి. మొత్తం ఎనిమిది చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో సుమారు 32 లక్షల సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేశారు. దేశంలోని సహజవాయువు నిక్షేపాలను మరింత కాలం వాడుకునేందుకు వీలుగా తాము ఈ ప్రాజెక్టును చేపట్టినట్లు ప్రభుత్వం చెబుతోంది. సుమారు రెండు లక్షల పెట్రోలు, డీజిల్ కార్ల నుంచివ ఎలువడే కాలుష్యాన్ని ఈ పోలార్ ప్లాంట్ ద్వారా వాతావరణంలో కలవకుండా అడ్డుకోవచ్చునని చెబుతోంది.

పిల్లోడి కోసం...

## మ్యావ్ మ్యావ్... ఏమైపోయావ్!

రక్తసంబంధీకులు దూరమైతేనే వారం... పది రోజుల పాటు బాధపడి యధావిధిగా రోజువారీ పనుల్లో నిమగ్నమవుతున్న ఈ సమాజంలో ఓ జంట, తాము కొద్దికాలంగా పెంచుకుంటున్న పిల్లి కనిపించకుండా పోయేసరికి దానికోసం పడుతున్న తపన చూపరులను తమవైపునకు తిప్పుకుంటోంది. ఏడాది పాటు తమ కుటుంబంలో ఓ సభ్యునిగా భావించి పెంచుకున్న పిల్లి కోసం ఊరుగాని ఊరిలో, భాష తెలియని ప్రాంతంలో... ఒకటి కాదు... రెండు కాదు... ఏకంగా నెల రోజులకు పైగా కళ్లలో ఒత్తులేసుకుని వెతుకుతున్నారు.

**నేపథ్యమిదీ...** గుజరాత్ రాష్ట్రం సూరత్ నగరానికి చెందిన జయేష్, మీన దంపతులు నగరంలో హోల్‌సేల్ దుస్తులవ్యాపారం, మొబైల్‌షాపులతో హాయిగానే జీవిస్తున్నారు. అయితే వివాహమై పదేళ్లు గడుస్తున్నా పిల్లలు కలగలేదన్న వెలితి వారిని బాధించేది. ఏడాది కిందట ఓ పిల్లి పిల్ల



వారింటికి చేరుకుంది. జయేష్, మీన దంపతులు ఆ పిల్లిని తమకు దేవుడు పంపిన బిడ్డగా భావించి కంటికిరెప్పలా పెంచుకున్నారు. చూస్తుండగానే వారికి ఆ పిల్లితో తెలియని బంధం ఏర్పడింది. అది పిల్లి కాదు.. పిల్లోడే అనుకునేంతగా వారి బంధం దృఢ పడింది.

**వెంకన్న దర్శనం కోసం వచ్చి...**

తిరుమల వెంకన్న దర్శనార్థం జయేష్, మీన దంపతులు ఇటీవల సూరత్ నుంచి పిల్లిని ప్రత్యేకంగా ఓ బుట్టలో పెట్టుకుని వెంట తెచ్చుకున్నారు. తిరుమలకు గత నెల 9న చేరుకున్నారు. నాలుగు రోజులపాటు శ్రీ వారి సన్నిధిలో గడిపిన తర్వాత తిరుగు పయనమై గతనెల 12న రాత్రి రేణిగుంట రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడ నుంచి ముంబైకు వెళ్లి మరో రైలెక్కి స్వస్థలం చేరాలన్న ఆలోచనతో స్టేషన్లో రైలుకోసం వేచి ఉన్నారు. పిల్లితో ఆడుకుంటూనే నిద్రలోకి జారుకున్నారు. కాసేపటి తర్వాత మెలకువ వచ్చి చూడటంతో ఒడిలో నిద్రిస్తున్న పిల్లి కనిపించలేదు. దాంతో తీవ్ర ఆందోళనకు గురయ్యారు. పిల్లితో చివరిసారిగా తిరుమల కొండపై దిగిన ఫోటోఫ్రేమ్‌ను చూపుతూ స్టేషన్ ప్రాంగణమంతా వెతికారు. పిల్లి ఆచూకీ లభించకపోవడంతో పిల్లి ఆచూకీ దొరికే వరకు ఈ ప్రాంతాన్ని వదిలి ఇంటికి వెళ్లకూడదని నిర్ణయించుకున్నారు. రేణిగుంట, తిరుపతి, తిరుమల, శ్రీకాళహస్తి, కోడూరు, గూడూరు, నెల్లూరు, కస్మూరు దర్గా.. ఇలా అన్ని చోట్లకు వెళ్లి వెతుకుతూనే ఉన్నారు. నెలరోజులు దాటినా పిల్లి ఆచూకీ తెలియలేదు.. ప్రాణసమానమైన పిల్లి జాడను దేవుడే చూపుతాడన్న విశ్వాసంతో పిల్లిని దొరకబుచ్చుకోవడమే లక్ష్యంగా కనిపించిన ప్రతి ఒక్కరినీ పిల్లి కోసం ఆరా తీస్తున్నారు. వీరి అన్వేషణ ఫలించాలని కోరుకుందాం.



**పిల్లి రూపురేఖలివీ...**

‘ఫెలిసియో’ సంతతికి చెందిన ఈ అరుదైన పిల్లి సుమారు 3.5 నుంచి 4 కిలోల బరువుంటుంది. 14 నెలల వయస్సు కలిగిన ఈ పిల్లి 10 అంగుళాలు ఎత్తు ఉండి, తెలుపు, ఊదా రంగులతో నిలువు చారలు కలిగి ఉంటుంది.

– **చింత మునిశేఖర్**, సాక్షి, రేణిగుంట
ఫొటోలు: **షేక్ మహ్మద్ రఫి**

సాక్షి స్పోర్ట్స్
శుక్రవారం
12-7-2019



# ప్రపంచకప్‌లో ప్లే ఆఫ్స్ ఉండాలి!

## ఐసీసీకి టీమిండియా కెప్టెన్ కోహ్లి సూచన

**మాంచెస్టర్:** ఫేవరెట్‌గా బరిలో దిగి, లీగ్ దశలో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచి, సెమీఫైనల్లో అనూహ్య పరాజయం పాలై ప్రపంచ కప్ నుంచి నిష్క్రమించిన నేపథ్యంలో టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లి అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ)కి ఓ సూచన చేశాడు. మెగా టోర్నీ ఆసాంతం మంచి ఆటతీరు కనబర్చినా, కలిసిరాని ఒక్క రోజు కారణంగా బయటకు వెళ్లిపోయే పరిస్థితి తలెత్తకుండా... ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) తరహాలో ప్రపంచ కప్ నాకౌట్ దశలో ప్లే ఆఫ్ మ్యాచ్‌లు నిర్వహించే దిశగా ఆలోచించాలని అతడు కోరాడు.

బుధవారం మ్యాచ్ అనంతరం మీడియా సమావేశంలో ప్లే ఆఫ్స్‌పై అడిగిన ప్రశ్నకు కోహ్లి స్పందిస్తూ... 'ఇది పరిశీలించదగ్గ అంశమే. భవిష్యత్‌లో ఏం జరుగుతుందో ఎవరు చెప్పగలరు? ఏమో ఉండొచ్చేమో? మాకెదురైన అనుభవంతో వాటి గురించి ఆలోచిస్తారేమో? ఎప్పుడు అమలు చేస్తారో?' అని సమాధానమిచ్చాడు. ఇలా అంటూనే... ఆటలోని భిన్నమైన మజాను చాటే సెమీఫైనల్ ఫార్మాట్‌ను సవాలుతో కూడినదిగా, ప్రత్యేకమైనదిగా కోహ్లి పేర్కొన్నాడు.

### జడేజా గురించి ఇంకేం మాట్లాడలేం

సెమీస్‌లో ప్రదర్శనతో ఆల్‌రౌండర్ జడేజాను ఇకపై తమతో సహా ఎవరూ నిందించలేరని కోహ్లి అన్నాడు. 'పదేళ్లుగా జడేజాతో కలిసి ఆడుతున్నా. నేను చూసిన ఎడమచేతివాటం బ్యాట్స్‌మన్ ఇన్నింగ్స్‌ల్లో జడేజాదే అత్యుత్తమం. ఓటమి ఖరారైన దశలో తీవ్రఒత్తిడిలో అతను ఆడిన తీరుతో మాకు మ్యాచ్‌పై ఆశలు రేగాయి. అతడు ఔటైన షాట్‌ను తప్పు పట్టడానికి ఏమీ లేదు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌లో జట్టుకు ఉపయోగపడే వెలకట్టలేని ఆటగాడు' అని కొనియాడాడు.

### పంత్‌లాగే నేనూ తప్పులు చేశా

సెమీస్‌లో అనవసర షాట్‌కు ఔటైన పంత్‌ను కోహ్లి వెనకేసుకొచ్చాడు. 'అతడింకా కుర్రాడు. ఆ వయసులో నేనూ ఎన్నో తప్పులు చేశా. పంత్ తాను చేసిందేమిటో తెలుసుకుంటాడు. పొరపాట్ల నుంచి పాఠాలు నేర్చుకుని రాటుదేలతాడు' అని వివరించాడు. కొన్ని షాట్లు అసంతృప్తికి గురిచేసినా ఆటలో అవి సహజమని, మ్యాచ్ ఫలితం తమను వ్యక్తిగతంగా తీవ్రంగా బాధ పెట్టినట్లు కోహ్లి పేర్కొన్నాడు. అయినా దేశానికి ఆడినందుకు కుర్రాళ్లంతా గర్విస్తున్నట్లు తెలిపాడు.

## రోహిత్, కోహ్లిలే గెలిపించలేరు!

### సచిన్ విమర్శ

**మాంచెస్టర్:** సెమీస్ ఫలితంతో నిరుత్సాహం చెందానని క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ అన్నాడు. 240 కచ్చితంగా ఛేదించగలిగే లక్ష్యమేనని, అయితే భారత టాపార్డర్‌ను దెబ్బకొట్టి కివీస్ విజయం సాధించిందని పేర్కొన్నాడు. 'అన్నిసార్లు రోహిత్ శుభారంభం ఇవ్వాలని, కోహ్లి రాణించాలని, ధోని ముగింపునివ్వాలని కోరుకోకూడదు. వారు విఫలమైతే మిగతా బ్యాట్స్‌మెన్ మరింత బాధ్యత తీసుకోవాలి' అని సచిన్ అన్నాడు. మ్యాచ్‌లో హార్దిక్ కంటే ముందు ధోనిని పంపి ఉండాల్సిందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు.

# మహిళతో అసభ్య ప్రవర్తన

## అఫ్గాన్ పేసర్ అఫ్తాబ్‌పై ఏడాది సస్పెన్షన్



**కాబూల్:** ప్రపంచకప్ టోర్నీకి అనూహ్యంగా దూరమైన అఫ్గాన్ పేసర్ అఫ్తాబ్ ఆలమ్‌పై ఏడాదిపాటు నిషేధం విధించారు. అంతర్జాతీయ మ్యాచ్‌లతో పాటు, దేశవాళీ టోర్నీలకూ దూరంగా ఉండాలంటూ అఫ్గానిస్తాన్ క్రికెట్ బోర్డు అతన్ని హెచ్చరించినట్లు ఆలస్యంగా తెలిసింది. ప్రపంచకప్‌లో జూన్ 22న సౌతాంప్టన్‌లో భారత్‌తో ఆడిన మ్యాచే అతనికి చివరిది. ఈ మ్యాచ్ అనంతరం సౌతాంప్టన్ హోటల్‌లో ఒక మహిళతో అఫ్తాబ్ తప్పుగా ప్రవర్తించినట్లు తేలింది. దీంతో జూన్ 23న ఐసీసీ అవినీతి నిరోధక యూనిట్ సమావేశానికి హాజరై వివరణ ఇవ్వాలని కోరగా... అతను కావాలని సమావేశానికి గైర్హాజరవ్వడంతో కోచ్ ఫిల్ సిమన్స్ తర్వాతి రెండు మ్యాచ్‌ల నుంచి అఫ్తాబ్‌ను తప్పించారు. తప్పనిసరి పరిస్థితుల్లో అఫ్తాబ్ ప్రపంచకప్‌నకు దూరమవుతున్నాడని ఆయన ప్రకటించారు. తదుపరి ఈ ఘటనపై అఫ్గాన్ క్రికెట్ బోర్డు క్రమశిక్షణా కమిటీ విచారించి గత వారం జరిగిన సర్వసభ్య సమావేశంలో 26 ఏళ్ల అఫ్తాబ్‌పై సస్పెన్షన్ వేటు వేసింది.

### ముగిసిన ఫర్హార్ట్, బసు పదవీ కాలం

**మాంచెస్టర్:** టీమిండియా ఫిజియోథెరపిస్ట్ ప్యాట్రిక్ ఫర్హార్ట్, ఫిట్‌నెస్–కండిషనింగ్ కోచ్ శంకర్ బసు పదవీ కాలం ముగిసింది. 2015 నుంచి వీరిద్దరూ భారత జట్టుకు సేవలందిస్తున్నారు. ప్రపంచ కప్‌తో వీరి కాంట్రాక్టు ముగిసింది. ఇదే విషయాన్ని బీసీసీఐకి తెలియజేశారు. 'టీమిండియాతో నా చివరి రోజు నేను అనుకున్నట్లు జరగలేదు. నాలుగేళ్లుగా జట్టుకు సేవలందించేలా చూసిన బీసీసీఐకి కృతజ్ఞతలు. ఆటగాళ్లందరికీ, సహాయ సిబ్బందికి మున్ముందు శుభం జరగాలని కోరుకుంటున్నా' అని ఫర్హార్ట్ ట్వీట్ చేశాడు. వీరిద్దరికి కృతజ్ఞతలు చెప్పిన కోహ్లి, జట్టుకు చేసిన సేవలను ప్రశంసించాడు.

**9969 రోజులు... ఇంగ్లండ్ క్రికెట్ జట్టు ఆఖరిసారిగా ప్రపంచ కప్ ఫైనల్ ఆడి ఇన్నిరోజులైంది! అప్పటి నుంచి ఆ దేశపు అభిమానులు ఎదురు చూపులు చూస్తూనే ఉన్నారు. 1992 వరల్డ్ కప్ తర్వాత ఆరు టోర్నీలలో ఒక్కసారి కూడా సెమీస్ చేరలేకపోయిన ఇంగ్లండ్ ఇప్పుడు సొంతగడ్డపై ఎట్టకేలకు తుదిపోరుకు అర్హత సాధించింది. గతంలో మూడు ఫైనల్ పోరాటాల్లోనూ ఓడిన ఆ జట్టు నాలుగో సారి ఫైనల్లోకి అడుగుపెట్టి 44 ఏళ్ల తమ టైటిల్ కలను నెరవేర్చుకునేందుకు అడుగు దూరంలో నిలిచింది. 2015 ప్రపంచకప్‌లో లీగ్ దశలోనే నిష్క్రమించి పాతాళానికి పడిపోయిన ఇంగ్లండ్ కొత్తగా ఎగసి ఇప్పుడు డిఫెండింగ్ చాంపియన్, చిరకాల ప్రత్యర్థి ఆస్ట్రేలియానే చిత్తు చేసి ఫైనల్లోకి అడుగు పెట్టడం మరో విశేషం.**



జేసన్ రాయ్

# ఇంగ్లండ్ ఇరవై ఏడేళ్లకు...

## ప్రపంచ కప్ ఫైనల్లో మోర్గాన్ సేన



### ఇది ఔటా!

అ'ధర్మసేన' నిర్ణయంపై జేసన్ రాయ్ భగ్గుమన్నాడు. 20వ ఓవర్ నాలుగో బంతిని కమిన్స్ లెగ్‌సైడ్‌లో వేశాడు. పుల్‌షాట్‌కు ప్రయత్నించినా... బంతి బ్యాట్‌కు చిక్కకుండానే కీపర్ చేతుల్లో పడింది. కానీ కంగారూ ఆటగాళ్లంతా పెద్దగా అప్పీల్ చేసేసరికి ధర్మసేన (శ్రీలంక) తీరిగ్గా ఔటిచ్చాడు. బ్యాట్‌కు తగలనంత దూరం వెళ్లినా... ఔటేంటని రాయ్ తీవ్రంగా వాదించాడు. పిచ్‌పై నుంచి కదల్లేదు. మరో అంపైర్ ఎరాస్మస్ (దక్షిణాఫ్రికా) సర్దిచెప్పడంతో ఆగ్రహంగా పెవిలియన్‌కు వెళ్లిన రాయ్ తన గ్లవ్స్‌ను విసిరికొట్టడం కనిపించింది. **రాయ్‌పై ఐసీసీ చర్య తీసుకుంది. మ్యాచ్ ఫీజులో 30 శాతం జరిమానాతో పాటు 2 డీ మెరిట్ పాయింట్లు శిక్షగా విధించింది. అయితే ఎలాంటి నిషేధానికి గురికాకపోవడం ఇంగ్లండ్‌కు పెద్ద ఊరట.**

- సెమీఫైనల్లో ఆసీస్‌పై 8 వికెట్లతో ఘన విజయం
- 1992 తర్వాత తొలిసారి తుది పోరుకు ఇంగ్లండ్
- జేసన్ రాయ్ మెరుపు బ్యాటింగ్
- చెలరేగిన వోక్స్, ఆర్చర్
- ఆదివారం కివీస్‌తో పోరు

**బర్మింగ్‌హామ్:** సెమీస్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా ఖేల్ ఖతమైంది. ఈ ప్రపంచకప్‌లో కొత్త చాంపియన్ ఖాయమైంది. గురువారం జరిగిన రెండో సెమీఫైనల్లో ఇంగ్లండ్ 8 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాపై జయకేతనం ఎగురవేసింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా 49 ఓవర్లలో 223 పరుగుల వద్ద ఆలౌటైంది. స్మిత్ (119 బంతుల్లో 85; 6 ఫోర్లు) ఒంటరి పోరాటం చేశాడు. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' క్రిస్ వోక్స్ ప్రత్యర్థిని దెబ్బతీశాడు. లక్ష్యఛేదనకు దిగిన ఇంగ్లండ్ 32.1 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 226 పరుగులు చేసింది. ఓపెనర్ జేసన్ రాయ్ (65 బంతుల్లో 85; 9 ఫోర్లు, 5 సిక్స్‌లు) మెరిపించాడు. మోర్గాన్ (39 బంతుల్లో 45 నాటౌట్), రూట్ (46 బంతుల్లో 49 నాటౌట్; 8 ఫోర్లు) రాణించారు.

### ఫించ్ 0... 14కే ముగ్గురు ఔట్

టాస్ నెగ్గిన ఆస్ట్రేలియా బ్యాటింగ్ ఎంచుకోగా, వార్నర్‌తో కలిసి ఓపెనింగ్ చేసిన కెప్టెన్ ఫించ్ (0) డకౌటయ్యాడు. ఇన్నింగ్స్ రెండో ఓవర్ తొలి బంతికే ఆర్చర్ అతన్ని ఔట్ చేశాడు. మరుసటి ఓవర్లోనే వార్నర్ (9)ను పెవిలియన్ చేర్చిన వోక్స్, హ్యాండ్స్‌కోంబ్ (4)ను బౌల్డ్ చేశాడు. 6.1 ఓవర్లలో ఆసీస్ స్కోరు 14/3. పట్టుమని పది ఓవర్ల 'పవర్‌ప్లే' పూర్తికాకముందే టాపార్డర్ వికెట్లను కోల్పోయిన కంగారూ జట్టు పీకల్లోతు కష్టాల్లో పడింది.

### ఆఖరి దాకా స్మిత్ ఒక్కడే...

రెండో ఓవర్ రెండో బంతికే స్మిత్ ఆట మొదలైంది. అక్కడి నుంచి 47.1 ఓవర్ దాకా స్మిత్ జట్టును ఒడ్డున పడేసేందుకు చేసిన పోరాటం అద్వితీయం. హ్యాండ్స్‌కోంబ్ నిష్క్రమించాక వచ్చిన అలెక్స్ క్యారీ (70 బంతుల్లో 46; 4 ఫోర్లు)తో కలిసి ముందుగా వికెట్ల పతనాన్ని అడ్డుకున్నాడు. తర్వాత జాగ్రత్త పడుతూ... ఓపిగ్గా ఆడుతూ పరుగుల బాటపట్టాడు. ఇద్దరి జోడీ కుదురుకోవడంతో నెమ్మదిగానైనా జట్టు కోలుకుంది. 72 బంతుల్లో స్మిత్ అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. నాలుగో వికెట్‌కు 103 పరుగులు జతయ్యాక జట్టు స్కోరు 117 పరుగుల వద్ద క్యారీని, స్టొయినిస్ (0)ను రషీదే ఔట్ చేశాడు. మళ్లీ కుదుపునకు గురైన స్మిత్ తన అసాధారణ పోరాటంతో జట్టును నిలబెట్టే ప్రయత్నం చేశాడు. ముందుగా మ్యాక్స్‌వెల్ (23 బంతుల్లో 22; 2 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి జట్టు స్కోరును 150 పరుగులు దాటించిన స్మిత్... టెయిలెండర్లతో కలిసి 200 పరుగుల దాకా తీసుకెళ్లాడు. కమిన్స్ (6) విఫలమైనా స్టార్క్ (36 బంతుల్లో 29; 1 ఫోర్, 1 సిక్స్) మెరుగ్గా ఆడటంతో జట్టు ఆ మాత్రమైనా చేయగలిగింది.

### రాయ్ జోరు

ఇంగ్లండ్ విజయలక్ష్యం 224. ఇదేమంత స్కోరే కాదు. కానీ కివీస్ చేతిలో జోరుమీదున్న భారత్ చిత్తవడం, ముందుగా బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా వికెట్ల విలాపంతో ఇంగ్లండ్ జాగ్రత్తపడింది. రాయ్, బెయిర్ స్టో (43 బంతుల్లో 34; 5 ఫోర్లు) మొదట్లో ఆచితూచి ఆడారు. పిచ్‌ను ఆకళింపు చేసుకున్నాక రాయ్ రఫ్ఫాడించడం మొదలుపెట్టాడు. స్టార్క్ వేసిన నాలుగో ఓవర్లో 2 బౌండరీలు కొట్టాడు. అతని మరుసటి ఓవర్లో భారీ సిక్సర్‌తో ఊపుతెచ్చాడు. పవర్‌ప్లే తర్వాత రాయ్ తన బ్యాటింగ్ పవర్ పెంచాడు. 11వ ఓవర్లో స్పిన్నర్ లయన్‌ను రంగంలో దించగా... రాయ్ సిక్సర్‌తో అతనికి స్వాగతం పలికాడు. మరో బౌండరీ కూడా కొట్టడంతో అతని ఓవర్లో 13 పరుగులు వచ్చాయి. స్టార్క్ వేసిన 15 ఓవర్లో రెండు ఫోర్లు కొట్టిన రాయ్ 50 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. వికెట్ కోసం స్మిత్ బౌలింగ్‌తో ఆసీస్ ప్రయోగం చేసింది. అతను 16వ ఓవర్ వేయగా... రాయ్ 'హ్యాట్రిక్' సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. ఈ ఓవర్లో 21 పరుగులు రాగా జట్టు స్కోరు 100 పరుగులు దాటేసింది. ఓపెనింగ్ జోడీ దుర్భేద్యంగా మారడంతో స్టార్క్ బౌలింగ్‌ను అదేపనిగా కొనసాగించాడు. ఈ ప్రయత్నంలో ఆసీస్ కెప్టెన్ ఫించ్ సఫలమయ్యాడు. 18వ ఓవర్లో బెయిర్‌స్టోను స్టార్క్ ఔట్ చేయడంతో 124 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. కాసేపటికే కమిన్స్ బౌలింగ్‌లో అంపైర్ తప్పుడు నిర్ణయంతో రాయ్ ఔటయ్యాడు. అతని నిష్క్రమణతో కెప్టెన్ మోర్గాన్... రూట్‌కు జతయ్యాడు. జట్టు విజయానికి కేవలం 77 పరుగులే కావాలి. ఎలాంటి ఒత్తిడి లేని ఈ దశలో వీళ్లిద్దరు మరో వికెట్ పడకుండా... చక్కగా తమ పని పూర్తిచేశారు.



ఆర్చర్ బౌన్సర్ ధాటికి విలవిల్లాడిన క్యారీ... బ్యాండేజ్‌తో బ్యాటింగ్ కొనసాగించి కీలక ఇన్నింగ్స్ ఆడాడు.



### స్కోరు వివరాలు

**ఆస్ట్రేలియా ఇన్నింగ్స్:** వార్నర్ (సి) బెయిర్‌స్టో (బి) వోక్స్ 9; ఫించ్ ఎల్బీడబ్ల్యూ (బి) ఆర్చర్ 0; స్మిత్ రనౌట్ 85; హ్యాండ్స్‌కోంబ్ (బి) వోక్స్ 4; క్యారీ (సి) సబ్–విన్స్ (బి) రషీద్ 46; స్టొయినిస్ ఎల్బీడబ్ల్యూ (బి) రషీద్ 0; మ్యాక్స్‌వెల్ (సి) మోర్గాన్ (బి) ఆర్చర్ 22; కమిన్స్ (సి) రూట్ (బి) రషీద్ 6; స్టార్క్ (సి) బట్లర్ (బి) వోక్స్ 29; బెహ్రెన్‌డార్ఫ్ (బి) వుడ్ 1; లయన్ నాటౌట్ 5; ఎక్స్‌ట్రాలు 16; **మొత్తం (49 ఓవర్లలో ఆలౌట్) 223. వికెట్ల పతనం:** 1–4, 2–10, 3–14, 4–117, 5–118, 6–157, 7–166, 8–217, 9–217, 10–223. **బౌలింగ్:** వోక్స్ 8–0–20–3, ఆర్చర్ 10–0–32–2, స్టోక్స్ 4–0–22–0, వుడ్ 9–0–45–1, ప్లంకెట్ 8–0–44–0, రషీద్ 10–0–54–3.

**ఇంగ్లండ్ ఇన్నింగ్స్:** జేసన్ రాయ్ (సి) క్యారీ (బి) కమిన్స్ 85; బెయిర్ స్టో ఎల్బీడబ్ల్యూ (బి) స్టార్క్ 34; జో రూట్ నాటౌట్ 49; మోర్గాన్ నాటౌట్ 45; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (32.1 ఓవర్లలో 2 వికెట్లకు) 226. వికెట్ల పతనం:** 1–124, 2–147. **బౌలింగ్:** బెహ్రెన్‌డార్ఫ్ 8.1–2–38–0, స్టార్క్ 9–0–70–1, కమిన్స్ 7–0–34–1, లయన్ 5–0–49–0, స్మిత్ 1–0–21–0, స్టొయినిస్ 2–0–13–0.



సెరెనా

# తుది పోరుకు 'సై'రెనా

- స్ట్రికోవాపై అలవోక విజయం
- శనివారం జరిగే ఫైనల్‌లో హలెప్‌తో పోరు

**లండన్ :** టెన్నిస్ దిగ్గజ మహిళా క్రీడాకారిణి మార్గరెట్ కోర్ట్(ఆస్ట్రేలియా) అత్యధిక గ్రాండ్ స్లామ్ రికార్డుకు అడుగు దూరంలో సెరెనా విలియమ్స్ నిలిచింది. ప్రతిష్టాత్మక వింబుల్డన్ టోర్నీ మహిళల విభాగంలో సెరెనా విలియమ్స్ 11వ సారి ఫైనల్ చేరింది. గురువారం జరిగిన సెమీస్ మ్యాచ్‌లో 11వ సీడ్ సెరెనా 6–1, 6–2తో అన్‌సీడెడ్ బార్బరా స్ట్రికోవా (చెక్ రిపబ్లిక్)పై విజయం సాధించి హలెప్‌తో జరిగే టైటిల్ పోరుకు సిద్ధమైంది. మరో సెమీఫైనల్ మ్యాచ్‌లో రుమేనియా తార 7వ సీడ్ హలెప్ 6–1, 6–3తో 8వ సీడ్ స్వితోలినా(ఉక్రెయిన్)పై వరుస సెట్లల్లో గెలిచి తుది పోరుకు అర్హత సాధించింది.

### ఫోర్ హ్యాండ్ షాట్లతో హోరెత్తించి..

హాట్ ఫేవరెట్‌గా బరిలో దిగిన సెరెనా అంచనాలకు ఏ మాత్రం తగ్గకుండా ఆడింది. తనదైన ఫోర్ హ్యాండ్ షాట్‌లతో ప్రత్యర్థికి ముచ్చెమటలు పట్టించింది. సెరెనా ఫోర్ హ్యాండ్ షాట్‌లకు స్ట్రికోవా దగ్గర ఎటువంటి సమాధానం లేకపోవడంతో మొదటి సెట్‌ను 27 నిమిషాల్లో, రెండో సెట్‌ను 22 నిమిషాల్లో గెలిచి మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. మ్యాచ్‌లో సెరెనా 28 విన్నర్లను, 4 ఏస్‌లను కొట్టగా.. స్ట్రికోవా కేవలం 8 విన్నర్లను, ఒక ఏస్‌ను మాత్రమే కొట్టింది.

### తొలిసారి..

2018 ఫ్రెంచ్ ఓపెన్ విజేత హలెప్ తన కెరీర్‌లోనే తొలిసారిగా వింబుల్డన్ మహిళల విభాగంలో ఫైనల్ చేరింది. టోర్నీ మొత్తం అంచనాలకు మించి రాణించిన ఉక్రెయిన్ భామ స్వితోలినా మాత్రం తన కెరీర్‌లో ఆడుతున్న తొలి సెమీస్‌లో తడబడింది. మ్యాచ్ ఆసాంతం క్రాస్ కోర్టు, డౌన్ ద లైన్ షాట్‌లతో ప్రత్యర్థిని కోర్టు నలువైపులా పరుగెత్తించిన హలెప్ 73 నిమిషాల్లోనే మ్యాచ్‌ను ముగించింది. ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదు సార్లు బ్రేక్ చేసిన హలెప్ 26 విన్నర్లను కొట్టగా.. స్వితోలినా ఒక సారి మాత్రమే బ్రేక్ చేసి కేవలం 10 విన్నర్లను కొట్టింది. ఫైనల్‌కు చేరే క్రమంలో హలెప్ కేవలం ఒకే ఒక్క సెట్‌ను ప్రత్యర్థికి కోల్పోవడం విశేషం.

| నేటి పురుషుల సింగిల్స్ సెమీఫైనల్ | |
|---|---|
| జొకోవిచ్ X బాటిస్టా | సాయంత్రం 5.30 నుంచి స్టార్ స్పోర్ట్ సెలెక్ట్-1లో ప్రత్యక్ష ప్రసారం |
| ఫెడరర్ X నాదల్ | |



హలెప్



MUTUAL FUNDS నిజమే మరి
మ్యూచువల్ ఫండ్స్ మీకోసం ఎలా నిజమైనవో, తెలుసుకునేందుకై సందర్శించండి: mutualfundssahihai.com
మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులు మార్కెట్ రిస్క్‌కి లోబడి ఉంటాయి,
స్కీముకు సంబంధించిన దస్తావేజులన్నింటినీ జాగ్రత్తగా చదవండి.

# స్పీకర్ కోర్టులో బంతి


విధానసౌధలో స్పీకర్ రమేశ్ కుమార్

- కర్ణాటక అసెంబ్లీ స్పీకర్ రమేశ్ కుమార్‌తో 10 మంది రెబెల్ ఎమ్మెల్యేల భేటీ
- సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు స్పీకర్‌కు మరోసారి రాజీనామాల అందజేత
- ఇష్టపూర్వకంగానే రాజీనామాలు ఇచ్చారా అన్నది పరిశీలిస్తానన్న స్పీకర్ రమేశ్ కుమార్

**సాక్షి, బెంగళూరు/న్యూఢిల్లీ/ముంబై:** కర్ణాటక రాజకీయం గురువారం మరింత రసవత్తరంగా మారింది. అసెంబ్లీ స్పీకర్ రమేశ్ తమ రాజీనామాలను కావాలనే ఆమోదించట్లేరని 10 మంది రెబెల్ ఎమ్మెల్యేలు సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో ఆ ఎమ్మెల్యేలను కలవాలని స్పీకర్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో వీరంతా ప్రత్యేక విమానాల్లో ముంబై నుంచి కర్ణాటకలోని హాల్ విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడినుంచి పోలీస్ భద్రత మధ్య లగ్జరీ బస్సులో విధానసౌధ(అసెంబ్లీ)లోని స్పీకర్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా తిరుగుబాటు ఎమ్మెల్యేలతో సాయంత్రం 6 నుంచి గంటపాటు సమావేశమైన స్పీకర్ రమేశ్.. వారు మరోసారి సమర్పించిన రాజీనామా లేఖల్ని స్వీకరించారు. సమావేశం అనంతరం రమేశ్ మీడియాతో మాట్లాడారు. 'ఎమ్మెల్యేలు తమ రాజీనామాలను ఈసారి సరైన ఫార్మాట్‌లో సమర్పించారు. ఈ రాజీనామాలను శాసనసభ్యులు ఇష్టపూర్వకంగానే ఇచ్చారా? లేదా? అనేది సమీక్షిస్తా. ఇందుకోసం కొంత సమయం పడుతుంది. రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులకు, రాబోయే ఫలితానికి నేను ఎంతమాత్రం బాధ్యుడ్ని కాదు' అని రమేశ్ స్పష్టం చేశారు. రాజీనామాలు సమర్పించిన అనంతరం తిరుగుబాటు ఎమ్మెల్యేలు ముంబైకి వెళ్లిపోయారు.

**సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు**

10 మంది రెబెల్ ఎమ్మెల్యేల రాజీనామాలపై తక్షణం నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు గురువారం అసెంబ్లీ స్పీకర్ రమేశ్‌ను ఆదేశించింది. వీరి రాజీనామాలపై తీసుకున్న నిర్ణయాన్ని శుక్రవారం తమకు తెలియజేయాలని సీజేఐ జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ దీపక్ గుప్తా, జస్టిస్ అనిరుద్ధ బోస్‌ల ధర్మాసనం సూచించింది. ఈ 10 మంది ఎమ్మెల్యేలు బెంగళూరు విమానాశ్రయం నుంచి విధానసౌధ వరకూ వెళ్లేందుకు కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని కర్ణాటక డీజీపీని ఆదేశించింది. వీరంతా గురువారం సాయంత్రం 6 గంటలకు స్పీకర్‌తో భేటీ కావాలని ఆదేశించింది. ఈ ఆదేశాలు వెలువడ్డ కొన్నిగంటల్లోనే స్పీకర్ రమేశ్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. నిబంధనల మేరకు తొలుత అందిన, పెండింగ్‌లో ఉన్న విజ్ఞప్తులపై తాను నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని ఈ సందర్భంగా స్పీకర్ కోర్టుకు విన్నవించారు. కాబట్టి రెబెల్ ఎమ్మెల్యేల పిటిషన్ విషయంలో కోర్టు ఇచ్చిన ఆదేశాలను సవరించాలని కోరారు. అయితే ఇప్పటికే ఉత్తర్వులు ఇచ్చినందున స్పీకర్ పిటిషన్‌ను రెబెల్ ఎమ్మెల్యేల పిటిషన్‌తో కలిపి విచారిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. తమ ఉత్తర్వులు కేవలం ఈ 10 మంది ఎమ్మెల్యేలకే వర్తిస్తాయని తేల్చిచెప్పింది.

**విధానసౌధ వద్ద 144 సెక్షన్**

కర్ణాటక అసెంబ్లీ వద్ద పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. శుక్రవారం నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానుండటం, మరోవైపు ఇంటెలిజెన్స్ వర్గాల హెచ్చరికల నేపథ్యంలో విధానసౌధకు 2 కి.మీ పరిధిలో సీఆర్పీసీ సెక్షన్ 144 కింద నిషేధాజ్ఞలు విధించారు. ఈ ప్రాంతంలో ఐదుగురి కంటే ఎక్కువమంది గుమిగూడేందుకు వీల్లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీచేసిన నగర కమిషనర్ అలోక్ కుమార్.. ఈ నిషేధాజ్ఞలు గురువారం నుంచి అమల్లోకి వస్తాయని ప్రకటించారు.

**కాంగ్రెస్ పార్టీకి మరో షాక్**

కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీకి షాక్ ఇచ్చేందుకు మరో నలుగురు ఎమ్మెల్యేలు సిద్ధమయ్యారు. సౌమ్యారెడ్డి(జయనగర–బెంగళూరు), సుబ్బారెడ్డి(బాగేపల్లి), మహంతేశ్ కౌజలగి(రాయభాగ), అంజలి నింబాళ్కర్(ఖానాపుర)లు త్వరలోనే రాజీనామా చేస్తారని సమాచారం.


అసెంబ్లీ స్పీకర్‌ను కలిసేందుకు వస్తున్న తిరుగుబాటు ఎమ్మెల్యేలు

## స్పీకర్‌పై అభిశంసన?

**సాక్షి ప్రతినిధి, న్యూఢిల్లీ:** కర్ణాటకలో ఎమ్మెల్యేల రాజీనామాలను ఆమోదించాలని సుప్రీంకోర్టు స్పీకర్‌ను ఆదేశించజాలదని రాజ్యాంగ నిపుణులు, సీనియర్ న్యాయవాదులు చెబుతున్నారు. శాసన, కార్యనిర్వాహక, న్యాయశాఖల మధ్య ఉన్న అధికారాల విభజనే ఇందుకు కారణమని వ్యాఖ్యానిస్తున్నారు. ఈ విషయంలో ఓస్థాయి దాటి అత్యున్నత న్యాయస్థానం కూడా జోక్యం చేసుకోలేదనీ, తమ అభిప్రాయాలను మాత్రమే చెప్పగలదని స్పష్టం చేశారు. మరోవైపు అధికార పక్షాన్ని ఇరుకున పెట్టేందుకు కమలనాథులు సిద్ధమవుతున్నారు. అసెంబ్లీలో బీజేపీకి ఇప్పటికే 107 మంది సభ్యుల మద్దతున్న నేపథ్యంలో స్పీకర్ రమేశ్ కుమార్‌పై 'అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టాలని భావిస్తున్నట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. నేటి నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం ద్రవ్య బిల్లు(ఓటాన్ అకౌంట్)ను ప్రవేశపెట్టనుంది.


అసెంబ్లీకొస్తున్న సీఎం కుమారస్వామి

## రాజీనామా ప్రసక్తే లేదు: సీఎం

'అసలు నేనెందుకు రాజీనామా చేయాలి? ఇప్పుడు నేను రాజీనామా చేయాల్సిన అవసరం ఏంటి? 2009–10 సమయంలో కొంత మంది మంత్రులు సహా 18 మంది ఎమ్మెల్యేలు అప్పటి సీఎం యడ్యూరప్పను వ్యతిరేకించారు. అప్పుడాయన రాజీనామా చేయలేదే' అని సీఎం కుమారస్వామి అన్నారు. అవిశ్వాస పరీక్షను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు గురువారం సమావేశమైన రాష్ట్ర కేబినెట్ తీర్మానించింది.

## మనస్సాక్షి ఆధారంగా నిర్ణయం: స్పీకర్

రెబెల్ ఎమ్మెల్యేల పిటిషన్ విషయంలో సుప్రీంకోర్టు చాలా జాగ్రత్తగా స్పందించిందని స్పీకర్ రమేశ్ కుమార్ తెలిపారు. '10 మంది తిరుగుబాటు ఎమ్మెల్యేలను కలుసుకోవాలనీ, వారి రాజీనామాలను స్వీకరించాలని అత్యున్నత న్యాయస్థానం నన్ను కోరింది. ఒకవేళ ఈ రాజీనామాలను ఆమోదిస్తే, అనర్హతవేటు వేయాలంటూ కాంగ్రెస్, జేడీఎస్ చేసిన విజ్ఞప్తులు చెల్లకుండాపోతాయి. ఒకవేళ నేను ఈ ప్రక్రియను ఆదరాబాదరాగా చేపడితే మొత్తంగా అన్యాయం చేసినట్లు అవుతుంది. ఈ విషయంలో నేను మనస్సాక్షి ఆధారంగా ముందుకెళతా. ఎమ్మెల్యేల రాజీనామాల విషయంలో ఓ నిర్ణయం తీసుకోవాలని మాత్రమే సుప్రీంకోర్టు నన్ను కోరింది. 10 మంది శాసనసభ్యులతో గురువారం జరిగిన భేటీని వీడియో తీయించాను. శుక్రవారం ఈ వీడియోను సుప్రీంకోర్టుకు సమర్పిస్తాను. అలాగే ఎమ్మెల్యేలు ఇష్టపూర్వకంగా, స్వచ్ఛందంగానే రాజీనామాలు సమర్పించారా.. అనే విషయమై రాత్రంతా ఆలోచించి నిర్ణయం తీసుకోవాల్సిఉంటుంది. నేనేమీ మెరుపు వేగంతో పనిచేయలేను. ప్రజలకు, రాష్ట్రానికి, పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థకు తప్ప నేను ఎవ్వరికీ జవాబుదారీ కాదు' అని వెల్లడించారు. ఎమ్మెల్యేల రాజీనామాలపై తాను కావాలనే ఆలస్యం చేస్తున్నట్లు కొన్ని మీడియా సంస్థల్లో వార్తలు రావడంతో కలత చెందానని స్పీకర్ రమేశ్ పేర్కొన్నారు. తిరుగుబాటు ఎమ్మెల్యేలు గవర్నర్ వజూభాయ్‌వాలాను జూలై 6న కలిశారనీ, ఆ రోజున తాను కార్యాలయంలోనే ఉన్నానన్నారు. అయితే తాను సొంతపనిపై బయటకు వెళ్లగా, ఎమ్మెల్యేలు కనీస సమాచారం ఇవ్వకుండా తన కార్యాలయానికి వచ్చారని చెప్పారు. తిరుగుబాటు ఎమ్మెల్యేలు సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో పరిస్థితులు గందరగోళంగా, రోతపుట్టించేలా తయారయ్యాయని రమేశ్ వ్యాఖ్యానించారు. తిరుగుబాటు ఎమ్మెల్యేలతో భేటీకి ముందు రమేశ్ మీడియాతో మాట్లాడుతూ..'వాళ్లు(శాసనసభ్యులు) నా కార్యాలయానికి రావాలనుకుంటే నేను అడ్డుకునేవాడిని కాదు. ఇందుకోసం వాళ్లు సుప్రీంకోర్టు వరకూ ఎందుకెళ్లారో నాకు అర్థం కావట్లేదు. శాసనసభ్యుల్ని కలుసుకోవడానికి నేను ఏనాడూ నిరాకరించలేదు' అని స్పష్టం చేశారు.

## బీజేపీ నేతలతో మంత్రి మహేశ్ రహస్య భేటీ

**సాక్షి, బెంగళూరు:** సీఎం కుమారస్వామి సన్నిహితుడు, మంత్రి సా.రా.మహేశ్ గురువారం రాత్రి బెంగళూరులో కర్ణాటక బీజేపీ ఇన్‌చార్జ్ మురళీధరరావు, బీజేపీ సీనియర్ నేత ఈశ్వరప్పతో రహస్యంగా భేటీ అయ్యారు. బీజేపీతో జేడీఎస్ మైత్రి కోసమే మహేశ్ రంగంలోకి దిగారని వార్తలు చక్కర్లు కొట్టాయి. ఈ నేపథ్యంలో మంత్రి మహేశ్ స్పందిస్తూ.. తాను బీజేపీ నేతలను అనుకోకుండా కలిశానని తెలిపారు. విశ్రాంతి తీసుకునేందుకు తాను వెళ్లగా బీజేపీ నేతలు కనిపించారనీ, దీంతో మర్యాదపూర్వకంగా మాట్లాడానని స్పష్టం చేశారు.


గురువారం అస్సాంలోని కాలీపూర్‌లో ఆలయ సమీపంలోని విష్ణుమూర్తి, లక్ష్మీదేవిల విగ్రహాలను తాకుతూ వరదనీటితో ఉధృతంగా ప్రవహిస్తున్న బ్రహ్మపుత్ర నది

## 32 రోజుల్లోనే 'మరణ శిక్ష' తీర్పు



**భోపాల్:** మైనర్ బాలికను రేప్ చేసి చంపిన కేసుతో పాటు మరో లైంగిక దాడికి పాల్పడిన కేసుల్లో దోషికి మధ్యప్రదేశ్ కోర్టు మరణ శిక్ష విధించింది. గత నెల 8న విష్ణు బమోరా(32), ఓ బాలికను (12) రేప్ చేసి చంపేశాడు. ఈ బాలికతో పాటు మరో ఎనిమిదేళ్ల బాలికపై అసహజ లైంగిక దాడి చేసినందుకు పోలీసులు పోక్సో, ఐపీసీ చట్టాల కింద కేసులు నమోదు చేశారు. పోక్సో చట్టం కింద భోపాల్‌లో ప్రత్యేక జడ్జి కుముదిని పటేల్ ఈ కేసును విచారించారు. 30 మంది చెప్పిన సాక్ష్యాలను, ఫోరెన్సిక్ నిపుణులు ఇచ్చిన డీఎన్‌ఏ రిపోర్టులను పరిశీలించారు. వీటితో పాటు పోలీసులు గత నెల 12న 108 పేజీల చార్జిషీట్‌ను దాఖలు చేశారు. వీటన్నింటినీ పరిశీలించిన కోర్టు నిందితుడిని దోషిగా తేలుస్తూ మూడు, ఏడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు మరణ శిక్షను విధించారని రాష్ట్ర న్యాయ శాఖ అధికార ప్రతినిధి సుధా విజయ్ సింగ్ భదోరియా తెలిపారు. ఈ శిక్షలన్నీ ఒకేసారి అమలవుతాయని తెలిపారు.

# అమిత్‌షాతో గోవా సీఎం భేటీ

**బీజేపీలోకి కాంగ్రెస్ ఎమ్మెల్యేల చేరికతో రాష్ట్ర కేబినెట్ విస్తరణపై చర్చలు!**

**న్యూఢిల్లీ:** గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేపీ నడ్డాలతో గురువారం ఢిల్లీలో భేటీ అయ్యారు. గోవాలో కాంగ్రెస్ పార్టీకి చెందిన 10 మంది ఎమ్మెల్యేలు బీజేపీలో చేరిన నేపథ్యంలో రాష్ట్ర కేబినెట్ విస్తరణ సహా పలు అంశాలపై చర్చలు జరిపినట్లుగా తెలుస్తోంది. గోవా అసెంబ్లీలో మొత్తం 40 స్థానాలు ఉండగా.. బీజేపీ 17 స్థానాలను, కాంగ్రెస్ 15 స్థానాలను గెలుచుకున్నాయి. గోవా ఫార్వర్డ్ పార్టీ సహా పలు స్వతంత్రుల మద్దతుతో కూటమిగా ఏర్పడి బీజేపీ అధికారాన్ని చేపట్టింది. తాజాగా కాంగ్రెస్ ఎమ్మెల్యేల చేరికతో కూటమి పార్టీల మద్దతు అవసరం లేకుండానే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునే స్థాయికి చేరుకుంది.

**అభివృద్ధి కోసమే బీజేపీలోకి..**

తమ నియోజకవర్గాల అభివృద్ధి కోసమే బీజేపీలో చేరామని చంద్రకాంత్ కవ్లేకర్ వెల్లడించారు. మిగతా 9 మంది ఎమ్మెల్యేలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రతిపక్షంలో ఉంటే తమ ప్రాంతాల అభివృద్ధి అసాధ్యమని ఆరోపించారు.


ఢిల్లీలో నడ్డాతో చంద్రకాంత్ కవ్లేకర్

## ముగ్గురు బీజేపీ ఎంపీల ఎన్నికపై పిటిషన్లు

**న్యూఢిల్లీ:** ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో గెలుపొందిన కేంద్ర మంత్రి హర్షవర్ధన్, బీజేపీ ఎంపీలు హన్స్‌రాజ్ హన్స్, మీనాక్షీ లేఖిల ఎన్నికను ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేశారు. ఎన్నికల నామినేషన్ సమయంలో వారు తమ అఫిడవిట్లలో తప్పుడు సమాచారాన్ని పొందుపర్చారని పిటిషనర్లు పేర్కొన్నారు. ఈ మేరకు వీరిపై దాఖలైన 3 వేర్వేరు పిటిషన్లు ముగ్గురు జడ్జీల ముందు విచారణకు వచ్చాయి. ఈ పిటిషన్లకు సమాధానామివ్వాలని కోరుతూ హర్షవర్ధన్, హన్స్‌రాజ్‌లకు కోర్టు నోటీసులు జారీ చేసింది. లేఖి ఎన్నికపై తదుపరి విచారణను ఆగస్టు 18కి వాయిదా వేసింది.

## న్యూస్‌ప్రింట్‌పై దిగుమతి సుంకం ఎత్తేయండి

**న్యూఢిల్లీ:** న్యూస్‌ప్రింట్ (వార్తాపత్రికలు, మేగజీన్లను ముద్రించేందుకు వాడే కాగితం)పై ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో విధించిన 10 శాతం దిగుమతి సుంకాన్ని ఎత్తివేయాలని కేరళకు చెందిన స్వతంత్ర ఎంపీ వీరేంద్ర కుమార్ గురువారం రాజ్యసభలో కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికే వివిధ కారణాల వల్ల తీవ్ర ఆర్థిక కష్టాల్లో ఉన్న వార్తాపత్రికలు, మేగజీన్లపై ప్రభుత్వ చర్య వల్ల మరింత భారం పడుతుందన్నారు. 2009 నుంచి న్యూస్‌ప్రింట్ దిగుమతులపై అసలు సుంకమే లేదనీ, ఇప్పుడు విధిస్తున్న 10 శాతం సుంకం గతంలోకెల్లా అత్యధికమని ఆయన తెలిపారు. కేంద్రం నిర్ణయం వల్ల అనేక చిన్న, మధ్యస్థాయి పత్రికలు, మేగజీన్లు మూతపడతాయని వీరేంద్ర హెచ్చరించారు.

## మధ్యవర్తిత్వం పురోగతిపై నివేదిక ఇవ్వండి



**న్యూఢిల్లీ:** అయోధ్య వివాదానికి సామరస్య పూర్వక పరిష్కారం కనుగొనేందుకు ఏర్పాటు చేసిన మధ్యవర్తిత్వ బృందం ఇంత వరకు ఏ మేరకు పురోగతి సాధించిందో వివరిస్తూ జులై 18లోగా నివేదిక సమర్పించాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. ఆ నివేదికను పరిశీలించాక మధ్యవర్తిత్వం వల్ల లాభం లేదని భావిస్తే జులై 25 నుంచి తామే కేసు విచారణ చేపడతామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయ్‌తో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. అవసరమైతే రోజువారీ విచారణ జరుపుతామని కూడా పేర్కొంది. మధ్యవర్తిత్వం వల్ల ఉపయోగం లేదని, న్యాయస్థానమే ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ కక్షిదారుల్లో ఒకరు సుప్రీం కోర్టును ఆశ్రయించడం తెల్సిందే.

## రైతులపై కేంద్రం చిన్నచూపు: రాహుల్

**న్యూఢిల్లీ:** మోదీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం వ్యాపారవేత్తలతో పోలిస్తే రైతులను చిన్నచూపు చూస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ అన్నారు. లోక్‌సభలో గురువారం జీరో అవర్‌లో రాహుల్ మాట్లాడుతూ తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కేరళలోని వయనాడ్‌లో రైతుల సమస్యలు, ఆత్మహత్యలను లేవనెత్తారు. మోదీ ప్రభుత్వం వ్యాపారస్తులకు రూ. 4.3 లక్షల కోట్ల రాయితీలు, రూ. 5.5 లక్షల కోట్ల రుణమాఫీలతో కలిపి మొత్తంగా రూ. 9.8 లక్షల కోట్ల ప్రయోజనాలను చేకూర్చిందని రాహుల్ ఆరోపించారు. కానీ రైతుల దుఃస్థితి గురించి కేంద్రం ఏ మాత్రమూ పట్టించుకోవడం లేదనీ, వారి సమస్యలను తీర్చలేదని రాహుల్ సభలో అన్నారు.

## పాక్‌లో ప్రమాదాల్లో 34 మంది మృతి

**లాహోర్/ఇస్లామాబాద్:** పాకిస్తాన్‌లో జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో 34 మంది మరణించారు. సాదిఖాబాద్ తెహ్సీల్‌లోని వాల్హర్ రైల్వే స్టేషన్‌లో ఆగి ఉన్న గూడ్స్ రైలును ఖెట్టా బాండ్ అక్బర్ ఎక్స్‌ప్రెస్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో 21 మంది మరణించారు. 89 మంది గాయపడ్డారు. గాయపడిన వారిని దగ్గర్లోని ఆస్పత్రులకు తరలించారు. రైల్లో ఇరుక్కున్న వారిని రక్షించడానికి కట్టర్లను ఉపయోగించాల్సి వచ్చిందని స్థానిక పోలీసులు తెలిపారు. అక్బర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఇంజిన్ పూర్తిగా నాశనం కాగా, మరో మూడు బోగీలు కూడా దెబ్బతిన్నాయన్నారు. మానవ తప్పిదం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నామని అన్నారు. ప్రమాదంలో మరణించిన వారికి రూ. 15 లక్షలు (పాక్ కరెన్సీ), గాయపడిన వారికి రూ. 5 లక్షలు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. మరో వైపు లాహోర్ నుంచి స్వాట్‌కు వెళ్తున్న ఓ బస్సు ఇస్లామాబాద్‌కు 45 కిలోమీటర్ల దూరంలోని హసన్ అబ్దాల్ వద్ద ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో 13 మంది మరణించగా, 34 మంది గాయపడ్డారు.

# జైసింగ్ దంపతుల ఇళ్లపై సీబీఐ దాడులు

- స్వచ్ఛంద సంస్థ ద్వారా ఎఫ్‌సీఆర్‌ఏ నిబంధనలు ఉల్లంఘించారని ఆరోపణలు
- ఢిల్లీలోని ఇల్లు, ఆఫీస్, ముంబై ఆఫీస్‌లోనూ సోదాలు


ఇందిరా జైసింగ్ | ఆనంద్ గ్రోవర్

**న్యూఢిల్లీ:** ప్రముఖ సుప్రీంకోర్టు మహిళా న్యాయవాది, మాజీ అదనపు సొలిసిటర్ జనరల్ ఇందిరా జైసింగ్, ఆమె భర్త ఆనంద్ గ్రోవర్‌లపై కేంద్ర దర్యాప్తు బృందం (సీబీఐ) దాడులు నిర్వహించింది. విదేశీ నిధుల చట్టం నిబంధనల ఉల్లంఘన ఆరోపణలపై ఈ దాడులు జరిగాయి. గురువారం తెల్లవారుజామున 5గంటలకు ఢిల్లీలోని ఇందిరా జైసింగ్ ఇల్లు, జంగ్‌పురాలో లాయర్స్ కలెక్టివ్ స్వచ్ఛంద సంస్థ ఆఫీస్, ముంబైలోని మరో ఆఫీస్‌లో దాడులు నిర్వహించినట్లు సీబీఐ ప్రకటించింది. ఆనంద్ గ్రోవర్ తన ఆధ్వర్యంలో నడుస్తోన్న లాయర్స్ కలెక్టివ్ స్వచ్ఛంద సంస్థకు వచ్చిన విదేశీ విరాళాలను దుర్వినియోగం చేశారని ఆరోపణలు వచ్చాయి. 2006 నుంచి 2014 మధ్య ఆనంద్ గ్రోవర్ తన స్వచ్ఛంద సంస్థ ద్వారా రూ.32.39 కోట్లకుపైగా అవకతవకలకు పాల్పడ్డారని హోం శాఖ ఫిర్యాదిచ్చింది. దీంతో సంస్థ అధ్యక్షుడు గ్రోవర్‌పై విదేశీ సహకార నియంత్రణ చట్టాన్ని(ఎఫ్‌సీఆర్‌ఏ) ఉల్లంఘించారన్న ఆరోపణల కింద సీబీఐ కేసు నమోదు చేసింది. దీనిలో భాగంగానే గురువారం సోదాలు నిర్వహించింది. ఫిర్యాదులో ఇందిరను నిందితురాలిగా పేర్కొనలేదు. 2009–14లో అదనపు సొలిసిటర్ జనరల్‌గా ఇందిర పనిచేశారు. ఈ ఆరోపణలను ఖండిస్తూ ఇందిర, గ్రోవర్, లాయర్స్ కలెక్టివ్ తరఫున ఓ ప్రకటన వెలువడింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై ఓ మాజీ ఉద్యోగి చేసిన లైంగిక ఆరోపణల కేసును ఇందిర వాదిస్తుండడంతోనే ఇలాంటి దాడులు జరుగుతున్నాయని సంయుక్త ప్రకటన పేర్కొంది.

**ఖండించిన రాజకీయ పార్టీలు..**

సీబీఐ దాడులు రాజకీయ కక్ష సాధింపులో భాగమేనని, ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు కేంద్ర ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని తృణమూల్ కాంగ్రెస్ ఆరోపించింది. సీబీఐ దాడులను టీఎంసీ, ఎస్పీ, సీపీఐ, సీపీఎంలకు చెందిన ఎంపీలు మూకుమ్మడిగా ఖండించారు. కేంద్ర ప్రభుత్వం తన అధికారాలను పూర్తిస్థాయిలో దుర్వినియోగం చేస్తోందన్నారు. ఈ మేరకు వారంతా ప్రధాని మోదీకి ఓ లేఖ రాశారు.

## ఆర్టీఐ కార్యకర్త హత్య కేసులో మాజీ ఎంపీకి జీవితఖైదు


ఎంపీ దిను సోలంకి

**అహ్మదాబాద్:** ఆర్టీఐ కార్యకర్త అమిత్ జెత్వా హత్య కేసులో బీజేపీ మాజీ ఎంపీతోపాటు ఆరుమందికి సీబీఐ ప్రత్యేక కోర్టు జీవిత ఖైదు విధించింది. గిర్ అరణ్య ప్రాంతంలో అక్రమ మైనింగ్ వ్యవహారాలను పిల్ ద్వారా వెలుగులోకి తేవడంతో జెత్వాను 2010లో నాటి జునాగఢ్ ఎంపీ దిను సోలంకి హత్య చేశారు. ఈ అక్రమ మైనింగ్‌లో సోలంకి ఉన్నాడని జెత్వా తన పిల్‌లో పేర్కొనడమే ఈ హత్యకు కారణం. దోషులు సోలంకి, అతడి మేనల్లుడు శివలకు జీవిత ఖైదుతోపాటు రూ. 15 లక్షల చొప్పున జరిమానా విధిస్తూ సీబీఐ జడ్జి కేఎం దేవ్ గురువారం తీర్పునిచ్చారు. వీరితోపాటు శైలేష్ పాండ్య, బహదూర్‌సిన్హ్ వాధెర్, పంచన్ దేశాయ్, సంజయ్ చౌహాన్, ఉడాజి ఠాకూర్‌లకు జీవిత ఖైదు విధించింది. 2010లో ఓ వైపు జెత్వా దాఖలు చేసిన పిల్‌పై వాదనలు జరుగుతుండగానే గుజరాత్ హైకోర్టు ప్రాంగణంలో అమిత్ జెత్వా దారుణ హత్యకు గురయ్యారు. ఈ హత్య కేసును విచారించిన అహ్మదాబాద్ పోలీసులు బీజేపీ ఎంపీ దిను సోలంకికి క్లీన్‌చిట్ ఇచ్చారు. సంతృప్తి చెందని మృతుడు అమిత్ జెత్వా తండ్రి భిఖాభాయ్ జెత్వా కేసును సీబీఐకి అప్పగించాలంటూ కోర్టును కోరారు. కోర్టు అందుకు అంగీకరించడంతో సీబీఐ విచారణ చేపట్టి తీర్పు వెలువరించింది. కేసును పరిష్కరించడానికి న్యాయవ్యవస్థ ఎక్కువ సమయం తీసుకున్నప్పటికీ, తమ కుటుంబానికి న్యాయం అందిందని తీర్పు అనంతరం భిఖాభాయ్ పేర్కొన్నారు.

# త్వరలో అద్దె చట్టం

- స్థల/భవనాలను అద్దెకు ఇవ్వడంలో పలు నిబంధనలు
- నమూనా బిల్లు విడుదల

**న్యూఢిల్లీ:** దేశంలో భవనాలు, స్థలాలను అద్దెకు ఇవ్వడానికి సంబంధించి పలు నిబంధనలను రూపొందిస్తూ 'అద్దె చట్టం' తీసుకురావడానికి కేంద్రం సిద్ధమైంది. ఇందుకు సంబంధించిన ముసాయిదా బిల్లుపై ఆగస్టు 1లోపు ప్రజలు తమ అభిప్రాయాలను తెలపవచ్చు. స్థల/భవన యజమానులతోపాటు అద్దెకు ఉండేవారు నష్టపోకుండా ఉండటం కోసం కేంద్రం పలు నిబంధనలను ఈ బిల్లులో ప్రతిపాదించింది.

**బిల్లులోని కొన్ని ప్రతిపాదనలు..**

- అద్దె పెంచాలంటే 3నెలల ముందే ఆ విషయాన్ని కిరాయిదారుకు యజమాని రాతపూర్వకంగా తెలియజెప్పాలి.
- అద్దెకు భవనం/స్థలం తీసుకున్నవారు ముందుగా ఒప్పందం చేసుకున్న కాలం కంటే ఎక్కువ రోజులు అక్కడ ఉంటూ, సమయానికి ఖాళీ చేయకపోతే 2–4 రెట్లు అధిక అద్దె చెల్లించాల్సి ఉంటుంది.
- అడ్వాన్స్ లేదా సెక్యూరిటీ డిపాజిట్ కింద యజమానులు వసూలు చేసే డబ్బు రెండు నెలల అద్దె కంటే ఎక్కువ ఉండకూడదు.
- ఇంట్లో ఏదైనా రిపేర్లు చేయించాల్సి వచ్చి, ఆ విషయాన్ని యజమాని పట్టించుకోకపోతే అద్దెకు ఉంటున్నవారు ఆ రిపేర్లు చేయించి, అందుకు అయిన వ్యయాన్ని అద్దెలో మినహాయించుకోవచ్చు. ఆ రిపేర్లు అద్దెకు ఉంటున్న వారే చేయించాల్సినవి అయినప్పటికీ వారు పట్టించుకోకపోతే, యజమాని ఆ పనిని చేపించి, అందుకు అయిన వ్యయాన్ని అడ్వాన్సు/సెక్యూరిటీ డిపాజిట్ నుంచి మినహాయించుకోవచ్చు.
- యజమానులు, కిరాయిదారుల ఫిర్యాదుల పరిష్కారానికి జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో జిల్లా అద్దె వ్యవహారాల విభాగం ఏర్పాటు
- అద్దె ఒప్పందం కుదుర్చుకున్న రెండు నెలల్లోపు యజయాని, అద్దెకు వచ్చిన వారు.. ఇద్దరూ వెళ్లి అద్దె ఒప్పంద పత్రాన్ని జిల్లా అద్దె వ్యవహారాల విభాగానికి సమర్పించాలి. ఈ విభాగానికి అద్దెను నిర్ణయించడం, సవరించడం వంటి అధికారాలు కూడా ఉంటాయి.

**ఢిల్లీలో నకిలీ దరఖాస్తులపై ఎఫ్ఐఆర్**

ప్రధాన మంత్రి (పట్టణ) ఇళ్ల పథకం కోసమంటూ నకిలీ దరఖాస్తులను వ్యాప్తి చేస్తున్న వ్యక్తులపై కేసు నమోదైంది. ఇళ్ల నిర్మాణం, పట్టణ వ్యవహారాల శాఖ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ కేసు పెట్టారు.

# ఉందిలే మంచి కాలం

- గ్రీన్‌కార్డు కోటా బిల్లుకు అమెరికా గ్రీన్ సిగ్నల్
- అమెరికాలోని భారతీయుల్లో హర్షాతిరేకాలు




అమెరికాలో శాశ్వత నివాసం కోసం కలలు కంటూ ఉద్యోగాల ఆధారిత గ్రీన్ కార్డు కోసం దశాబ్దాల తరబడి ఎదురుచూస్తున్న భారతీయులకు ఇది శుభవార్త. గ్రీన్‌కార్డులను ఒక్కో దేశానికి గరిష్టంగా ఏడు శాతం మాత్రమే మంజూరు చేయాలన్న కోటా పరిమితిని ఎత్తివేసే బిల్లుకి అమెరికా ప్రతినిధుల సభ బుధవారం ఆమోద ముద్ర వేసింది. 'ఫెయిర్‌నెస్ ఫర్ హై స్కిల్డ్ ఇమిగ్రెంట్స్ యాక్ట్ ఆఫ్ 2019 (హెచ్‌ఆర్ 1044)' బిల్లుకు సభలో అనూహ్యమైన మద్దతు లభించింది. మొత్తం 435 మంది సభ్యులకుగాను 365 మంది అనుకూలంగా ఓటు వేస్తే, 65 మంది వ్యతిరేకించారు. జోలాఫ్రెన్, కెన్‌బర్గ్‌లు గత ఫిబ్రవరిలో ప్రతినిధుల సభలో ప్రవేశపెట్టిన ఈ బిల్లు ద్వారా కుటుంబాల ప్రాతిపదికన వలస వీసా కోటాను ఏడు నుంచి 15శాతానికి పెంచడంతో వలసదారులకు భారీగా ఊరట లభిస్తోంది. సెనేట్‌లోనూ ఈ బిల్లుకి ఆమోద ముద్ర పడాల్సి ఉంది. గ్రీన్ కార్డు బిల్లు కాంగ్రెస్ ఆమోదం పొందితే భారత్ వంటి దేశాల నుంచి తక్కువ వేతనాలకే నిపుణులైన ఉద్యోగుల్ని అమెరికా కంపెనీలు నియమిస్తాయని, దీని వల్ల అమెరికాలో మధ్యతరగతికి ఎక్కువగా నష్టం జరుగుతుందని బిల్లును వ్యతిరేకిస్తున్న వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**మనోళ్లకే భారీగా ప్రయోజనం**

గ్రీన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో భారతీయులే 6 లక్షల మందికి పైగా నిరీక్షణ జాబితాలో ఉన్నారు. ప్రస్తుతం ఉన్న వలస విధానమే కొనసాగితే ఇండియా వంటి అధిక జనాభా కలిగిన దేశాల వారు గ్రీన్ కార్డు కోసం 151 ఏళ్లు ఎదురు చూడాల్సి వస్తుందని క్యాటో ఇనిస్టిట్యూట్ వంటి సంస్థలు అంచనా వేశాయి. అధికంగా గ్రీన్‌కార్డు లభించిన దేశాల్లో చైనా ముందుంది. బిల్లు చట్టంగా మారితే 3 లక్షల మంది భారతీయులకు ప్రయోజనం చేకూరనుంది. దరఖాస్తు చేసుకున్న భారతీయుల్లో ఇప్పటివరకు ప్రతిఏటా 25శాతం మందికే గ్రీన్ కార్డులు మంజూరవుతూ వచ్చాయి.

## ఓ భార్య కల ఫలించిన వేళ

రెండేళ్ల క్రితం అమెరికాలోని కన్సాస్‌లో జాతి వివక్షకు బలైపోయిన తెలంగాణ టెక్కీ కూచిభట్ల శ్రీనివాస్ భార్య సునయన గ్రీన్‌కార్డు బిల్లుకి గట్టిగా మద్దతు కూడగట్టడంలో విజయం సాధించారు. 2017 ఫిబ్రవరిలో కన్సాస్ రెస్టారెంట్‌లో శ్రీనివాస్‌ను కొందరు దుండగులు కాల్చి చంపిన విషయం తెలిసిందే. భర్త మరణించాక కూడా అమెరికాలోనే ఉండాలనుకున్న సునయన దూమల ఎన్నో కష్టనష్టాలు అనుభవించారు. తాత్కాలిక వీసా మీదే ఆమె ఇన్నాళ్లూ అమెరికాలో ఉంటూ పనిచేస్తున్నారు. ఈ వీసాల కోసం కంపెనీ యాజమాన్యాల దయాదాక్షిణ్యాల మీదే భారతీయులు ఆధారపడాల్సిన పరిస్థితి. దీంతో గ్రీన్‌కార్డు బిల్లు చట్టరూపం దాల్చడానికి సునయన తన వంతు ప్రయత్నాలు చేశారు. పలుమార్లు వాషింగ్టన్ వెళ్లి న్యాయ నిపుణులతో, ప్రవాస భారతీయ సంఘాలతో సంప్రదింపులు జరిపారు.

# సాక్షి బిజినెస్

శుక్రవారం
12-7-2019

WWW.SAKSHIBUSINESS.COM


## స్టాక్ మార్కెట్లు

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 266 ▲ | 84 ▲ |
| 38,823 | 11,583 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు** (తొలి రెండు రాత్రి 11.30గం॥లకు)

| సూచీ | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 8,188 | ▼ | 14 |
| డోజోన్స్ | 26,987 | ▲ | 126 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,510 | ▼ | 21 |
| డాక్స్ | 12,332 | ▼ | 41 |
| షాంఘై | 2,918 | ▲ | 2 |
| నికాయ్ | 21,643 | ▲ | 110 |

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | | | ● కొనుగోలు | ● అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | థామస్‌కుక్ | 67.35 | 70.96 |
| £ | బ్రిటన్ పౌండ్ | థామస్‌కుక్ | 84.70 | 89.65 |
| € | యూరో | థామస్‌కుక్ | 76.01 | 80.46 |
| ¥ | జపాన్ ఎన్ (100) | థామస్‌కుక్ | 61.00 | 67.00 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | థామస్‌కుక్ | 47.20 | 50.27 |
| SS | సింగపూర్ డాలర్ | థామస్‌కుక్ | 49.64 | 52.71 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 17.65 | 19.36 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.07 | 19.58 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.39 | 10.75 |

## ఈ-కామర్స్‌లోకి బ్యాంక్ ఆఫ్ బరోడా

### బ్యాంకింగ్, వ్యవసాయ ఉత్పత్తుల కోసం ప్రత్యేక ప్లాట్‌ఫాం

**న్యూఢిల్లీ:** ప్రభుత్వ రంగ బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ) తాజాగా ఈ–కామర్స్ వ్యాపార విభాగంలోకి అడుగుపెడుతోంది. తమ ఖాతాదారులకు వివిధ రకాల బ్యాంకింగ్ సేవలు, వ్యవసాయ ఆధారిత ఉత్పత్తులను అందించడానికి ప్రత్యేకంగా 'డిజిటల్ కామర్స్ పోర్టల్' ఏర్పాటు చేస్తోంది. ఈ డిజిటల్ ప్లాట్‌ఫాం ఏర్పాటు చేయడంలోను, నిర్వహించడంలోనూ తోడ్పాటు అందించే సంస్థల నుంచి బిడ్స్‌ను ఆహ్వానిస్తున్నట్లు గురువారం ప్రకటించింది. బిడ్ల దాఖలుకు జూలై 26 ఆఖరు తేది. అనలిటిక్స్ ఉపయోగించి కస్టమర్లు ఏం కోరుకుంటున్నారో తెలుసుకోవడం, వివిధ ఉత్పత్తులను విక్రయించేందుకు అవసరమైన వ్యవస్థను ఏర్పాటు చేయడం, డిజిటల్ సెక్యూరిటీ నిర్వహణ, పబ్లిసిటీ నిర్వహణ తదితర బాధ్యతలు ఆన్‌లైన్ ప్లాట్‌ఫాం పార్ట్‌నర్‌కు ఉంటాయి. ఇక వ్యవసాయ విభాగంలో పంట రుణాలు, వ్యవసాయ పరికరాలు, ఎరువులు మొదలైన ఉత్పత్తులను అందించాలని బ్యాంక్ భావిస్తోంది. వీటితో పాటు బంగారంపై రుణాలు, బీమా పథకాలు, పెట్టుబడి సాధనాలు వంటివి కూడా అందించనుంది. బిడ్ దక్కించుకునే సంస్థ ఇందుకు అవసరమైన విధంగా పోర్టల్‌ను రూపొందించాల్సి ఉంటుంది. అలాగే, ఈ పోర్టల్ ద్వారా విక్రయాలు జరిపే వ్యాపార సంస్థలకు కూడా కేటలాగ్ నిర్వహణ, ధరలు, ప్రచారం వంటి విషయాల్లో కూడా తోడ్పాటు అందించాల్సి ఉంటుంది.




## హోండా 'డబ్ల్యూఆర్-వీ' కొత్త వేరియంట్

### ప్రారంభ ధర రూ.9.95 లక్షలు




**న్యూఢిల్లీ:** ప్రముఖ వాహన తయారీ కంపెనీ 'హోండా కార్స్ ఇండియా' (హెచ్‌సీఐఎల్) తాజాగా తన స్పోర్ట్స్ యుటిలిటీ వాహన శ్రేణిలో నూతన వేరియంట్‌ను గురువారం మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. డబ్ల్యూఆర్‌లో 'వీ' గ్రేడ్‌ను విడుదలచేసింది. డబ్ల్యూఆర్–వీ, వీఎక్స్, ఎస్ పేర్లతో అందుబాటులోకి వచ్చిన ఈకారు ప్రారంభ ధర రూ.9.95 లక్షలుగా కంపెనీ ప్రకటించింది. డీజిల్ ఇంజిన్ కలిగిన ఈ నూతన వేరియంట్‌లో ప్రీమియం ఎక్స్‌టీరియర్ ఫీచర్లు ఉన్నట్లు వివరించింది. ఫ్రంట్ ఫాగ్ లాంప్స్, పొజిషన్ లాంప్స్, గన్ మెటల్ ఫినిష్ మల్టీ–స్పోక్ అల్లాయ్ వీల్, హెడ్‌ల్యాంప్ ఇంటిగ్రేటెడ్ సిగ్నేచర్ ఎల్ఈడీ డేటైమ్ రన్నింగ్ లైట్స్ (డీఆర్ఎల్) వంటి అధునాతన బాహ్య ఫీచర్లతో పాటు.. వెనుక పార్కింగ్ సెన్సర్లు, ప్యాసింజర్ సీట్ బెల్ట్ రిమైండర్, హై స్పీడ్ అలర్ట్, స్పీడ్ సెన్సింగ్ ఆటో డోర్ లాక్ వంటి భద్రత ఫీచర్లు ఉన్నట్లు పేర్కొంది. ఈ సందర్భంగా సీనియర్ వైస్ ప్రెసిడెంట్, డైరెక్టర్ (సేల్స్ అండ్ మార్కెటింగ్) రాజేష్ గోయల్ మాట్లాడుతూ.. 'నూతన వేరియంట్‌కు జోడించిన అధునాతన ఫీచర్లను మా వినియోగదారులు ఆదరిస్తారని భావిస్తున్నాం' అని అన్నారు.

## గూగుల్ మ్యాప్స్‌లో డైనింగ్ ఆఫర్లు

**న్యూఢిల్లీ:** భారతీయ యూజర్స్ కోసం గూగుల్ మ్యాప్స్ తాజాగా మరో మూడు ఫీచర్స్ ప్రవేశపెట్టింది. 11 నగరాల్లోని స్థానిక హోటళ్లలో డీల్స్‌ను తెలుసుకునేందుకు ఉపయోగపడే ఆఫర్ ఫీచర్ వీటిలో ఉంది. హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, బెంగళూరు, పుణె మొదలైనవి ఈ జాబితాలో ఉన్నాయి. ఈజీడైనర్ సంస్థతో కలిసి 'ఆఫర్' ఫీచర్ అందిస్తున్నట్లు గూగుల్ వెల్లడించింది. దీనితో 4,000 పైచిలుకు రెస్టారెంట్స్‌లో ఆఫర్స్ గురించి తెలుసుకోవచ్చు. ఎక్స్‌ప్లోర్ ట్యాబ్‌లో ఆఫర్స్ షార్ట్‌కట్‌ను క్లిక్ చేయడం ద్వారా ఈ ఫీచర్‌ను ఉపయోగించుకోవచ్చు. దీని కింద గురువారం మొదలు 15 రోజుల దాకా 1,500 పైచిలుకు రెస్టారెంట్లలో ఈజీడైనర్ ప్రత్యేక ప్రైమ్ ఆఫర్స్‌ను, కనీసం 25 శాతం డిస్కౌంట్‌ను కచ్చితంగా పొందవచ్చని గూగుల్ వివరించింది. ఇక దేశీ యూజర్స్ అభిరుచులకు అనుగుణంగా ఎక్స్‌ప్లోర్ ట్యాబ్‌ను తీర్చిదిద్దామని, ఇందులో కొత్తగా రెస్టారెంట్లు, పెట్రోల్ బంకులు, ఏటీఎంలు మొదలైన ఏడు విభాగాల షార్ట్‌కట్స్ చేర్చామని పేర్కొంది. అలాగే కొత్తగా ప్రవేశపెట్టిన 'ఫర్ యూ' ట్యాబ్ ద్వారా కొత్త రెస్టారెంట్లు, వార్తల్లో ఉన్న ప్రదేశాలు, యూజర్ల అభిరుచులకు అనుగుణంగా అందించే సిఫార్సులను పొందవచ్చని గూగుల్ పేర్కొంది.



## మెహుల్ చోక్సీ ఆస్తులు ఈడీ జప్తు



**న్యూఢిల్లీ:** పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో రూ.13,000 కోట్లకుపైగా రుణ ఎగవేతల కేసులో మెహుల్ చోక్సీకి చెందిన రూ.22.77 కోట్ల విలువైన ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గురువారం జప్తు చేసింది. దుబాయ్‌లో మూడు కమర్షియల్ అసెట్స్, మెర్సిడెజ్ బెంజ్ కారు, దేశ విదేశాల్లో బ్యాంక్ అకౌంట్లలో ఉన్న కొన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్లు జప్తు చేసిన వాటిలో ఉన్నాయి. అక్రమ ధనార్జనా నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద చోక్సీపై ఉత్తర్వులు జారీ అయినట్లు కూడా ఈ ఒక ప్రకటనలో తెలిపింది. తాజా చర్యలతో కలుపుకుంటే, మొత్తం రూ.2,535 కోట్ల చోక్సీ ఆస్తుల జప్తు జరిగింది.

## రుణ ప్రణాళికకు బ్యాంకర్లు ఓకే

### రిలయన్స్ ఇన్‌ఫ్రా వెల్లడి




**ముంబై:** దాదాపు రూ. 7,500 కోట్ల రుణాల పరిష్కార ప్రణాళికకు రుణదాతలు ఆమోదం తెలిపినట్లు అనిల్ అంబానీ సారథ్యంలోని రిలయన్స్ ఇన్‌ఫ్రా వెల్లడించింది. ఇందుకు సంబంధించిన ఇంటర్–క్రెడిటార్ ఒప్పందం (ఐసీఏ)పై రుణాలిచ్చిన మొత్తం 16 సంస్థలు సంతకాలు చేసినట్లు పేర్కొంది. ఆర్‌బీఐ కొత్త సర్క్యులర్ ప్రకారం రుణ గ్రహీత ఏ ఒక్క బ్యాంకుకైనా డిఫాల్ట్ అయిన పక్షంలో 30 రోజుల్లోగా మిగతా రుణదాతలు సదరు ఖాతాను సమీక్షించాల్సి ఉంటుంది. ఈ సమయంలో బ్యాంకులు నిర్దిష్ట పరిష్కార ప్రణాళికను నిర్ణయించి, ఐసీఏ కుదుర్చుకోవాలి. రుణ విలువలో దాదాపు 75 శాతం ఇచ్చిన రుణదాతలు, సంఖ్యాపరంగా 60 శాతం మంది రుణదాతలు .. పరిష్కార ప్రణాళికపై సంతకాలు చేయాల్సి ఉంటుంది. కన్సార్షియంలో మిగతా రుణదాతలు కూడా ఈ పరిష్కార ప్రణాళికకు కట్టుబడాల్సి ఉంటుంది. వివిధ అసెట్స్‌ను విక్రయించడం, లీజుకివ్వడం తదితర మార్గాల్లో నిధుల సమీకరణ ద్వారా నిర్దేశిత 180 రోజుల డెడ్‌లైన్ లోగానే పరిష్కార ప్రణాళికను అమలు చేయగలమని రిలయన్స్ ఇన్‌ఫ్రా ధీమా వ్యక్తం చేసింది.

# ఆప్టికల్ ఫైబర్‌కు '5జీ' జోష్!

**5జీ సేవలకు కీలకమైన ఓఎఫ్‌సీ నెట్‌వర్క్**

**దీంతో పెరుగుతున్న డిమాండ్...**

**2022 నాటికి 4 రెట్లు పెరగాలి**

**రూ. 1,80,000 కోట్ల పెట్టుబడులు కావాలి**



**న్యూఢిల్లీ:** హైస్పీడ్ ఇంటర్నెట్ అందించే 5జీ సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు కీలకమైన ఆప్టికల్ ఫైబర్ కేబుల్స్ (ఓఎఫ్‌సీ)కు గణనీయంగా ప్రాధాన్యం పెరుగుతోంది. టెలికం శాఖ అంచనాల ప్రకారం 2018లో ఓఎఫ్‌సీ నెట్‌వర్క్ సుమారు 1.4–1.5 మిలియన్ కేబుల్ రూట్ కిలోమీటర్స్ మేర విస్తరించి ఉంది. ఇంటర్నెట్ విస్తృతిని మరింత పెంచే దిశగా ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరాలంటే 2022 నాటికి ఈ నెట్‌వర్క్‌కు దాదాపు నాలుగు రెట్లు అధికంగా 5.5 మిలియన్ కేబుల్ రూట్ కిలోమీటర్స్ మేర ఆప్టికల్ ఫైబర్ కేబుల్స్ వేయాల్సి ఉంటుంది. ఇందుకోసం ఏకంగా రూ. 1,80,000 కోట్ల స్థాయిలో పెట్టుబడులు అవసరం. టెలికం సంస్థలు ప్రధానంగా టవర్ల పెంపునకు అవసరమైన ఫైబర్ కేబుల్స్ వేయడంపైనే ముందుగా దృష్టి పెట్టాల్సి రానుండటంతో ఈ పెట్టుబడుల్లో సింహభాగం వాటా ప్రభుత్వమే భరించాల్సి రానుంది. 5జీ సేవలను ముందుగా పెద్ద నగరాల్లోనే ప్రవేశపెట్టే అవకాశం ఉండటంతో వచ్చే రెండు, మూడేళ్లలో టవర్స్ సంఖ్య 5,00,000 నుంచి 7,50,000కు పెంచుకోవాల్సిన అవసరం ఉందని సెల్యులార్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సీవోఏఐ) డైరెక్టర్ జనరల్ రాజన్ మాథ్యూస్ తెలిపారు. ఇందులో 70 శాతం టవర్స్‌కు అవసరమైన ఫైబర్ కేబుల్ వేయాలంటేనే దాదాపు రూ. 50,000 కోట్లు అవసరమని ఆయన పేర్కొన్నారు.

**ఓఎఫ్‌సీ అవసరమేంటంటే..**

ఇంత భారీ స్థాయిలో ఓఎఫ్‌సీ వినియోగించాల్సి రావడానికి ముఖ్యంగా కొన్ని కారణాలు ఉన్నాయి. సాధారణంగా 5జీ సేవలకు ఉపయోగపడే స్పెక్ట్రం చాలా శక్తిమంతమైనదే అయినా దాని పరిధి చాలా పరిమితంగా ఉంటుంది. దీంతో మరింత పెద్ద సంఖ్యలో టవర్స్ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. 4జీతో పోలిస్తే 5జీ కోసం 3 రెట్లు ఎక్కువగా టవర్స్ అవసరమవుతాయని ఓఎఫ్‌సీ తయారీ దిగ్గజం హిమాచల్ ఫ్యూచరిస్టిక్ చైర్మన్ మహేంద్ర నహతా తెలిపారు. ఇక రెండో కారణం విషయానికొస్తే.. ప్రస్తుతం వినియోగంలో ఉన్న టవర్లలో కేవలం 20% టవర్స్‌కి మాత్రమే ఫైబర్ కేబుల్స్ ఉపయోగిస్తున్నారు. 5జీ సేవలను సముచిత స్థాయిలో అందించాలంటే వచ్చే మూడేళ్లలో దీన్ని కనీసం 70 శాతానికి పెంచుకోవాల్సిన అవసరం ఉందని మాథ్యూస్ చెప్పారు. మరోవైపు, అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు భారత్‌లో ఏర్పాటు చేస్తున్న డేటా సెంటర్లకోసం కూడా ఓఎఫ్‌సీ అవసరం. ఇక రిలయన్స్ జియో ప్రకటించిన ఫైబర్ టు హోమ్ సర్వీసుల కోసం కూడా భారీ స్థాయిలో ఓఎఫ్‌సీ కావాల్సి ఉంటోంది. వచ్చే మూడేళ్లలో సుమారు 1,600 నగరాల్లో 7.5 కోట్ల మందికి టీవీ, వాయిస్, డేటా సేవలను అందించే దిశగా రిలయన్స్ జియో ప్రయత్నాలు చేస్తోంది. ఇవి కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో కూడా హై స్పీడ్ డేటా సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు జాతీయ బ్రాడ్‌బ్యాండ్ మిషన్ కింద కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన కార్యక్రమాన్ని అమలు చేసేందుకు కూడా ఓఎఫ్‌సీ చాలా కీలకం. తెలంగాణ వంటి కొన్ని రాష్ట్రాలు కూడా ప్రజలకు చౌక బ్రాడ్‌బ్యాండ్ అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాయి. తెలంగాణ ప్రభుత్వం టీ–ఫైబర్ పేరిట 12,700 పంచాయతీల్లో 2 కోట్ల జనాభాకు బ్రాడ్‌బ్యాండ్‌ను అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం చేస్తోంది.

### చాలా సవాళ్లున్నాయ్..

ఓఎఫ్‌సీకి ఇంత భారీ డిమాండ్ ఉన్నప్పటికీ టెల్కోలు కేబుల్ వేయడంలో టెల్కోలు అనేక సవాళ్లు ఎదుర్కొంటున్నాయి. రహదారులను తవ్వి కేబుల్స్ వేయాలంటే చాలా వ్యయాలతో కూడుకున్నదిగాను, మున్సిపాలిటీల నుంచి అనుమతులు పొందటం కష్టతరంగాను ఉంటోందని టెలికం వర్గాలు తెలిపాయి. ముంబై వంటి నగరాల్లో ఓఎఫ్‌సీ వేయాలంటే కిలోమీటరుకు రూ. 1 కోటి పైగా వ్యయం అవుతుందని వివరించాయి. అండర్‌గ్రౌండ్‌లో ఓఎఫ్‌సీ వేసేందుకు అయ్యే మొత్తం ఖర్చులో కేబుల్ ఖరీదు 15 శాతం కూడా దాటదని పేర్కొన్నాయి. ఇక ఇప్పటికే భారీ రుణభారంతో సతమతమవుతున్న టెల్కోలకు మళ్లీ ఖరీదైన 5జీ స్పెక్ట్రంను కొనుగోలు చేయడానికి, ఫైబర్ వేయడానికి కావాల్సిన నిధులు ఎక్కడ నుంచి వస్తాయన్న సందేహాలూ నెలకొన్నాయి. మూడు దిగ్గజ టెల్కోలు తమ నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు ఈ ఏడాది దాదాపు రూ. 1,00,000 కోట్లు వ్యయం చేస్తున్నాయి. ఇవి మళ్లీ ఫైబర్ కోసం మరో రూ. 15,000 కోట్లు ఖర్చు చేయగలవా అన్నది ప్రశ్నార్థకంగా మారిందని నిపుణులు అభిప్రాయపడ్డారు. అటు ప్రభుత్వానికి కూడా ప్రస్తుత పరిస్థితుల్లో ఓఎఫ్‌సీపై భారీ పెట్టుబడులు పెట్టడం సాధ్యం కాకపోవచ్చని పేర్కొన్నారు.

## రుణాల విషయంలో జాగ్రత్తగా ఉంటాం

- కొన్ని విభాగాల్లో కొత్త సమస్యలు
- యాక్సిస్ బ్యాంకు ఎండీ చౌదరి

**ముంబై:** ఆర్థిక వ్యవస్థలో కొత్త సమస్యలు కనిపిస్తున్నాయని, దీంతో రుణాల పంపిణీ విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని నిర్ణయించినట్టు యాక్సిస్ బ్యాంకు ఎండీ అమితాబ్ చౌదరి అన్నారు. ఒకవైపు అధిక ఎన్‌పీఏల సమస్య నుంచి బ్యాంకులు బయటపడుతూ, రుణాల జారీ నిదానించిన సమయంలోనే ఆయన నుంచి ఈ వ్యాఖ్యలు రావడం గమనార్హం. ''ఆర్థిక రంగంలో ఏర్పడుతున్న పరిణామాలతో ఒత్తిళ్లకు సంబంధించి కొత్త సంకేతాలు కనిపిస్తున్నాయి. దీంతో మేము జాగ్రత్తగా ఉన్నాం'' అని అమితాబ్ చౌదరి ముంబైలో మీడియాతో అన్నారు. కొత్త విభాగాల్లో ఒత్తిళ్ల గురించి చౌదరి మాట్లాడుతూ... రియల్ ఎస్టేట్, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీ) ఈ రెండు విభాగాలు తమకు ఆందోళన కలిగిస్తున్నట్టు చెప్పారు. అయితే, వీటిల్లో చాలా కంపెనీలు మంచి స్థితిలోనే ఉన్నట్టు ఆ వెంటనే ఆయన పేర్కొన్నారు. ''మేం మరీ రిస్క్ చేయదలుచుకోవడం (కన్జర్వేటివ్) లేదు. మా రిస్క్ నిర్వహణ విధానాలు సరిగ్గా ఉండాలనుకుంటున్నాం'' అని చౌదరి వివరించారు. అయితే, యాక్సిస్ బ్యాంకు తన ప్రధాన వ్యాపారమైన రిస్క్ తీసుకుని, రుణాలను ఇవ్వడాన్ని బాగా తగ్గించుకుంటుందని భావించొద్దంటూ స్పష్టతనిచ్చారు. ఎన్‌బీఎఫ్‌సీ రంగంలో ఒత్తిళ్ల గురించి మాట్లాడుతూ... ఏడాది అవుతున్నా ఇంత వరకు పరిష్కారం లభించలేదని, కొన్ని కంపెనీలు మంచిగానే పనిచేస్తున్నందున ఈ విషయంలో సూక్ష్మ పరిశీలన అవసరమన్నారు. ఇది వ్యవస్థాపరమైన అంశంగా మారుతుందని తాను భావించడం లేదని, ఇబ్బందులను అధిగమించేందుకు వ్యవస్థకు సమయం పడుతుందన్నారు. కొన్ని కంపెనీలకు త్వరితంగా ఈక్విటీ నిధుల అవసరం ఉందని పేర్కొన్నారు. బ్యాంకు సొంతంగా రుణాల జారీకే ప్రాధాన్యమిస్తుందని, అదే సమయంలో ఎన్‌బీఎఫ్‌సీ పోర్ట్‌ఫోలియో కొనుగోలు అవకాశాలను కూడా పరిశీలిస్తుందని చెప్పారు.



## భూముల అమ్మకంతో బీఎస్ఎన్ఎల్‌కు ఊపిరి!

- అమ్మదగిన భూముల గుర్తింపు
- విలువ రూ.20,000 కోట్లుగా అంచనా




**న్యూఢిల్లీ:** తీవ్ర రుణ భారంతో ఉన్న ప్రభుత్వరంగ టెలికం సంస్థ బీఎస్ఎన్ఎల్, దేశవ్యాప్తంగా తన అధీనంలో ఉన్న భూముల విక్రయంపై దృష్టి సారించింది. ఈ భూముల విలువ రూ.20,000 కోట్లు ఉంటుందని అంచనా. విక్రయించాల్సిన భూముల జాబితాను పెట్టుబడులు, ప్రజా ఆస్తుల నిర్వహణ విభాగానికి (దీపమ్) పంపింది. ఏటేటా ఆదాయాలు పడిపోతూ, నష్టాలు పెరిగిపోతున్న క్లిష్ట పరిస్థితుల్లో... భూములు, మొబైల్ టవర్లు, ఫైబర్ నెట్‌వర్క్ విక్రయం ద్వారా వచ్చే నిధులతో సంక్షోభం నుంచి బయటపడాలని సంస్థ భావిస్తోంది. దేశవ్యాప్తంగా 32.77 లక్షల చదరపు మీటర్ల విస్తీర్ణంలో భవనాలు, ఫ్యాక్టరీలు ఉండగా, 31.97 లక్షల చదరపు మీటర్ల విడి భూమి ఉందని గతంలో బీఎస్ఎన్ఎల్ కార్పొరేట్ కార్యాలయం జారీ చేసిన సర్క్యులర్ ఆధారంగా తెలుస్తోంది. ఇలా వినియోగంలో లేని భూమి పారదర్శక విలువ 2015 ఏప్రిల్ 1కి రూ.17,397 కోట్లు కాగా, ప్రస్తుత విలువ రూ.20,296 కోట్లుగా ఉంటుందని అంచనా. 2014–15 ద్రవ్యోల్బణ సూచీ వ్యయం ఆధారంగా ఈ విలువకు రావడం జరిగినట్టు బీఎస్ఎన్ఎల్ ఉత్తర్వులు తెలియజేస్తున్నాయి. అమ్మి, సొమ్ము చేసుకోవాలనుకుంటున్న వాటిల్లో ముంబై, కోల్‌కతా, పశ్చిమబెంగాల్, ఘజియాబాద్‌లోని బీఎస్ఎన్ఎల్ టెలికం ఫ్యాక్టరీలు, వైర్‌లెస్ స్టేషన్లు, ఇతర కార్యాలయ భవనాలు, ఉద్యోగుల కాలనీలు కూడా ఉన్నాయి. 2018–19 ఆర్థిక సంవత్సరానికి బీఎస్ఎన్ఎల్ రూ.14,000 కోట్ల నష్టాలను ప్రకటించొచ్చని భావిస్తున్నారు. ఆదాయం రూ.19,308 కోట్లుగా ఉండొచ్చని టెలికం మంత్రి రవిశంకర్ ప్రసాద్ ఇటీవల లోక్‌సభకు ఇచ్చిన సమాధానం ఆధారంగా తెలుస్తోంది.

## ఎయిరిండియాను అమ్మేసినా దేశీ సంస్థల చేతుల్లోనే



**న్యూఢిల్లీ:** భారీ రుణభారంతో కుంగుతున్న ప్రభుత్వ రంగ విమానయాన సంస్థ ఎయిరిండియాలో వాటాల వ్యూహాత్మక విక్రయానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పౌర విమానయాన శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి తెలిపారు. అయితే, వాటాలు విక్రయించినప్పటికీ ఎయిరిండియా భారతీయుల చేతుల్లోనే ఉండాలని కేంద్రం భావిస్తోందని ఆయన చెప్పారు. గతంలో ఎయిరిండియా డిజిన్వెస్ట్‌మెంట్ కోసం చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయని, ఈ నేపథ్యంలో ఇందుకోసం ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తున్నామని మంత్రి వివరించారు. ఎయిరిండియా పనితీరు చాలా బాగా ఉందని, కాకపోతే అధిక రుణభారం, వడ్డీలే పెద్ద సమస్యగా మారాయని గురువారం లోక్‌సభలో ఆయన చెప్పారు. 'ఎయిరిండియా ఒక అత్యుత్తమ అసెట్‌లాంటిది. దానికి 125 విమానాలు ఉన్నాయి. దాదాపు సగం విమానాలు 40 అంతర్జాతీయ రూట్లలో, 80 విమానాలు దేశీయంగా వివిధ రూట్లలో నడుస్తున్నాయి. కంపెనీ పనితీరు చాలా బాగుంది. కానీ మోయలేనంత రుణభారమే పెద్ద సమస్య. ఆ రుణాలపై భారీగా వడ్డీలు కట్టాల్సి వస్తుండటం మరో సమస్య' అని పురి వివరించారు. దేశీ విమానయాన మార్కెట్ క్షీణిస్తోందన్న వార్తలన్నీ అపోహలేనని ఆయన కొట్టి పారేశారు. వాస్తవానికి ఇది 17 శాతం వార్షిక వృద్ధి నమోదు చేస్తోందని చెప్పారు.

## కళ్యాణి రఫేల్‌కు భారీ కాంట్రాక్టు

- రఫేల్ నుంచి రూ.685 కోట్ల ఆర్డరు
- తెలంగాణలో మరో ప్లాంటు
- కళ్యాణి గ్రూప్ చైర్మన్ బాబా కళ్యాణి వెల్లడి




(పిని యంగ్‌మన్ నుంచి ఆర్డరు పత్రాలను స్వీకరిస్తున్న బాబా కళ్యాణి)

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** కళ్యాణి రఫేల్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ భారీ కాంట్రాక్టును చేజిక్కించుకుంది. ఇజ్రాయెల్‌కు చెందిన రఫేల్ నుంచి సుమారు రూ.685 కోట్ల విలువైన ఆర్డరును దక్కించుకుంది. ఇందులో భాగంగా బరాక్–8 మీడియం రేంజ్ సర్ఫేస్ టు ఎయిర్ మిస్సైల్ కోసం 1,000 కిట్లను సరఫరా చేయాల్సి ఉంటుంది. వీటిని రఫేల్.. బీడీఎల్‌కు అప్పగిస్తుంది. బీడీఎల్‌లో తుదిమెరుగులు దిద్దుకుని ఇండియన్ ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్‌కు చేరతాయి. గురువారమిక్కడ జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రఫేల్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ పిని యంగ్‌మన్ చేతుల మీదుగా కళ్యాణి గ్రూప్ చైర్మన్ బాబా కళ్యాణి ఈ మేరకు ఆర్డరు పత్రాలను అందుకున్నారు. రఫేల్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, కళ్యాణి గ్రూప్ సంయుక్తంగా కళ్యాణి రఫేల్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్‌ను ఏర్పాటు చేశాయి. హైదరాబాద్‌లోని శంషాబాద్ వద్ద ఈ కంపెనీకి తయారీ కేంద్రం ఉంది. 2017 ఆగస్టులో ఈ ప్లాంటు ప్రారంభమైంది.

**మరో తయారీ కేంద్రం..**

హైదరాబాద్ సమీపంలో మరో తయారీ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్టు బాబా కళ్యాణి వెల్లడించారు. ఇందుకోసం తెలంగాణ ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నట్టు పేర్కొన్నారు. ఎంత పెట్టుబడి, ఏ సమయంలోగా పూర్తి అవుతుందో ఇప్పుడే చెప్పలేనని వివరించారు. అయితే 100 ఎకరాలు అవసరమవుతాయని తెలిపారు. భారత్‌తోపాటు పొరుగు దేశాలకు ఇక్కడి నుంచి ఉత్పత్తులను సరఫరా చేస్తామన్నారు. దేశీయంగా తయారీకి అవసరమైన టెక్నాలజీని రఫేల్ సమకూరుస్తోందని చెప్పారు. ప్రైవేటు రంగంలో కళ్యాణి రఫేల్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ భారత్‌లో తొలి మిస్సైల్ తయారీ కేంద్రమని పిని యంగ్‌మన్ గుర్తు చేశారు. ఇక్కడి కేంద్రంలో ఇంటర్‌సెప్టార్స్, మిస్సైల్స్, డిఫెన్స్ సిస్టమ్స్ తయారు చేస్తున్నట్టు తెలిపారు. కాగా, రూ.3,400 కోట్ల విలువైన స్పైక్ యాంటీ ట్యాంక్ మిసైల్స్‌ను రఫేల్ నుంచి కొనుగోలు చేయాలని భారత ప్రభుత్వం భావిస్తోంది. అయితే ఈ డీల్ రద్దు అయినట్టు వస్తున్న వార్తల్లో నిజమెంత అని పినియంగ్‌మన్‌ను సాక్షి బిజినెస్ బ్యూరో ప్రతినిధి ప్రశ్నించగా.. దీనిపై స్పందించేందుకు ఆయన నిరాకరించారు.

## హైదరాబాద్‌లో ఎస్అండ్‌పీ గ్లోబల్ రెండో సెంటర్

S&P Global

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** అనలిటిక్స్, డేటా సర్వీసుల రంగంలో ఉన్న ఎస్అండ్‌పీ గ్లోబల్ హైదరాబాద్‌లో కొత్త 'ఓరియన్' కార్యాలయాన్ని ప్రారంభించింది. లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో నెలకొన్న ఈ కేంద్రానికి రూ.70 కోట్ల మొత్తాన్ని ఖర్చు చేశామని కంపెనీ ఇండియా ఎండీ అభిషేక్ తోమర్ గురువారమిక్కడ మీడియాకు తెలిపారు. 700 మంది సపోర్ట్ సిబ్బంది ఓరియన్‌లో ఉన్నారని చెప్పారు. ఇప్పటికే ఎస్అండ్‌పీ గ్లోబల్‌కు హైదరాబాద్‌లో 3 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో హైటెక్ సిటీ వద్ద ఒక కార్యాలయం ఉంది. ఇందులో 3,500 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. ఇంతే స్థాయిలో అత్యాధునిక వసతులతో నూతన కార్యాలయం ఏర్పాటు చేస్తామని అభిషేక్ వెల్లడించారు. హైటెక్ సిటీ కార్యాలయం నుంచి ఈ సెంటర్‌కు కార్యకలాపాలను బదిలీ చేస్తామన్నారు. ఓరియన్ సెంటర్ కొనసాగుతుందని ఆయన ఈ సందర్భంగా వివరించారు. అహ్మదాబాద్, గురుగ్రామ్‌తోసహా భారత్‌లో కంపెనీ ఉద్యోగుల సంఖ్య సుమారు 8,000.

# మొబైల్ 'రీసైక్లింగ్' 12 శాతమే!

- హైదరాబాద్ వినియోగదార్లపై 91 మొబైల్స్ సర్వే
- ఎలక్ట్రానిక్ వ్యర్థాలను పట్టించుకోని కస్టమర్లు
- ఇళ్లలో పేరుకుపోతున్న పాత మొబైల్ ఫోన్లు



**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** స్మార్ట్‌ఫోన్ వాడుతున్న హైదరాబాద్ కస్టమర్లలో 12% మంది మాత్రమే స్వచ్ఛందంగా తమ డివైస్‌ను రీసైక్లింగ్‌కు ఇస్తున్నారు. కొత్త మోడల్ కొంటున్న సమయంలో 9% మంది పాత ఫోన్‌ను విక్రేతకు ఇస్తున్నారని గ్యాడ్జెట్ డిస్కవరీ సైట్ 91మొబైల్స్.కామ్ సర్వేలో తేలింది. ఈ–వేస్ట్ కంపెనీ సెరెబ్రా గ్రీన్, మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీతో కలిసి ఈ పోర్టల్ సర్వే చేసింది. దేశవ్యాప్తంగా 15,000 పైచిలుకు స్మార్ట్‌ఫోన్ వినియోగదార్లు ఇందులో పాలుపంచుకున్నారు. దీని ప్రకారం... ఫోన్ రీసైక్లింగ్ వల్ల పర్యావరణానికి కలిగే ప్రయోజనాల గురించి 65% హైదరాబాద్ కస్టమర్లకు అవగాహన ఉంది. వీరిలో 20% మాత్రమే రీసైకిల్‌కు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. రీసైక్లింగ్ ప్రక్రియలో పాత మొబైల్స్ నుంచి పనికి వచ్చే విడిభాగాలను, ప్లాస్టిక్‌ను వేరు చేసి, కావాల్సిన కంపెనీలకు సరఫరా చేస్తారు. అలాగే పనికిరాని వ్యర్థాలను పర్యావరణానికి హాని కాని రీతిలో, భద్రమైన పద్ధతిలో నిర్వీర్యం చేస్తారు.

**ఇంట్లో పనికిరాని ఫోన్లు..**

వినియోగదార్ల ఇళ్లలో పనికిరాని ఫోన్లు ఓ మూలన పేరుకుపోతున్నాయి. అయిదుకుపైగా పనికిరాని ఫోన్లు తమ వద్ద ఉన్నాయని 12 శాతం మంది సర్వే సందర్భంగా తెలిపారు. అవసరానికి పనికి వస్తుందనే ఉద్దేశంతో కనీసం ఒక ఫోన్ (కండీషన్లో ఉన్న) అట్టిపెట్టుకుంటున్నట్టు 55 శాతం మంది వెల్లడించారు. పనికిరాని పాత ఫోన్ల రీసైక్లింగ్ విషయాన్ని పట్టించుకోవటం లేదని 16 శాతం మంది తేల్చిచెప్పారు. అమ్మకం ద్వారా ఆశించిన విలువ రాకపోవడం వల్లే పాత ఫోన్‌ను భద్రంగా దాచుకున్నట్టు 20.6 శాతం మంది అభిప్రాయపడ్డారు. 6.9 శాతం కస్టమర్లు రీసైకిల్‌కు వ్యతిరేకం. క్యాష్‌కు రీసైకిల్ చేసినవారు 58% మంది ఉన్నారు. డిస్కౌంట్ కూపన్లకు 17 శాతం, గిఫ్ట్ కార్డులకు 5.4 శాతం మంది తమ పాత ఫోన్లను ఎక్స్ఛేంజ్ ద్వారా రీసైకిల్ చేశారు.

**టాప్–5లో భారత్..**

ప్రపంచ వ్యాప్తంగా ఎలక్ట్రానిక్ వ్యర్థాలు పర్యావరణానికి రోజురోజుకీ సమస్యగా మారుతున్నాయి. ఇందులో స్మార్ట్‌ఫోన్లు ప్రధానమైనవి. ఎలక్ట్రానిక్ వ్యర్థాలు జమవుతున్న దేశాల్లో భారత్ టాప్–5లో ఉంది. ఏటా 20 లక్షల టన్నుల ఈ–వేస్ట్ పోగవుతోంది. ఈ నేపథ్యంలో రీసైక్లింగ్ ఇక్కడ అత్యవసరమని 91మొబైల్స్.కామ్ కో–ఫౌండర్ నితిన్ మాథుర్ ఈ సందర్భంగా చెప్పారు. 'రోజురోజుకూ కొత్త స్మార్ట్‌ఫోన్ మోడళ్లు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. పనికిరాని స్మార్ట్‌ఫోన్లను పర్యావరణానికి హానికాని, భద్రమైన పద్ధతిలో ఏ విధంగా రీసైకిల్ చేయవచ్చో వినియోగదార్లకు వివరించాల్సిన అత్యవసర సమయం ఆసన్నమైంది. ఈ–వేస్ట్ వల్ల ఉత్పన్నమయ్యే పర్యావరణ సమస్యల గురించి 65 శాతం మంది హైదరాబాద్ స్మార్ట్‌ఫోన్ యూజర్లకు తెలుసు. అయినప్పటికీ వారు తమ మొబైల్ ఫోన్లను రీసైకిల్ చేయాలని భావించడం లేదు. ఈ–వేస్ట్ వల్ల తలెత్తే సమస్యల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలను చేపడుతున్నాం. అలాగే అవసరం లేని ఉత్పత్తులను ఎక్కడ రీసైకిల్, విక్రయించాలో తెలియజేస్తున్నాం' అని వివరించారు.

# ‘ఫెడ్’ రేట్ల కోత లాభాలు

- కలిసివచ్చిన షార్ట్ కవరింగ్ కొనుగోళ్లు
- నాలుగు రోజుల నిఫ్టీ నష్టాలకు బ్రేక్
- 84 పాయింట్లు పెరిగి 11,583 వద్ద ముగింపు
- 266 పాయింట్ల లాభంతో 38,823 వద్దకు సెన్సెక్స్

రేట్ల కోతకు సుముఖంగానే ఉన్నామంటూ అమెరికా ఫెడరల్ రిజర్వ్ సంకేతాలివ్వడంతో ప్రపంచ మార్కెట్లు లాభపడ్డాయి. మన మార్కెట్ కూడా గురువారం లాభపడింది. దీంతో మూడు రోజుల సెన్సెక్స్ నష్టాలకు, నాలుగు రోజుల నిఫ్టీ నష్టాలకు బ్రేక్ పడింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ పుంజుకోవడం, ఇటీవల నష్ట పోయిన షేర్లలో షార్ట్ కవరింగ్ కొనుగోళ్లు జరగడం సానుకూల ప్రభావం చూపించాయి. ఇంట్రాడేలో 335 పాయింట్ల వరకూ లాభపడ్డ సెన్సెక్స్ చివరకు 266 పాయింట్ల లాభంతో 38,823 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 84 పాయింట్లు పెరిగి 11,583 పాయింట్ల వద్దకు చేరింది. ముడి చమురు ధరలు పెరగడంతో లాభాలు తగ్గాయి.




**రోజంతా లాభాలే....:** ఆర్థిక వ్యవస్థ మందగమనంగా ఉన్న నేపథ్యంలో తగిన విధంగా స్పందిస్తామంటూ, రేట్ల కోత విషయంలో అమెరికా ఫెడరల్ రిజర్వ్ చైర్మన్ జెరోమీ పావెల్ సానుకూలంగా వ్యాఖ్యానించారు. దీంతో ఆసియా మార్కెట్లు లాభపడగా, యూరప్ మార్కెట్లు లాభాలతో ఆరంభమయ్యాయి. (చివరకు స్వల్ప నష్టాల్లో ముగిశాయి) ప్రపంచ మార్కెట్లు లాభపడటంతో మన మార్కెట్ కూడా లాభాల బాట పట్టింది. బడ్జెట్ దెబ్బల నుంచి మన మార్కెట్ ఇప్పుడిప్పుడే కోలుకుంటోందని, కంపెనీల ఆర్థిక ఫలితాలు, అంతర్జాతీయ ఈవెంట్స్‌పై మన మార్కెట్ దృష్టి పెడుతుందని విశ్లేషణ. లాభాల్లో ఆరంభమైన సెన్సెక్స్ రోజంతా అదే జోరు చూపించింది. అన్ని రంగాల షేర్లలో కొనుగోళ్లు జోరుగా సాగడంతో లాభాలు అంతకంతకూ పెరిగాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 335 పాయింట్లు, నిఫ్టీ 100 పాయింట్ల మేర లాభపడ్డాయి.

- హీరో మోటొకార్ప్ షేర్ సెన్సెక్స్‌లో భారీగా 4.4 శాతం లాభంతో రూ.2,507 వద్ద ముగిసింది.
- ప్రమోటర్ల మధ్య రగడ కారణంగా ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ షేర్ రెండో రోజూ నష్టపోయింది. బుధవారం 11 శాతం పతనమైన ఈ షేర్ గురువారం 3 శాతం నష్టంతో రూ.1,355 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 9 శాతం నష్టంతో రూ.1,273ను తాకింది.

**మంగళవారం స్టాక్ మార్కెట్ డేటా**

| | టర్నోవర్ (రూ. కోట్లలో) |
|---|---|
| బీఎస్ఈ | 1,973 |
| ఎన్ఎస్ఈ | 29,915 |
| ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్) | 19,43,857 |
| ఎఫ్ఐఐ | -317 |
| డీఐఐ | 720 |

## 68 దిశగా రూపాయి!

**14 పైసలు లాభంతో 68.44కు బలోపేతం**



**ముంబై:** రూపాయి 68 స్థాయిని చూసేఅవకాశాలు కనిపిస్తున్నాయి. ఇంటర్ బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్లో రూపాయి విలువ గురువారం 14 పైసలు లాభంతో 68.44 వద్ద ముగిసింది. అమెరికా సెంట్రల్ బ్యాంక్ ఫెడ్ ఫండ్ రేటు (ప్రస్తుతం 2.25 శాతం–2.50 శాతం) తగ్గే అవకాశం ఉందని సూచిస్తూ ఫెడ్ చైర్మన్ పావెల్ ఇచ్చిన ప్రకటన వర్ధమాన దేశాల మార్కెట్ కరెన్సీలకు ఊతం ఇచ్చింది. 68.31 ప్రారంభమైన రూపాయి, 68.30ని కూడా ఒక దశలో తాకింది. 68.48 కనిష్టాన్ని చూసి, చివరకు 68.44 వద్ద ముగిసింది. అక్టోబర్ 9వ తేదీన రూపాయి చరిత్రాత్మక కనిష్ట స్థాయి 74.39 వద్ద ముగిసింది.


## వేదాంత పెట్టుబడులు రూ.55,000 కోట్లు

**మూడేళ్ల ప్రణాళికలు వెల్లడించిన సంస్థ**

**ముంబై:** వేదాంత కంపెనీ మూడేళ్లలో రూ.55,000 కోట్ల మూలధన పెట్టుబడులు పెడుతోంది. ఈ పెట్టుబడులు పూర్తయితే, తమ ఆదాయం 60–70% మేర పెరుగుతుందని వేదాంత తెలిపింది. 2018–19లో రూ.10,000 కోట్ల మూలధన పెట్టుబడులు పెట్టామని కంపెనీ 54వ వార్షిక సాధారణ సమావేశంలో చైర్మన్ నవీన్ అగర్వాల్ తెలిపారు.

**అంతర్గత నిధులే:** మూడేళ్లలో చమురు, గ్యాస్ రంగంలో రూ.25,000 కోట్లు పెట్టుబడులు పెట్టనున్నామని నవీన్ అగర్వాల్ తెలిపారు. జింక్ కోసం రూ.25,000 కోట్లు, అల్యూమినియమ్ కోసం రూ.20,000 కోట్ల మేర పెట్టుబడులు పెట్టనున్నామని పేర్కొన్నారు. ఈ నిధులన్నింటినీ అంతర్గతంగానే సమకూర్చుకుంటామని, ఎలాంటి రుణాలు చేయబోమని తెలిపారు. కమోడిటీ ధరలు పెరగడం, తగ్గడం సహజమేనని పేర్కొన్నారు.

## అయిదు దేశాల్లో క్యూబ్ వెల్త్



**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** వెల్త్ క్రియేషన్ సేవల్లో ఉన్న క్యూబ్ వెల్త్ కార్యకలాపాలకు ఏడాది పూర్తి అయింది. 5 దేశాలకు విస్తరించిన ఈ కంపెనీ భారత్‌లో హైదరాబాద్ సహా 26 నగరాల్లో అడుగుపెట్టింది. సంపన్నులు, వృత్తి నిపుణులు, ఉద్యోగులకు విశ్వసనీయ ఇన్వెస్ట్‌మెంట్ వేదికగా నిలిచామని క్యూబ్ ఫౌండర్, సిట్రస్ పే వ్యవస్థాపకుడు సత్యేన్ కోఠారి తెలిపారు. కనీస పెట్టుబడి రూ.15,000 అని తెలిపారు. ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్లతోనూ కస్టమర్లు సంప్రదింపులు జరిపే వీలుంది.

## యాక్సిస్ బ్యాంక్, ఫ్లిప్‌కార్ట్ ‘కో-బ్రాండెడ్ క్రెడిట్ కార్డ్’

- ప్రతి కొనుగోలుపై 1.5 % క్యాష్‌బ్యాక్
- మర్చెంట్ షాపింగ్‌పై 5 శాతం

**ముంబై:** యాక్సిస్ బ్యాంక్, ఫ్లిప్‌కార్ట్‌ల కో–బ్రాండెడ్ క్రెడిట్ కార్డ్ అందుబాటులోకి వచ్చింది. ఈ నూతన కార్డు ద్వారా ఫ్లిప్‌కార్ట్, మింత్రాల్లో కొనుగోలుపై ఆఫర్లు పొందవచ్చు. ప్రతి కొనుగోలుపై 1.5 శాతం క్యాష్‌బ్యాక్, మర్చెంట్ షాపింగ్‌పై 5 శాతం క్యాష్ బ్యాక్ ఉన్నట్లు ఫ్లిప్‌కార్ట్ ప్రకటించింది. కార్డు కోసం జాయినింగ్ ఫీజు కింద రూ.500, వార్షిక రుసుము రూ.500 చెల్లించాల్సి ఉంటుందని, రూ.2 లక్షల క్రెడిట్ లిమిట్ ఉందని పేర్కొంది. మాస్టర్ కార్డ్ సేవల ఆధారంగా ఈ కార్డు పనిచేస్తోంది.




**శుక్రవారం బోర్డ్ మీటింగ్స్**

ఇన్ఫోసిస్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, కర్నాటక బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, టీఆర్ఎఫ్, హాత్‌వే కేబుల్స్, త్రివి ఇన్ఫోటెక్

**బులియన్** రూ.లలో

| | | |
|---|---|---|
| **ముంబై** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 35,600 | ▲ 630 |
| బంగారం (22 క్యారెట్లు) | 33,900 | ▲ 500 |
| వెండి (కిలో) | 41,300 | ▲ 300 |
| **చెన్నై** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 34,970 | ▲ 630 |
| బంగారం (22 క్యారెట్లు) | 33,300 | ▲ 600 |
| వెండి (కిలో) | 41,300 | ▲ 300 |
| **హైదరాబాద్** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 34,970 | ▲ 630 |
| బంగారం (22 క్యారెట్లు) | 33,300 | ▲ 600 |
| వెండి (కిలో) | 41,300 | ▲ 300 |
| **ప్రొద్దుటూరు** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 34,450 | ▲ 250 |
| బంగారం (22 క్యారెట్లు) | 31,850 | ▲ 160 |
| వెండి (కిలో) | 39,200 | ▲ 300 |
| **విశాఖపట్నం** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 35,650 | ▲ 350 |
| బంగారం (22 క్యారెట్లు) | 33,150 | ▲ 100 |
| వెండి (కిలో) | 38,500 | 0 |
| **ఏపీ బులియన్ అసోసియేషన్** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 35,920 | ▲ 570 |
| బంగారం (22 క్యారెట్లు) | 33,270 | ▲ 570 |
| వెండి (కిలో) | 41,300 | ▲ 300 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

**ముడిచమురు...** (బ్యారెల్)

| | | |
|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 60.39 రాత్రి 11.30కు | $60.43 బుధవారం ముగింపు |
| బ్రెంట్ | 66.71 రాత్రి 11.30కు | $67.01 బుధవారం ముగింపు |

**కోడిగుడ్లు** (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 12-7-2019

| | |
|---|---|
| విశాఖ | 444-00 |
| చిత్తూరు | 448-00 |
| వరంగల్ | 418-00 |
| చెన్నై | 455-00 |
| ముంబై | 470-00 |
| విజయవాడ | 415-00 |
| నమక్కల్ | 445-00 |
| గోదావరి | 415-00 |
| **11-7-2019 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 415-00 |
| రిటైల్ (ఒక గుడ్డుకు) | 4.75 |
| బెంగళూరు | 455-00 |
| కోల్‌కత్త | 451-00 |
| ఢిల్లీ | 395-00 |

## కే7 కంప్యూటింగ్ కస్టమర్లు 2.5 కోట్లు

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** సైబర్ సెక్యూరిటీ సేవలందిస్తున్న చెన్నై సంస్థ కే7 కంప్యూటింగ్ కస్టమర్ల సంఖ్య 2.5 కోట్లు దాటింది. భారత్‌లో ఈ కంపెనీకి ఒక కోటికిపైగా వినియోగదార్లు ఉన్నారు. జపాన్‌లో ఈ సంఖ్య 1.5 కోట్లు దాటిందని కే7 కంప్యూటింగ్ సీఈవో పురుషోత్తమన్ తెలిపారు. సైబర్ రిస్క్ మానిటర్ రిపోర్ట్‌ను విడుదల చేసిన సందర్భంగా వైస్ ప్రెసిడెంట్ సమీర్ కను మోడీతో కలిసి గురువారమిక్కడ మీడియాతో మాట్లాడారు. జపాన్‌లో సైబర్ సెక్యూరిటీ రంగంలో టాప్–2 కంపెనీగా నిలిచామన్నారు. ఇంటర్నెట్ ఆధారిత ఉత్పత్తులకు (ఐవోటీ) సెక్యూరిటీ సేవలను విస్తరిస్తామని చెప్పారు. సింగపూర్, మలేషియాతోపాటు ఇతర ఆసియా మార్కెట్లలో అడుగు పెడతామని వెల్లడించారు. కంపెనీలో ప్రస్తుతం 200 మంది ఉద్యోగులు ఉన్నారు. గతేడాది రూ.70 కోట్ల టర్నోవర్ సాధించింది. 2019–20లో రూ.100 కోట్లు ఆశిస్తోంది.

## విక్రయానికి రూ.309 కోట్ల ఎస్‌బీఐ ఎన్‌పీఏలు

**న్యూఢిల్లీ:** ఎస్‌బీఐ రూ.309 కోట్ల ఎన్‌పీఏలను వసూలు చేసుకునేందుకు గాను సంబంధిత ఖాతాలను విక్రయానికి పెట్టింది. రాజశ్రీ షుగర్స్ అండ్ కెమికల్స్ (రూ.226.94 కోట్లు), శ్రీ వైష్ణవి ఇస్పాత్ (రూ.82.52కోట్లు) ఖాతాలను విక్రయానికి ఉంచి, అస్సెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీలు, ఎన్‌బీఎఫ్‌సీలు తదితర సంస్థల నుంచి ఆసక్తి వ్యక్తీకరణలను ఆహ్వానించింది. ఈ నెల 22, 29వ తేదీల్లో ఈ ఎన్‌పీఏ ఖాతాలను వేలం వేయనుంది.

## మోగ్లిక్స్ 410 కోట్ల సమీకరణ

**న్యూఢిల్లీ:** బీటూబీ కామర్స్ సంస్థ మోగ్లిక్స్ సిరీస్–డి దశ కింద 60 మిలియన్ డాలర్లు (రూ.410 కోట్లు) సమీకరించినట్టు గురువారం ప్రకటించింది. టైగర్ గ్లోబల్, సీక్వోయా ఇండియా, కాంపోజిట్ క్యాపిటల్ తదితర సంస్థలు ఇన్వెస్ట్ చేసినట్టు తెలిపింది. కంపెనీలో ఇప్పటికే అస్సెల్ పార్ట్‌నర్స్, జంగిల్ వెంచర్స్, ఐఎఫ్‌సీ, వెంచర్ హైవే, టాటా సన్స్ గౌరవ చైర్మన్ రతన్‌టాటాలు వాటాదారులుగా ఉన్న విషయం గమనార్హం. పారిశ్రామిక పంపిణీ కేంద్రాలను దేశవ్యాప్తంగా ఏర్పాటు చేసేందుకు ఈ నిధులను వినియోగిస్తామని సంస్థ తెలిపింది.

## పెట్టుబడులకు అనుకూలం... శ్రీసిటీ మెగా పారిశ్రామికవాడ


**శ్రీసిటీ నమూనాను పరిశీలిస్తున్న కాన్సూల్ జనరల్ బృందం**

**శ్రీసిటీ సందర్శనలో మలేషియా కాన్సూల్ జనరల్**

**వరదయ్యపాలెం(చిత్తూరు జిల్లా):** నూతన పెట్టుబడులకు శ్రీసిటీ మెగా పారిశ్రామికవాడ ఎంతో అనుకూలమని మలేషియా కాన్సూల్ జనరల్ శరవణన్ కరతిహయాన్ అన్నారు. చెన్నైలోని మలేషియా కాన్సూల్ జనరల్ ట్రేడ్ కమిషనర్ ముజఫర్ షా అనాఫితో కలసి గురువారం శ్రీసిటీని సందర్శించారు. వీరికి శ్రీసిటీ ప్రెసిడెంట్ రమేష్ సుబ్రమణ్యం సెజ్ ప్రత్యేకతలు, పారిశ్రామిక ప్రగతిని వివరించారు. వీరి పర్యటన కారణంగా ఇరు దేశాల వ్యాపార సంబంధాలు మరింత బలపడడంతో పాటు శ్రీసిటీలో మరిన్ని పరిశ్రమల ఏర్పాటుకు పలువురు మొగ్గుచూపుతారని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్రసన్నా రెడ్డి తెలిపారు.

**ఎన్ఎస్ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు**

| కంపెనీ పేరు | ముగింపు ధర | క్రితం ముగింపు |
|---|---|---|
| ADANI PORT | 412.9 | 405 |
| ASIAN PAINT | 1332.45 | 1322.95 |
| AXIS BANK L | 766.4 | 769.25 |
| BAJAJ AUTO | 2711.7 | 2740.4 |
| BAJAJ FINSE | 7645.7 | 7658.2 |
| BAJAJ FINAN | 3451.05 | 3429.05 |
| BHARTI AIRT | 360.75 | 358.55 |
| BPCL | 350.55 | 349.6 |
| BRITANNIA I | 2765.15 | 2769.55 |
| CIPLA LTD | 552.4 | 544.95 |
| COAL INDIA | 234.9 | 233.35 |
| EICHER MOTO | 19034.15 | 18751 |
| GAIL (INDIA) | 147.45 | 144.95 |
| GRASIM INDU | 919.25 | 913.45 |
| HCL TECHNOL | 1020.8 | 1018.9 |
| HDFC LTD | 2261.9 | 2227.75 |
| HDFC BANK L | 2407.15 | 2388.75 |
| HERO MOTOCO | 2507.8 | 2400 |
| HINDALCO I | 198.45 | 193.65 |
| HUL | 1730.9 | 1718.6 |
| INDIABULLS | 672.15 | 659.6 |
| ICICI BANK | 426.55 | 430.9 |
| INDUSIND BA | 1541.25 | 1487.25 |
| BHARTI INFR | 264.9 | 259.95 |
| INFOSYS LIM | 721.5 | 717.25 |
| INDIAN OIL | 147.9 | 148.15 |
| ITC LTD | 275.65 | 273.15 |
| JSW STEEL L | 267.3 | 254.9 |
| KOTAK MAHIN | 1484.95 | 1475.85 |
| LARSEN & T | 1495.2 | 1499.55 |
| MAHINDRA &M | 634.15 | 621.65 |
| MARUTI SUZU | 6031.2 | 5927.9 |
| NTPC LTD | 128.95 | 129.05 |
| ONGC | 153.1 | 151.65 |
| POWER GRID | 208.6 | 205.3 |
| RIL | 1281.55 | 1278.85 |
| SBI | 363.2 | 354.2 |
| SUN PHARMAC | 398.15 | 392.2 |
| TATA MOTORS | 156.8 | 151.65 |
| TATA STEEL | 462 | 454.8 |
| TCS | 2102.55 | 2108.2 |
| TECH MAHIND | 665.7 | 674.85 |
| TITAN COMPA | 1097 | 1101.2 |
| ULTRATECH C | 4539.1 | 4480.7 |
| UPL LIMITED | 631.25 | 634.85 |
| VEDANTA LIM | 163.65 | 160 |
| WIPRO LTD | 267.75 | 266.95 |
| YES BANK LI | 92.45 | 93 |
| ZEE ENTERTA | 354.8 | 332.75 |

**నిఫ్టీ నెక్స్ట్ ఫిఫ్టీ**

| | | |
|---|---|---|
| ABB INDIA L | 1507.95 | 1514.2 |
| ACC LIMITED | 1550 | 1536.05 |
| AMBUJA CEME | 211.7 | 208.85 |
| ASHOK LEYLA | 85.15 | 84.8 |
| BAJAJ HOLDI | 3546.95 | 3580.9 |
| BANDHAN BAN | 556.1 | 534.55 |
| BANK OF BAR | 126 | 124.25 |
| BHEL | 65.05 | 66.75 |
| BIOCON LIMI | 252.65 | 246.6 |
| BOSCH LIMIT | 16024.75 | 15915.45 |
| CADILA HEAL | 234.35 | 228.3 |
| COLGATE PAL | 1136.8 | 1150.55 |
| CONTAINER C | 557.9 | 555.35 |
| DABUR INDIA | 409.25 | 409.75 |
| DLF LIMITED | 186 | 177.7 |
| AVENUE SUPE | 1373 | 1350.8 |
| GENERAL INS | 232.2 | 231.1 |
| GODREJ CONS | 635.55 | 637.75 |
| HAVELLS IND | 719.1 | 726.55 |
| HDFC AMC LI | 1919.8 | 1945.25 |
| HDFC LIFE I | 467.8 | 455.75 |
| HINDUSTAN P | 286.6 | 286.7 |
| HINDUSTAN Z | 228.05 | 223.1 |
| ICICI LOMBA | 1057 | 1058.8 |
| ICICI PRU L | 381.3 | 372.9 |
| VODAFONE ID | 11.65 | 11.25 |
| INTERGLOBE | 1354.5 | 1398.05 |
| L&T FINANCE | 119.9 | 119.3 |
| LUPIN LIMIT | 753.65 | 760.15 |
| MARICO LIMI | 368.1 | 370.4 |
| UNITED SPIR | 566.2 | 560.45 |
| MOTHERSON S | 120.2 | 118.15 |
| MRF LTD | 56163.9 | 55196.9 |
| NHPC LTD | 23.9 | 23.85 |
| THE NEW IND | 141.95 | 143.75 |
| NMDC LTD. | 110.05 | 113.55 |
| ORACLE FIN | 3283 | 3144.45 |
| PAGE INDUST | 20842 | 20169.45 |
| PIRAMAL ENT | 1963.6 | 1937.05 |
| PETRONET LN | 250.25 | 244.2 |
| P&G HYGIENE | 10901.35 | 10921.9 |
| PIDILITE IN | 1187.3 | 1183.25 |
| STEEL AUTHO | 46.75 | 45.8 |
| SBI LIFE IN | 754.1 | 741.95 |
| SHREE CEMEN | 21436.75 | 21199.55 |
| SIEMENS LTD | 1235.95 | 1212.8 |
| SHRIRAM TRA | 1043.55 | 1034.2 |
| UNITED BREW | 1365.35 | 1352.7 |




# బడ్జెట్‌లో ఏపీకి దక్కిందేమీ లేదు

- విభజన హామీలను విస్మరించారు
- రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి


సాక్షి, న్యూఢిల్లీ



బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు దక్కిందేమీ లేదని వైఎస్సార్‌సీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. గురువారం రాజ్యసభలో కేంద్ర బడ్జెట్‌పై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. 'ఆంధ్రప్రదేశ్‌లోని ఐదు కోట్ల ప్రజలు ఈ బడ్జెట్ కోసం ఎన్నో ఆశలతో ఎదురుచూశారు. కానీ వారి ఆశలన్నీ అడియాశల య్యాయి. రాష్ట్ర విభజన సమయంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని అనేక సమస్యలకు పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చింది. కానీ ఇంతవరకు వాటిని నెరవేర్చలేదు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదు. అందుకే కేంద్రం నుంచి సాయం కోరుతున్నాం. విభజన హామీగా ఉన్న ప్రత్యేక హోదాను కేంద్రం విస్మరించింది. అలాగే ఆంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు, 2014–15 నాటి రెవెన్యూ లోటు అంశాలను పూర్తిగా విస్మరించింది. 2014–15లో తొలి 10 నెలల కాలానికి రెవెన్యూ లోటు భర్తీ చేస్తామని విభజనకు ముందు కేంద్రం హామీ ఇచ్చింది. ఈ దిశగా రూ. 4 వేల కోట్లు మాత్రమే ఇచ్చింది. ఏపీ ప్రభుత్వ అకౌంటెంట్ జనరల్ రెవెన్యూ లోటును రూ. 16 వేల కోట్లుగా తేల్చారు. కానీ కేంద్ర ఆర్థిక శాఖ దీనిపై అభ్యంతరం తెలిపింది. చర్చలు, సంప్రదింపుల అనంతరం అరుణ్ జైట్లీ హయాంలో ఈ రెవెన్యూ లోటును రూ. 7,500 కోట్లుగా తేల్చినట్టు తెలిసింది. కానీ అది కూడా ఇవ్వలేదు. ఇక పోలవరం అంచనా వ్యయం పెంపును కేంద్రం ఆమోదించినప్పటికీ.. ఆర్థిక శాఖ వద్ద ఇంకా ఫైల్ పెండింగ్‌లో ఉంది. త్వరితగతిన పోలవరం ప్రాజెక్టుకు నిధులు విడుదల చేసి ఏపీ ప్రజల కల సాకారం చేయాలి. బడ్జెట్‌లో విశాఖ, విజయవాడ మెట్రో రైలు గురించి ప్రస్తావించలేదు. కడప స్టీల్ ప్లాంట్, దుగరాజపట్నం ఓడరేవు గురించి బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. వెనుకబడిన జిల్లాలకు నిధులు కేటాయించలేదు. ఐఐటీ తదితర జాతీయస్థాయి విద్యా సంస్థలన్నీ తాత్కాలిక భవనాల్లోనే కొనసాగుతున్నాయి. వీటికి కూడా నిధులు కేటాయించలేదు' అని పేర్కొన్నారు.

# పెట్రోల్, డీజిల్‌పై అదనపు పన్ను భారమే

బడ్జెట్‌పై చర్చలో వైఎస్సార్ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి



**సాక్షి, న్యూఢిల్లీ:** పెట్రోల్, డీజిల్‌పై అదనంగా ఎక్సైజ్ పన్ను విధించడం వల్ల సామాన్యుడిపై ఆర్థిక భారం పడుతుందని వైఎస్సార్ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. గురువారం రాజ్యసభలో బడ్జెట్‌పై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. 'బడ్జెట్ సానుకూలంగా ఉంది. పరిశోధనారంగం ముందడుగు వేసేలా ఈ బడ్జెట్‌లో చర్యలు తీసుకున్నారు. ద్రవ్యలోటు 2017–18లో జీడీపీలో 3.5 శాతం, తదుపరి ఏడాది 3.4 శాతంగా నిలిచింది. ప్రస్తుతం దాన్ని 3.3 శాతంగా అంచనా వేశారు. దీని ఆధారంగా చూస్తే ఆర్థిక వృద్ధి కనిపిస్తోంది. కానీ ద్రవ్యలోటును వాస్తవ విలువలో చూస్తే మాత్రం ద్రవ్యలోటు పెరిగినట్లు అవగతమవుతోంది. ప్రభుత్వ రుణాలు, వాటిపై వడ్డీ పెరగడమే ఇందుకు ప్రధాన కారణం. ప్రత్యక్ష, పరోక్ష పన్నుల వసూళ్లలోనూ వృద్ధి కనిపిస్తోంది. 2014–15లో ప్రత్యక్ష, పరోక్ష పన్నుల వసూళ్లు జీడీపీలో 5.4 శాతం, 5.2 శాతం ఉండగా.. 2018–19లో అది 6.4 శాతం, 5.5 శాతానికి పెరిగింది. అయితే 2019–20లో వీటిని 6.3 శాతం, 5.3 శాతంగా అంచనా వేశారు. ఈ తగ్గుదలకు గల కారణాలపై ఆర్థిక మంత్రి దృష్టిపెట్టాలి. ఇక ఇండెక్స్ ఆఫ్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ (ఐఐపీ) గణాంకాలు చూస్తే 2017–18 నుంచి 2018–19 వరకు గణనీయమైన వృద్ధి కనబరచింది. కొన్ని నెలల్లో ఐఐపీ 5 నుంచి 10 శాతం మధ్య పెరిగింది. అయితే ఫిబ్రవరి నుంచి మార్చి వరకు ఐఐపీ తగ్గింది. దీనిపై ఆర్థిక మంత్రి దృష్టిసారించాలి. రైల్వే విషయానికి వస్తే 2019–20 అంచనాల్లో ఆపరేటింగ్ రేషియోను 98.4 నుంచి 95కి తగ్గించారు. ఇది ప్రమాదకర పరిస్థితి. ఇక ప్రధాన మంత్రి ఆవాస్ యోజనలో భాగంగా 81 లక్షల ఇళ్లు మంజూరు చేస్తే అందులో 24 లక్షల ఇళ్లు.. అంటే దాదాపు 30 శాతం నిర్మాణం పూర్తయ్యాయి. ఇది చక్కటి ముందడుగు. అలాగే ఎలక్ట్రిక్ వాహనాల వ్యయాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకోవడం స్వాగతించదగిన పరిణామం. అయితే రోడ్, ఇన్‌ఫ్రా సెస్ కింద పెట్రోల్, డీజిల్‌పై రూ. 1 అదనపు ఎక్సైజ్ పన్ను విధించడం వల్ల సామాన్యుడిపై ఆర్థిక భారం పడుతుంది. దీనిపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి..' అని పేర్కొన్నారు. ఇక ఆంధ్రప్రదేశ్‌కు ఈ బడ్జెట్ ఏమీ ఇవ్వలేదని అసంతృప్తి వ్యక్తం చేస్తూనే.. స్థూలంగా చూస్తే బడ్జెట్ బాగుందని పేర్కొన్నారు.

- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా నియమితులైనందున లాభదాయక పదవుల నిబంధన వర్తిస్తుందని, అందువల్ల ఆయనపై అనర్హత వేటు వేసి ఎంపీ పదవి నుంచి తొలగించాలని టీడీపీ ఎంపీలు రాష్ట్రపతికి ఫిర్యాదు చేశారు.







# త్వరలో విజయవాడ బైపాస్ రోడ్ పనులు

**సాక్షి, న్యూఢిల్లీ:** విజయవాడ ఆరు లైన్ల బైపాస్ రోడ్డు (ఇన్నర్ రింగ్ రోడ్డు) పనులు త్వరలోనే ప్రారంభిస్తామని కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. గురువారం లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో వైఎస్సార్‌సీపీ ఎంపీ బాలశౌరి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. ఎన్‌హెచ్–16లోని గుండుగొలను సెక్షన్ పరిధిలో విజయవాడ ఆరు లైన్ల బైపాస్ రోడ్డు ఎప్పుడు నిర్మిస్తారని ఎంపీ ప్రశ్నించగా ప్రస్తుతం ఈ అంశానికి సంబంధించి తన వద్ద పూర్తి సమాచారం లేదని, అయితే సాధ్యమైనంత త్వరగా పనులు ప్రారంభిస్తామని మంత్రి సమాధానం ఇచ్చారు.



**కాకినాడ-పుదుచ్చేరి మధ్య నదీ రవాణ ప్రతిపాదన లేదు..**

కాకినాడ–పుదుచ్చేరి మధ్య బకింగ్‌హాం కెనాల్‌లో నదీ రవాణా వ్యవస్థ అభివృద్ధికి ప్రతిపాదనేదీ లేదని, అలాగే దీనిని విశాఖపట్నం వరకు పొడిగించే ప్రతిపాదన కూడా లేదని కేంద్ర నౌకాయాన శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ అడిగిన ప్రశ్నకు గురువారం మంత్రి రాతపూర్వక సమాధానం ఇచ్చారు. అయితే జాతీయ జల మార్గం–4 పరిధిలోని విజయవాడ–ముక్త్యాల మధ్య కృష్ణా నదిలో నదీ రవాణా వ్యవస్థ స్థాపన పనులు నడుస్తున్నాయని వివరించారు. దుర్గాఘాట్, భవానీ ఐల్యాండ్, అమరావతి, వేదాద్రి వద్ద ఫ్లోటింగ్ టెర్మినల్స్ ఉంటాయని, ఇబ్రహీంపట్నం, హరిశ్చంద్రాపురం, ముక్త్యాల, మాదిపాడు వద్ద శాశ్వత టెర్మినల్స్ ఉంటాయని మంత్రి వివరించారు.



## 881 బెల్ట్ షాపులపై దాడులు

### డీజీపీ గౌతం సవాంగ్

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో మద్యం బెల్ట్ షాపులు ఉండటానికి వీల్లేదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ఆదేశాలతో బెల్ట్ షాపులపై పెద్ద ఎత్తున దాడులు నిర్వహిస్తున్నట్టు డీజీపీ గౌతమ్ సవాంగ్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా బెల్ట్ షాపులను నిర్మూలించేందుకు చేపట్టిన చర్యలపై గురువారం డీజీపీ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఏడాది మే 30వ తేదీ నుంచి జూలై 10వ తేదీ వరకు రాష్ట్రంలో 881 బెల్ట్ షాపులపై పోలీసులు దాడులు నిర్వహించినట్టు వెల్లడించారు. అనుమతిలేకుండా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న 780 మందిపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేసినట్టు పేర్కొన్నారు. కర్నూలు జిల్లాలో అత్యధికంగా 304, విశాఖలో అత్యల్పంగా రెండు బెల్ట్ షాపులపై దాడులు చేసి మూయించినట్టు తెలిపారు. ఎక్కడైనా మద్యం బెల్ట్ షాపులు నిర్వహిస్తుంటే ప్రజలు తమకు సమాచారం ఇవ్వాలని డీజీపీ కోరారు.

## ఎక్సైజ్ పాలసీ అధ్యయనానికి కేరళకు అధికారుల బృందం

**సాక్షి, అమరావతి:** అక్టోబరు నుంచి అమల్లోకి రానున్న కొత్త ఎక్సైజ్ పాలసీకి సంబంధించి కేరళలో అధ్యయనం చేసేందుకు ఐదుగురు అధికారుల బృందాన్ని కమిషనర్ ఎం.ఎం.నాయక్ ఎంపిక చేశారు. ఈ అధికారుల బృందంలో తిరుపతి డిస్టిలరీస్ విభాగంలో పని చేస్తున్న అసిస్టెంట్ కమిషనర్ అనిల్‌కుమార్‌రెడ్డి, మచిలీపట్నం ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎం.మనోహ, అనంతపురం డిపో మేనేజర్ శ్రీనివాసరెడ్డి, ఏపీబీసీఎల్‌లో పదవీ విరమణ చేసిన అధికారి మూర్తి, ట్రైనీ ఏఈఎస్ మణికంఠ ఉన్నారు. వీరు కేరళ రాష్ట్రంలో పర్యటించి అక్కడి ఎక్సైజ్ శాఖ స్వరూపం, ఎంత మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు, మద్యం షాపుల ఏర్పాటు తదితర అంశాలపై అధ్యయనం చేసి నివేదిక ఇవ్వనున్నారు.

## కీలక పార్లమెంటరీ కమిటీల్లో వైఎస్సార్‌సీపీ సభ్యులు

**సాక్షి, న్యూఢిల్లీ:** కీలకమైన పార్లమెంటరీ కమిటీల్లో వైఎస్సార్‌సీపీ సభ్యులు ముగ్గురికి స్థానం లభించింది. ప్రజా పద్దుల కమిటీ, అంచనాల కమిటీ, పబ్లిక్ అండర్‌టేకింగ్స్ కమిటీల్లో వైఎస్సార్‌సీపీ సభ్యులు నియమితులయ్యారు. అంచనాల కమిటీలో మాగుంట శ్రీనివాసులురెడ్డి, ప్రజా పద్దుల కమిటీలో బాలశౌరి, పబ్లిక్ అండర్‌టేకింగ్స్ కమిటీలో రఘురామకృష్ణంరాజు సభ్యులుగా ఉండనున్నారు.

## 16న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమావేశం

**సాక్షి, అమరావతి:** పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో 16వ తేదీన ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశం జరుగనుందని సంఘం రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏలూరు కొత్త బస్టాండ్ సమీపంలోని ఎస్‌టీయూ భవన్‌లో ఉదయం 10 గంటలకు జరిగే సమావేశంలో భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ అధ్యక్షుడు పెరియస్వామి, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఓబులేసు తదితరులు పాల్గొంటారని వెల్లడించారు.

## 'మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకూ రూ.18 వేల వేతనం ఇవ్వండి'


**సాక్షి, అమరావతి:** మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులందరికీ రూ.18 వేల కనీస వేతనం ఇవ్వాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కిర్ల కృష్ణారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేసే విషయమై రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించడాన్ని స్వాగతించారు. మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగంలోని వారితో పాటు కాంట్రాక్ట్ కార్మికులందరికీ రూ.18 వేల వేతనం ఇవ్వాలని కోరారు. 110 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో అత్యవసర సర్వీసుల విభాగంగా పారిశుద్ధ్య కార్మికులు, వాటర్ వర్క్స్, ఇంజినీరింగ్, పార్కింగ్, సెక్యూరిటీ గార్డులుగా పని చేస్తున్న వారికి కూడా వేతనాలు పెంచాలని కోరారు.


# సీఆర్‌డీఏ కూల్చివేత ఉత్తర్వుల అమలు నిలుపుదల

కృష్ణా కరకట్ట నిర్మాణాలపై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ

**సాక్షి, అమరావతి:** కృష్ణా నది కరకట్ట సమీపంలోని తమ భవనాన్ని అక్రమమైనదిగా పేర్కొంటూ, దానిని తొలగించే నిమిత్తం సీఆర్‌డీఏ జారీ చేసిన ప్రాథమిక ఉత్తర్వులను సవాలు చేస్తూ చందన కేదారీష్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై గురువారం విచారణ జరిపిన హైకోర్టు, సీఆర్‌డీఏ జారీ చేసిన ప్రాథమిక ఉత్తర్వుల అమలును మూడు వారాల పాటు నిలుపుదల చేసింది. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలంటూ సీఆర్‌డీఏ కమిషనర్ తదితరులకు నోటీసులు జారీ చేసింది. అంతేకాక అక్రమ కట్టడాల తొలగింపు విషయంలో జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) ఇచ్చిన ఉత్తర్వుల కాపీని తమ ముందుంచాలంది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ దుర్గాప్రసాదరావు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. తమ జీ+2 భవనం కృష్ణానదికి 100 మీటర్ల వెలుపల ఉన్నా, వంద మీటర్ల లోపు ఉందని పేర్కొంటూ కూల్చివేతకు ఏడు రోజుల గడువునివ్వడాన్ని సవాలు చేస్తూ చందన కేదారీష్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై గురువారం జస్టిస్ దుర్గాప్రసాదరావు విచారణ జరిపారు.




Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP), and D. No. 5- 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503. Editor: V. Murali, Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23794.